REGD No. H 18

విడిప్రతి 0-25 పై.

4-11-66 శుక్రవారం

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 38 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 44


## అనుచితం, అనౌదార్యం!

విజయవాడ విద్యార్థులు శ్రీ నీలం సంజీవరెడ్డిగారిపట్ల అనుచితంగా, అనౌదార్యంగా వ్యవహరించారు. ఉక్కుఫ్యాక్టరీ సమ్మెలో పాల్గొన్న విద్యార్థులు పుత్ర్పంగా సంజీవరెడ్డిగారి కాంస్యవిగ్రహం వద్దకువచ్చి దాన్ని వికృతంచేసి, చెవ్వులు దీవర్లతోకొట్టి, తుంటుతుంటలుచేసి, ఏలూరుకాల్వలో విసరిపారేశారట. జుగుప్సాకరమైన సంఘటన ఇది. సభ్యత సంస్కృతిలేని అల్లరిచర్య ఇది. రాజకీయంగా విభేదించవచ్చు. కాని సంజీవరెడ్డిగారు ప్రధానులైన ఒక ఆంధ్ర నాయకుడనేది వివాదరహితం. ముఖ్యమంత్రిగా రాష్ట్రశ్రేయస్సుకు కృషిచేసిన వ్యక్తి అనేదికూడా విస్మరించలేము. అలాంటి నాయకుణ్ణి వ్యక్తిగతంగా అవమానించడం గర్హనీయం. అది సంజీవరెడ్డికి జరిగిన అవమానంకాదు; తెలుగు సంస్కృతికే అపచారంకాదా?

# నెల్లూరు విద్యార్థుల శ్లాఘనీయ వైఖరి

## ప్రదర్శనలకు పూనుకొనకుండా, అరాజకశక్తులకు చోటివ్వకుండా, బంద్‌తో సహకరించకుండా ప్రశాంతంగా నిరాహారదీక్ష సాగించారు- భావితరానికి మార్గాన్ని చూపారు!

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకొరకు; అమృతరావుగారి ప్రాయోపవేశానికి సానుభూతిగా నెల్లూరు వి. ఆర్. కాలేజి విద్యార్థులు గత 28 తేదినుండి సమ్మె చేస్తున్నారు; 29 తేదినుండి నిరాహారదీక్ష కొనసాగిస్తున్నారు. ఉత్సవాలు, ప్రదర్శనలు, అల్లరులు అర్భాటాలు ఏమీలేకుండా, అరాజకశక్తుల ప్రవేశానికి అవకాశమివ్వకుండా, కమ్యూనిస్టులవంటి రాజకీయవాదులకు చోటివ్వకుండా వీరు ఈవుద్యమాలను ప్రశాంతంగా గంభీరంగా జరపడం విశేషం.

నెల్లూరులో ఏచిన్న సంఘటన జరిగినా కాలేజి విద్యార్థులు వీధులలో పడేవారు; రైలుకట్ట ఎక్కేవారు; అల్లరుచేసేవారు; దౌర్జన్యాలకు ఆస్కారం కల్గించేవారు; తీరని చెడ్డపేరు తెచ్చుకొనేవారు. ఈసంవత్సరం విద్యార్థులు నూతనాధ్యాయాన్ని ప్రారంభించారు; అల్లరతో నిమిత్తంలేకుండా ఆందోళన సాగించవచ్చునని రుజువుచేశారు; అందరి అభినందనలకు పాత్రులైనారు; భవిష్యత్ తరం విద్యార్థులకు మార్గాన్నిచూపారు; నెల్లూరుకు గౌరవాన్ని చేకూర్చారు.

నాయకత్వం బాధ్యతాయుతమైనదైతే, చేసేపని చిత్తశుద్ధితో కూడినదైతే వుద్యమం తప్పుమార్గం పట్టదని, దుర్ఘటనలకు తావివ్వదని వి. ఆర్. కాలేజి విద్యార్థులు చాటారు. ఈసారి విద్యార్థులను మంచిమార్గంలో నడిపిన కాలేజి స్టూడెంట్సు యూనియన్ కార్యకర్తలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము. వీరినిచూచైనా పెద్దవాళ్లనుకునేవారు బాధ్యతలు నేర్చుకోదగి వుంటుంది.

టవున్‌లో అన్ని కళాశాలలు, అన్ని హైస్కూళ్ళు సమ్మెలో పాల్గొన్నవి. 2 తేదిమాత్రం బంద్ సందర్భంలో విద్యాలయాలను మూసివేయవలసిందిగా జిల్లాఅధికార్లు ఆదేశించినట్లుంది. వారంరోజులపాటు సమ్మెజరిగినా ఒక్క చిన్న దుస్సంఘటన కూడా లేకపోవడం గమనార్హం.

2 తేది బంక్ సందర్భంలో కూడా అవాంఛనీయమైన సంఘటన ఏదీ జరగలేదు. బహిరంగసభ జరుపుకోవాలని కమ్యూనిస్టులు విశ్వప్రయత్నం చేశారు కాని, సాగలేదు. టవున్‌లో అంగళ్లు, సినిమాలు, బస్సులు, బండ్లు, రిక్షాలు అన్నీ వాటంతటవే నిల్చిపోయాయి. సంతపేటలో శోభనా పెయింట్సు రామచంద్రమూర్తి

—కొరవ 7 వ పేజీలో

## 'కామరాజ్ డౌన్'

### కాంగ్రెస్‌శాసనసభ్యునిచేత అనిపించిన విద్యార్థులు

2 తేది సాయంత్రం మద్రాసు నుండి కారులో వస్తుండిన శాసనసభ్యుడు శ్రీ ఎం. మునుస్వామిని సూళ్లూరుపేట వద్ద విద్యార్థులు ఆపి "కామరాజ్ డౌన్ డౌన్" అని అనమన్నారట. అనక తప్పేదేముంది? ఒక్కసారి కాదు, వరుసగా మూడుసార్లుఅనిపించి ఆ పిమ్మట వదిలారట.

మూకవిచ్ఛిశక్తి ఎవరిచేతైనా ఏమైనా చేయిస్తుంది!

ఐదురోజులపాటు

## అంధకారంలో వుండిపోయిన ఆంధ్ర

ఆంధ్రప్రదేశ్ వొక్కసారిగా పతాకశీర్షికలకు ఎక్కింది. ఈవారం రోజులూ ఆంధ్రప్రదేశ్ అట్టుడికిపోయింది. ఐదో వుక్కుకర్మాగారం విశాఖపట్నంలోనే స్థాపించితీరాలని కోరుతూ శ్రీ టి. అమృతరావు సాగిస్తున్న నిరాహారదీక్షకు సానుభూతి పేరుతో చెలరేగిన వుద్యమం యీవారంలో తారస్థాయి నందుకున్నది. మొత్తం 17 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నది. రైల్వే ఆస్తికి అమితంగా నష్టం చేకూరింది. 3, 4 రోజులపాటు అన్ని రోట్ల, అన్ని కళాశాలలు, అన్ని పాఠశాలలు మూతబడ్డాయి. విద్యార్థుల సానుభూతి నిరాహారదీక్షలు, ప్రదర్శనలు, ఆందోళనలు, నినాదాలు కొనసాగాయి. ఐదురోజులపాటు ఆంధ్రప్రదేశ్ మండలంలో రైళ్ల రాకపోకలు నిల్చిపోయాయి, పోస్టల్‌బట్వాడా బంద్రైపోయింది. ఆంధ్ర అంధకారంలో వుండిపోయింది.

—కొరవ 7 వ పేజీలో

## శ్రీ అమృతరావు ప్రాయోపవేశం విరమణ

విశాఖపట్టణంలో ఐదవ ఉక్కుకర్మాగారంకోసం అక్టోబరు 15 తేది ప్రాయోపవేశ దీక్షను ప్రారంభించిన గాంధేయుడు శ్రీ టి. అమృతరావు 3 వ తేది విరమించారు; ఐదవ ఉక్కు ఫ్యాక్టరీ విషయమై కేంద్రం ప్రకటన ఈ సాయంకాలం వెలువడుతుంది.

ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిగారు ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షునితోకలసి 3 తేది విశాఖపట్నం పోయారు; కేంద్ర ప్రభుత్వ వైఖరిని వివరించి నిరాహార దీక్షను విరమించవలసిందిగాకోరారు. సరిగా మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మానందరెడ్డిగారు నిమ్మపండ్లరసంగ్లాసు అందివ్వగా, అమృతరావుగారు త్రాగి దీక్ష విరమించారు.

ఈ రోజు జరుగబోయే ప్రకటన అనుకూలంగా వుండవచ్చునని వూహిస్తున్నారు. లేకుంటే ముఖ్యమంత్రి అమృతరావుకు హామీ యిచ్చివుంటరని, అమృతరావుగారు దీక్ష విరమించి వుండరని వూహిస్తున్నారు. ముఖ్యమంత్రి

—కొరవ 7 వ పేజీలో





*** ఒక సంతోషవార్త ***

అఖిలభారత ఖ్యాతి గడించి

శ్రేష్ఠతకు - కమ్మదనానికి ప్రసిద్ధి కెక్కిన

# పార్లీస్ పానీయాలు

గోల్డుస్పాట్ - కిస్మత్ - పార్లీకోలా - హాట్-స్పాట్ జింజర్

రిమ్-జిమ్ - లెమన్ - పార్లీసోడా

## Parle's Soft Drinks

Gold Spot - Kismet - Parle Cola - Hot-Spot Ginger

Rim Zim - Lemon - Parle Soda.

నెల్లూరుజిల్లాకు మేము డిస్ట్రిబ్యూటర్లుగా నియమింపబడినామని తెలియజేయుటకు సంతసిస్తున్నాము.

నెల్లూరుటౌనులోను - ఇతర చోట్లలోను డీలర్సుగా వుండేందుకు వివరాలు ఈ క్రిందివారితో సంప్రతించండి.

C. Chandrasekhar Reddy, Managing Partner.

Phone : : P P. 160.

VIJAY ENTERPRISES

POGATHOTA—NELLORE.

Please Speak
To Your
Photo Ethiraj
Phone: 616
Nellore.

**Central Warehousing Corporation Handling and Transport Contract**

## Tender Notice

(1) Sealed tenders will be received by the Superintendent, Central Ware House. Nellore at his Office upto 2 p.m. on 15th November, 66, for the work of Handling and transport work in the Central Warehouse, Nellore.

(2) Tender documents can be had from the Central Ware House, Nellore on payment of Rs. 5/- towards the cost which is not refundable.

**G. RAMA RAO,**
Superintendent,
Central Warehouse,
NELLORE.

**In the Court of the District Judge of CHITTOOR.**
O. P. No. 59 of 1966.
BETWEEN:-
A. Muneeswara Reddy ... —Petitioner.
AND
Sampoornamma and another ... —Respondents.

Whereas the petitioner has filed the above petition for grant of Letters of Administration for taking delivery of the jewels pledged with the State Bank of India, Chittoor, in G. L. No. 7/285, by the late Adhireddy Krishnareddy of Aragonda, B. Palyam Tq., Chittoor Dt. any person having an objection may appear the above Court on 8—11—66 at 11 a.m. and file objections as otherwise the matter will be decided an merits.

—P.P. Ramaswamireddy,
Advocate for Petitioner.

**నెల్లూరు పొగతోటలో**
**యిల్లు అమ్మబడును**

మా తాలూకు నెల్లూరు పొగతోట సమీపం బాలీషేలఅగ్రహారంలోని నెం. 16/520 దు మిద్దెయిల్లు అమ్మబడును. 40 అంకణముల బానాలో రెండు మిద్దెటిల్లు. అన్ని సౌకర్యములు గలవు.

**కాకుటూరు పేరారెడ్డి,**
(అడ్రసు - అదేయిల్లు)

**కర్నూలు డి॥ ము॥ కోర్టులో**
S. C. No. 296 of 1966.
అనంత నాగన్నశెట్టి —వాది.
బలువాల బాలవెంకట నారాయణశెట్టి } —ప్రతివాది.

ప్రామిసరినోటుపైన నిల్వబాకీ రు. 313-10 పైసలు రాబట్టుకొనుటకు పైదావా దాఖలు కాబడి ప్రతివాదికి సమన్లు వాయిదా 15-11-1966 తేదికి వేయబడి వున్నదని తెలుపడమయినది.

—జె. రామయ్య - వాదిప్లీడరు.

★ జమీన్‌రైతు ★
శ్రీ పరాభవ ఆశ్వయుజ బహుళ షష్ఠి ★ శుక్రవారం 4-11-1966

# రాష్ట్రంలో అరాజకం

ప్రశాంతంగావున్న ఆంధ్రప్రదేశ్‌లో అనూహితంగా రెండు సమస్యలు తలెత్తి అల్లకల్లోలంగావుంది.

విశాఖపట్నంలో ఉక్కుఫ్యాక్టరీ కోసం అమృతరావుగారు ప్రాయోపవేశం చేస్తున్నారు; ఇరవైరోజులు దాటింది ఈ నిరాహారదీక్ష. రాష్ట్రవ్యాప్తమైన వుద్యమానికి దారితీసింది. ప్రాయోపవేశాలు, సమ్మెలు, హర్తాళ్ళు, పోలీస్‌స్టేషన్లు-రైల్వేస్టేషన్లముట్టడి, దగ్ధం, ప్రభుత్వ కార్యాలయాల విధ్వంసంలాంటి అరాజకచర్యలు, పోలీస్‌కాల్పులు, మరణాలు....అంతా అల్లకల్లోలమై; రైళ్లు, బస్సులు ఆగిపోయి, తపాలే కాకుండ టెలిఫోన్, టెలిగ్రాంవంటి సౌకర్యాలు కూడా భగ్నమై ప్రజాజీవితం పూర్తిగా స్తంభించిపోయింది. కడకు వార్తాపత్రి కలుకూడా లేకుండా తెనుగుప్రజలు చీకటిలో వుండిపోవలసివస్తున్నది.

ఇక రెండవది-ఉస్మానియాయూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ వ్యవహారం. ప్రభుత్వం క్రొత్త వైస్‌ఛాన్సలర్‌గా డాక్టరు నరసింహారావును నియమించింది; వారు గవర్నరు వద్ద ప్రమాణస్వీకారంకూడాచేశారు. కాని పాత వైస్‌ఛాన్సలర్ శ్రీ డి. ఎస్. రెడ్డి సుప్రీంకోర్టులో అప్పీలుచేసి, ఇంజంక్షన్ వుత్తరువుపొంది, తానే వైస్‌ఛాన్సలర్ అన్నారు. డి. ఎస్. రెడ్డిగారే వైస్‌ఛాన్సలర్‌గా వుండాలని ఆ యూనివర్సిటీలోని అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఆందోళన ప్రారంభించారు. క్రొత్త వైస్‌ఛాన్సలర్‌ను యూనివర్సిటీ ప్రాంగణంలోకి అడుగు పెట్టనివ్వలేదు; రిజిష్ట్రారును గృహనిర్బంధంలో వుంచివేశారు; కాలేజీలు మూతబడ్డాయి; పరిస్థితి వుద్రేకంగా తయారైంది.

ఇవి రెండూ చాలవన్నట్లు, సమయం చూచి కమ్యూనిస్టులూ సందుకున్నారు. నవంబరు 16 తేది బరపాలనుకున్న బంద్‌ను 2 తేదికి మార్చుకొని ఏమో చేయాలనుకున్నారు; పూర్తిగా విఫలమయ్యారు. ఇంకోసారి యిలాంటి బుద్ధి తక్కువపని చేయకుండ ప్రజలు పాఠం చెప్పారు.

ఒక్కసారి, వున్నట్లుండి రాష్ట్రం యింత విషమస్థితికి గురికావడం; ఆందోళనలు వుద్యమాలు అరాజకానికి దారితీసి, విపరీత వికృత రూపాలను పొందడం రాష్ట్ర దేశశ్రేయస్సులనుకోరే ప్రతి ఆంధ్రుని హృదయాన్ని ఆందోళన పరుస్తున్నాయి. ఈ స్థితిలో దేశం భవిష్యత్తు ఏమిటా అనే నిర్వేదంతో అతడు ఆవేదనచెందుతున్నాడు. ఈ ప్రజాస్వామ్యం వద్దుబాబో అని మూగగా ఘోషిస్తున్నాడు.

ఐదవ ఉక్కుఫ్యాక్టరీ విశాఖపట్నంలో నెలకొల్పాలనేకోరిక అసమంజసమైనదేమీ కాదు; న్యాయమైనది. ఆకోర్కె ప్రభుత్వం ద్వారా, మంత్రివర్గ ప్రయత్నంద్వారా, శాసనసభద్వారా, ఢిల్లీలోని ఆంధ్ర మంత్రులు-పార్లమెంటుసభ్యులద్వారానెరవేరడం సమంజసంగా వుంటుంది. అలా నెరవేరాలనే మనందరి కోర్కె. ఆంధ్రప్రభుత్వమూ దీనికొరకు గట్టిగా కృషి చేస్తున్నది; ఉక్కుఫ్యాక్టరీ సాధన రాష్ట్రాభివృద్ధికేకాక, తమందరి రాజకీయ భవిష్యత్తుకుకూడా అవసరమని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ విషయంలో ప్రజాభిప్రాయం ఎంత గాఢంగా వుందో నిత్యం ప్రకటిత మవుతూనే వుంది. అమృతరావుగారి ప్రాయోపవేశం ప్రజాభిప్రాయానికి మరో ప్రతిబింబం. అందువల్ల ఈ ఆందోళనను కేంద్రం గుర్తించకుండా వుండే అవకాశంలేదు.

మరి, అమృతరావుగారి ప్రాయోపవేశపర్యవసానంగా సంభవించిన విషాద సంఘటనలనంతరం, ఉక్కుఫ్యాక్టరీ విషయంలో సరైన నిర్ణయం తీసుకోవలసిన అవసరాన్ని, పరిస్థితి తీవ్రతను ప్రధాని కాని, కాంగ్రెస్‌నాయకత్వంగాని గుర్తించకుండావుండే వీలులేదు. బ్రహ్మానందరెడ్డిగారు ఢిల్లీకిపోయి కేంద్రమంత్రి వర్గాన్ని కదిలించివచ్చారు; వాల్తేరు విశాఖ ఉక్కుఫ్యాక్టరీకి సుముఖంగా వున్నట్టే వార్తలొస్తున్నవి. అమృతరావుగారి దీక్ష సత్ఫలితాన్నే సాధించిందని చెప్పవచ్చు; రాష్ట్రం ఇప్పటికే కల్లోలితమై పోయింది. ప్రజలు క్షోభిస్తున్నారు. ఇదే ఇంకా కొనసాగితే సంఘ వ్యతిరేకశక్తులు మరి విజృంభించి, రాష్ట్రానికి నిప్పుపెట్టేయ గలవు. రాష్ట్రశ్రేయస్సు కొరకు వుద్దేశించిన అమృతరావుగారి పవిత్ర ప్రాయోపవేశం, రాష్ట్ర వినాశానికి దారితీసిందనే అపవాదు రాకూడదు. అందువల్ల ముఖ్యమంత్రి మాటవిని దీక్ష విరమించవలసిందని; రాష్ట్రాన్ని అరాజకశక్తుల బారి నుండి కాపాడవలసిందని అమృతరావుగారికి విజ్ఞప్తి చేస్తున్నాము; ప్రార్థిస్తున్నాము.

ఇక ఉస్మానియా వ్యవహారం: విద్యార్థుల, వుపాధ్యాయులవైఖరి, ప్రవర్తన ప్రమాదకరంగా, లజ్జాకరంగా వుంది. వారు ఇదిరంగా ఎట్లా వ్యవహరించగలుగుతున్నారా అనుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఈవిధంగాఅయితే ఒక్క విద్యాసంస్థఅయినా జరుగుతుందాఅనిపిస్తుంది. ఏవర్గానికావర్గం దౌర్జన్య నిర్బంధ హింసాపద్ధతులద్వారా పరిపాలనను హస్తగతం చేసుకో దలుచుకుంటే, ఈరాజ్యం ఎంతకాలం నిలుస్తుందాఅనే భయం కలుగుతున్నది. దేశంలోని సంఘటనలన్నీ చూస్తుంటే, అత్యవసర పరిస్థితిని ప్రకటించి, రాష్ట్రపతి పరిపాలనను స్వీకరించి, ఇనుపచేతితో వ్యవహరించడం వుత్తమమనే అభిప్రాయం ప్రజలలో కలుగుతున్నది. ప్రజాస్వామ్యాన్ని ప్రాణప్రదంగా ఎంచే దేశంలో ఇలాంటి ఆలోచనలు, అభిప్రాయాలు కలగడం పరిస్థితుల శోచనీయస్థితికి ప్రబల నిదర్శనం. దేశాన్ని ఈబాధ్యతారహిత, అరాజకశక్తులనుండి కాపాడుటకు ప్రభుత్వమేకాదు, దేశశ్రేయాన్ని స్వీయ శ్రేయాన్నికోరే ప్రతిఒక్కరూ ఆలోచించవలసివుంది; తగిన చర్యలు తీసుకోవలసివుంది.

ఉస్మానియా అధ్యాపకులు, విద్యార్థులు అనుచితమైన తమ వుద్యమానికి స్వస్తి చెప్పి; విద్యాలయాల పవిత్రతను, అధ్యాపకవృత్తి వుదాత్తతను, విద్యా సముపార్జనా శీలాన్ని కాపాడవలసిందిగా కోరుతున్నాము. తమవుద్యమాన్ని ప్రజలు నిరసిస్తున్నారని, గర్హిస్తున్నారని వీరు గమనించడం అవసరం.

—

# సంస్కృతిలేని ప్రభుత్వం

పదిరోజులక్రితం 'హిందూ' ఆంగ్ల దినపత్రికలో ఒక వార్త పడింది. అట్లనే మూడునెల్లక్రితం 'ఇల్లస్ట్రేటెడ్‌వీక్లీ ఆఫ్ ఇండియా' ఆంగ్ల వారపత్రికలో మరో వ్యాసం పడింది. ఈ రెండుఅంశాలను చదివితేతెలుస్తుంది మనది సంస్కృతిలేని ప్రభుత్వంఅని. అంత హూనైనపదం ఎందుకనుకొంటే మనప్రభుత్వం మన సంస్కృతిపట్ల యెంత అశ్రద్ధగా ప్రవర్తిస్తున్నదో తెలుస్తుంది.

'హిందూ'లో పడినవార్త అమరావతికి సంబంధించినది. అమరావతిమ్యూజియం అఖిలభారతస్థాయిలోనే ప్రసిద్ధికెక్కింది. పూర్వం అమరావతిలోదొరికి, పురావస్తు ప్రాముఖ్యతకలిగిన స్థూపాలు, విగ్రహాలు బ్రిటిష్‌మ్యూజియంలోను, మరి కొన్ని ఫ్రాన్సు మ్యూజియంలో కాటోలు, ఇంకా మరికొన్ని మద్రాసు మ్యూజియంలోకూడావున్నాయి. ఆంధ్రుల ప్రాచీనసంస్కృతికి గర్వప్రాయమైన దర్పణం ఈ అమరావతిలో లభిస్తుంది. అట్టాంటిప్రఖ్యాతమైన ఈఅమరావతిలో ఆంధ్రప్రభుత్వం ఒక మ్యూజియంను నిర్వహిస్తున్నది. అదెంత నికృష్టమైన పరిస్థితిలోవున్నదో 'హిందూ' వార్త మనకు తెలియజేస్తుంది.

ఈ మ్యూజియం ప్రస్తుతం ఏ కళాకాంతి లేని ఒక పశువులకొట్టంవంటి సాలలో వుంటున్నదట. ఎప్పుడో, శాశ్వత భవనవసతికల్గేంతదాక,50ఏండ్లక్రితం తాత్కాలికంగా నిర్మింపబడిన ఈ కొట్టంలోనే మ్యూజియం మ్రగ్గిపోతున్నదట. అయితే రెండేళ్లక్రితం యీ మ్యూజియంకోసంగా అమరావతి బస్టాండువెనుక ఒక శాశ్వత భవనం నిర్మింపబడి, పురావస్తుశాఖవారికి సంవత్సరంక్రితం స్వాధీనంచేయబడినప్పటికీ ఈ మ్యూజియంను ఆ శాశ్వత భవనంలోకిమార్చే శ్రద్ధ, ఓపిక ప్రభుత్వానికిలేదు.

ఒక నకుపేద ఎన్. జి. ఓ. తన పాడుబడ్డయింటిలో సామానంతా కుక్కివేసినట్లుగా; కొన్నివేల సంవత్సరాలక్రితం అమరావతిలో దొరికిన విగ్రహాలు, బౌద్ధస్థూపాలకు సంబంధించిన సరంజామాఅంతా ఈ కొట్టంలో క్రిక్కిరిసినట్లు పడేసివున్నారట; ఒక పరస, ఒకపద్ధతిఅనేది లేకుండా!

ఇవిగాక అక్కడ రెండుకేసులు వున్నాయట. ఆ కేసులమీద - ధరణికోట శిధిలాల్లో లభించిన పురావస్తు ప్రాముఖ్యత కలిగిన సామానులు-అని వ్రాయబడి వుండటగానీ, ఆకేసులుతెరిస్తే అందులో యేమీలేవట. ఇప్పుడున్న మ్యూజియం చుట్టూ ముళ్లచెట్లు, పిచ్చిపిచ్చి పొదలు పెరిగి, అంతా ఏదో చిన్న అరణ్యంగా వుందట. ఈమ్యూజియంకన్నా ప్రక్కన వుండే పొగాకు గోడౌన్లే బాగున్నాయట! మ్యూజియం కార్యాలయంలో ఎవరో గుమాస్తాలు, చౌకీదార్లు వున్నారటగాని యీ నికృష్ట పరిస్థితుల్లో వారి వునికికే అర్థంలేకుండా పోయిందట. ఇంత నికృష్టంగావున్నా యీ మ్యూజియం చూడడానికి రోజుకు సగటున రెండువందల మందిదాకా వస్తుంటారట.

మద్రాసుకు మహాబలిపురంఎట్లనో, గుంటూరుకు అమరావతి అట్లా. శాతవాహనుల నాటి సంస్కృతికి నిలయమైన యీ అమరావతి మ్యూజియం యింతఘోరమైన పరిస్థితిలో పెట్టివున్నదన్నమాట మనప్రభుత్వం.

ఇక "ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా" లో వచ్చిన వ్యాసం లేపాక్షి కళామంటపాలకు సంబంధించినది. ఆ లేపాక్షి కళావైశిష్ట్యాలనుగూర్చి సాకల్యంగా వివరిస్తూ ఆ పత్రిక సంపాదకుడు శ్రీ ఎ. ఎస్. రామన్‌గారు యీక్రింది విధంగా వాపోతాడు: ఇంత కళావైభవమున్న లేపాక్షి మద్రాసులోనో, బెంగాల్‌లోనో, కేరళలోనో వుండివుంటే అంతర్జాతీయ ఖ్యాతిగడించేకళామండపంగా, ఎందరో కళాసంస్కృతిపిపాసువులను ఆకర్షించే భవ్యమందిరంగా రాణించి వుండేది. ఆంధ్రప్రదేశ్‌లో పడివుండడమే దీని దౌర్భాగ్యం-అనివాపోయాడు. సంస్కృతీ కళామండపాలపట్ల ఆంధ్రప్రజలు, ఆంధ్రప్రభుత్వం కనపరుస్తున్న శ్రద్ధాభక్తులకు యీరెండు వుదంతాలే యోగ్యతాపత్రాలు.

ఇక రాష్ట్రస్థాయిలో ఆవిధంగావుంటే జిల్లా స్థాయిలో చెప్పవలసిన అవసరంలేదు. నెల్లూరుజిల్లాలో 'భైరవకోన' అతి ప్రాచీనమైనస్థలం. చారిత్రకంగా కూడా విశేష ప్రాధాన్యతవున్నప్రదేశం. అందలి పర్వతశిల్పాలు, అశిల్ప వైదగ్ధ్యం వెలలేనిది. శిల్పరచనారీతిలోను, శిల్ప నైపుణిలోను మహాబలిపురానికి సాటివచ్చే ప్రదేశమది. ఈ కోనలోని ఎనిమిది గుహాంతరాలలో అమూల్యమైన శిల్ప నిక్షేపాలున్నా వాటిచూచే అనుకొన్నవారులేరు,దానిఛాయలకేవెళ్లినవారులేరు. కేవలం శిల్పప్రాధాన్యతవల్లనేగాక వృక్షపరివృత పర్వతసానువులలో నయనానందకరంగా, శీతలంగావుండే ప్రదేశం కూడా కావడంతో 'టూరిజం' అభివృద్ధికి కూడా జిల్లాలో మిక్కిలి అనువైన ప్రదేశం. ఉదయగిరి తాలూకాలోని సీతారామాపురంనుండి ఆరుమైళ్ల దూరంలో వుంది ఈకోన. ఎన్నిసమితులు, జిల్లా పరిషత్తులు ఏర్పడినా యీ ఆరుమైళ్లు యింకా శిలాప్రాయంగా బానపద మార్గంగానేవుంటున్నది. ఇంకా జిల్లాలో అనేక అమూల్యమైన శిల్ప నిక్షేపాలున్నవి. వీటిని తగువిధంగా తీర్చిదిద్ది యాత్రాస్థలాలుగారూపొందించే ఆలోచనే మనపాలకులకు రాలేదు. కనీసం టూరిజం అభివృద్ధి దృష్టితోనైనా వీటిని ఆకర్షవంతం చేయవచ్చు. కాని ఆసంస్కృతి సుగంధమున్న పాలకులేరీ మనకు! అందుకే సంస్కృతిలేనిప్రభుత్వం -అనిఅనవల్సి వస్తున్నది.

—

**నెల్లూరు విజయమహల్లో**
*** నేడే చూడండి ***

హరిహరన్ ఫిలిమ్స్‌వారి గొప్ప తెలుగుచిత్రం
**ఆమె ఎవరు?**

జగ్గయ్య - రాజనాల - రాజబాబు - వాణిశ్రీ
జయలలిత - మాలతి - నాగభూషణం.

జయలలితను మీరు యిందులోనే చూడాలి.

# రెండు క్రొత్త రాష్ట్రాలు

## రెండూ వ్యవసాయ ప్రధాన ప్రాంతాలు—

## రెండూ ఉజ్జ్వలభవిష్యత్తుగలరాష్ట్రాలు

1947 లో రెండు ముక్కలైన పంజాబు; ఇప్పుడు మూడు ముక్కలైంది. అంటే పశ్చిమపంజాబ్ పాకిస్థాన్‌లో వుండిపోగా; ఇండియాలోని తూర్పుపంజాబ్ పంజాబు-హరియానా రాష్ట్రాలుగా విభజింపబడింది. ఈ రెండు రాష్ట్రాలు ఈ నవంబరు 1 తేది అవతరించాయి. ఇంతవరకు దేశంలో 14 రాష్ట్రాలు వుండినవి ఇప్పుడు 15 రాష్ట్రాలవుతాయి.

ఇంతవరకు పంజాబు వైశాల్యం 47,310 చదరపుమైళ్లు; జనాభా 2 కోట్ల 30 లక్షలు. మొత్తం 20 జిల్లాలున్నాయి. ఇప్పుడు క్రొత్త పంజాబురాష్ట్రం 21,630 చదరపుమైళ్ళ వైశాల్యంగలిగి, 1 కోటి 14 లక్షల జనాభాతో, పదునొకొండు జిల్లాలు కలిగి వుంటుంది. హరియానారాష్ట్రం 16,670 చదరపుమైళ్ళ విస్తీర్ణం, 75 లక్షల జనాభా, ఏడు జిల్లాలతో ఏర్పడింది. పంజాబులోని 9000 చదరపు మైళ్ళ భూభాగం, 13 లక్షల 50 వేల జనాభా హిమాచల్ ప్రదేశ్‌లోకి బదలీ అయింది. పంజాబీ భాషా ప్రాంతం పంజాబుగా, హింది భాషాప్రాంతం హరియానాగా ఏర్పడినాయి. మాస్టర్ తారాసింగ్ పంజాబీ సుబా వుద్యమాన్ని ప్రారంభించగా సంత్ ఫతేసింగ్ ఆవుద్యమానికిమతంతోనిమిత్తం లేకుండా, భాషారూపాన్ని యిచ్చి సాధించారు. పంజాబ్ విభజనతో బలమైన సరిహద్దురాష్ట్రం బలహీనం అవుతుందేమో ననే భయ సందేహాలున్నాయి; నిత్యం తారాసింగ్ బోటి మతోన్మాదుల బెదరింపులకు, వుద్యమాలకు ఆస్కారం లేకుండా రెండురాష్ట్రాల ప్రజలు సోదరులవలె మెలుగుతూ, దేశభద్రతకు - దేశకళ్యాణానికి ఎవరివంతు వారుగా దోహదం చేయగలరనే సంతోషము, సంతృప్తి కలుగుతున్నది. అనైక్యంగా, అరాచకంగా, పరస్పర అవిశ్వాసంగా కలసివుండడంకంటే; వేర్వేరుగా సుహృద్భావంతో మెలగడమే మంచిదిగదా.

### పంజాబ్

*విస్తీర్ణం: 21,630 చ. మై.*
*జనాభా: 1,14,00,000*
*తలసరి ఆదాయం: రూ. 637*

### హరియానా

*విస్తీర్ణం: 16,670 చ. మై.*
*జనాభా: 75,00,000*
*తలసరి ఆదాయం: రూ. 540*

సరిహద్దు సంఘసూచనల ప్రకారం క్రొత్త పంజాబ్‌రాష్ట్రంలో అమృతసర్, కపుర్తల, జలంధర్, ఫిరోజ్‌పూర్, భటిండ, పాటియాలా, లూధియానా జిల్లాలు; హిమాచల్‌ప్రదేశ్‌లో కలిసే కొద్దిప్రాంతం తప్ప గురుదాస్‌పూర్ జిల్లా; సాంగూరు జిల్లాలో నిబర్నాల, మలెర్‌కొట్ల, సాంగూరు తాలూకాలు; అంబాలాజిల్లాలోని రూపార్ తాలూకా; హోషియార్‌పూర్ జిల్లాలోని దసుయ, హోసియార్‌పూర్, గర్షెంకర్ తాలూకాలు, ఊన తాలూకాలోని కొన్ని అభివృద్ధిబ్లాకులు చేరివుంటాయి.

హరియానా రాష్ట్రంలో హిస్సార్, మొహిందర్‌ఘర్, గిర్గావ్, రోటక్, కర్నాల్ జిల్లాలు; సాంగూరు జిల్లాలోని నర్వాణా, జింద్ తాలూకాలు; అంబాలా జిల్లాలోని ఖరార్, నారాయణఘర్, అంబాలా, జగధ్రి తాలూకాలు చేరి వుంటాయి.

ఇక పూర్వపు పంజాబు రాష్ట్రంలోని కొండజిల్లాలైన కాంగ్ర; కులు, లాహుల్, స్పితి, సిమ్లాజిల్లాలు; హోషియార్‌పూర్ జిల్లాలోని గాగ్రెట్, అంబ్, ఊనబ్లాకులు; అంబాలాజిల్లాలోని నలగర్ తాలూకా; గురుదాస్‌పూర్ జిల్లాలోని డల్‌హౌసీ, బలున్, బక్‌లో ప్రాంతాలు హిమాచల్ ప్రదేశ్‌లో చేరాలని సరిహద్దు సంఘం నిర్ణయించింది. భాషావిషయకంగా, సాంస్కృతికంగా, భౌగోళికంగా ఈ ప్రాంతాలన్నీ ఒకదానికొకటి అనుకొని వుంటాయి.

ప్రస్తుతం పంజాబ్, హరియానా రాష్ట్రాలను చండీఘర్ రాజధానిగా వుంటుంది. అయితే చండీఘర్ హరియానా రాష్ట్రంలోది. ప్రస్తుతం కేంద్రపాలితంగావున్నా, క్రమేణా హరియానా రాష్ట్రరాజధాని కావచ్చు. పంజాబు అమృతసర్, లేక మరే దైనా కొత్తరాజధాని నగరాన్ని ఎన్నుకో వలసి వుంటుంది.

పంజాబు, హరియానా రాష్ట్రాల ఆర్థిక స్థితిని పరిశీలించేముందు; క్రొత్తరాష్ట్రాల అవతరణకు పూర్వం పంజాబు పరిస్థితిని కొంత తెలుసుకోవడం బాగుంటుంది.

పంజాబ్, దేశంలోని అన్నిరాష్ట్రాల కంటే సంపన్నమైంది. వ్యవసాయంలో, పరిశ్రమల్లో మొదటిదిగా నిలుస్తుంది. దేశ ప్రజల తలసరిఆదాయం 334 రూపాయలైతే; పంజాబ్ ప్రజల తలసరిఆదాయం రూ 401 లు (1961-62 లో). దేశంలో సరాసరి 18.3 శాతం భూమి సాగులో వుంటే; పంజాబులో 1961-62 లెక్కల ప్రకారం 44.8 శాతం సాగులోవుంది. 1963-64 లో విద్యుత్తు తలసరి వాడకంలో దేశం సరాసరి 41.03 కిలోవాట్లయితే, పంజాబులో 103 కిలోవాట్లు. 1947 లో విభజనసమయంలో పంజాబు అన్నివిధాల వెనుకబడివుండింది. రాష్ట్ర ప్రజలకుసరిపోయే ఆహారధాన్యాల వుత్పత్తి లేదు, పరిశ్రమనేదిలేదు...ఏదీలేదు. స్వాతంత్ర్యానంతరం, రాష్ట్రవిభజన తర్వాత బహుముఖంగా, అతిశీఘ్రంగా అభివృద్ధి చెందింది పంజాబ్. ఆ పునాదులమీద ఏర్పడుతున్న పంజాబు-హరియానా రాష్ట్రాలకు వుజ్జ్వలమైన భవిష్యత్తువుంటుంది.

పంజాబు అదృష్టం దానికున్న పుష్కలమైన నీటి వనరులలో వుంది. రావి, బీయాస్, సట్లెజ్‌నదులు కొత్త పంజాబు రాష్ట్రంలో పారుతున్నా; వీటినుండి తీయ

—కొరవ 12 వ పేజీలో

## కొత్తరాష్ట్రాల ముఖ్యమంత్రులు

పంజాబ్ ముఖ్యమంత్రిగా శ్రీ గియాని గురుముఖ్‌సింగ్ ముసాఫిర్; హరియానా ముఖ్యమంత్రిగా శ్రీ భగవత్ దయాళ్ శర్మగారు ఎన్నుకొబడినారు. ముఠా రాజకీయాలతో సతమతమయ్యే పంజాబులో వీరిఎన్నిక ఏకగ్రీవంగా జరగడం గొప్ప విషయమే.

### ముసాఫిర్

పంజాబులో 22 మందితో మంత్రివర్గం ఏర్పడింది. చిన్న మంత్రివర్గాలుండాలని శాసించే కాంగ్రెస్ హైకమాండు ఇంత చిన్న రాష్ట్రానికి అంత పెద్ద మంత్రివర్గాన్ని ఎట్లా అనుమతించిందో ఆశ్చర్యమే. కాని భిన్నముఠాలు, వర్గాలు, వ్యక్తులను సంతృప్తిపరచాలనుకుంటే ఇది తప్పదు.

పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ గురుముఖ్ సింగ్ ముసాఫిర్ కాకలుతీరిన కాంగ్రెస్ వాది; వుత్తమదేశభక్తుడు; స్వాతంత్ర్యవీరుడు. 67 ఏళ్ల వయస్కుడైన గురుముఖ్‌సింగ్ మధ్యతరగతి కుటుంబీకుడు; ప్రస్తుతం పాకిస్తాన్‌లోవున్న పంజాబ్‌లోని అడ్డోవల్ గ్రామంలో పుట్టాడు. చిన్నతనంలో టీచరుగా జీవితాన్ని ప్రారంభించాడు. కొంతకాలం తారాసింగ్ అనుచరుడుగా వుండినాడు.

—కొరవ 12 వ పేజీలో

## 1956 - 66

## ఈ పదేళ్లలో నెల్లూరుజిల్లాలో జరిగిందేమిటి?

ఈ నవంబరు 1వతేదితో ఆంధ్రప్రదేశ్ అవతరించి దశాబ్దంఅయింది. ఈపదేళ్లల్లో జిల్లాలో జరిగిందేమిటి, వివిధరంగాల్లో జరిగిన అభ్యుదయమేమిటి, అనభ్యుదయమేమిటి—అనేవాటికి సంబంధించి కొన్ని లెక్కలిద్వారు కలెక్టరు శ్రీ ఎమ్.కె. మురళీధరరావుగారు, పత్రికావిలేఖరుల గోష్ఠిలో. ఒక్కొక్కసారి కొన్నిలెక్కలే అనేక వివరాలు చెప్పగలుగుతాయి; ఆలెక్కలే అనేక వివరాలుదాచగలుగుతాయికూడా. కలెక్టరు చెప్పిన వివిధ అంశాలతోబాటు మరికొన్ని టినికూడా యీవిలేఖరి స్వయంగా సేకరించి యీక్రింద పొందుపరస్తున్నాడు.

### జనాభా

ఈ పదేళ్లకాలంలో నెల్లూరుజిల్లాలో జరిగిన అభ్యుదయమేమిటి? మిగత విషయాల్లో అభ్యుదయం జరిగినా, జరక్కపోయినా జనాభా విషయంలోమాత్రం స్పష్టమైనఅభివృద్ధి కనపడుతుంది! వేల్లో చెప్పాలంటే 1951 లో జిల్లా జనాభా 17 లక్షలా 95 వేలమంది. ఈ జనం 1961 వచ్చేసరికి 20 లక్షల 34 వేలు అయ్యారు. ఈ పదేళ్లలో దాదాపుగా జిల్లాజనాభా 2 లక్షలా 40 వేలు పెరిగింది, అంటే సంవత్సరానికి జిల్లాలో 24 వేలమంది జనాభా యెక్కువవుతూ వచ్చిందన్నమాట. ఈ లెక్కన 1956 లో జిల్లాజనాభా 19 లక్షలా 15 వేలమంది వున్నారనుకొంటే ఈ 1966 లో 21 లక్షలా 55 వేలమంది వున్నారనుకోవాలి.

కేవలం నెల్లూరుటౌను జనాభా తీసుకొంటే 1951 లో 81 వేలమందివున్నది కాస్త 1961 లో 1 లక్షా 7 వేలకు పెరిగిపోయింది; అట్లనే ఈమధ్యంతర సెన్సస్ రిపోర్టునుబట్టిచూస్తే 1966 లో నెల్లూరు టౌనుజనాభా 1 లక్షా 31 వేలకువచ్చి వుర్యుంది. జనాభా యింతగా పెరుగుతూ వుండబట్టే మహాకవి గురజాడగారు, 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అనికదా అన్నాడు!

### పంచాయతీరాజ్యం

1956లో జిల్లాలో 456 పంచాయతీలే

—కొరవ 12 వ పేజీలో

## పారిపోయిన కాటకాలు పాతకాలపు జ్ఞాపకాలు....

ప్రగతిశీల దృక్పధాల ఫలస్వరూపం ప్రణాళికా విధానం. ప్రణాళికా విధానం అప్పుడే మన దేశంలో పదహారు సంవత్సరాల కారుణ్యాన్ని - పసిమిలావణ్యాన్ని సంతరించుకున్నది పదహారు సంవత్సరాల ప్రాయం పట్టపగ్గాలు ఉండని పరువానికి ప్రారంభంవంటిది. సామాన్యుని సర్వతోముఖ సౌభాగ్యానికి ప్రణాళికా విధానం పాలవుంతల్ని వేస్తుందని సర్వత్రా గుర్తించబడింది.

సామాన్యుని పరిస్థితి మనదేశంలో సత్వరంగా చక్కబడవలసివుంది. అందుకే మన ప్రణాళికల్లో వ్యవసాయానికి - నీటిపారుదల పథకాలకు అంత ప్రాధాన్యం - భూసంపద గరిష్ఠవినియోగం చాలవరకు నీటిపారుదల వనరుల కేంద్రీకృత అభివృద్ధిమీద ఆధారపడివుంది.

ప్రథమ- ద్వితీయ-తృతీయ పంచవర్ష ప్రణాళికల కాలంలో 9.53 లక్షల ఎకరాలకు నీటిపారుదల వసతి కల్పించబడింది. నాలుగవ పంచవర్ష ప్రణాళిక కాలంలో, నాగార్జునసాగర్ ప్రాజెక్టుతోసహా, అన్ని భారీ, మధ్యతరగతి నీటిపారుదల ప్రాజెక్టులక్రింద అదనంగా 25.13 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించబడుతుందని భావించబడుతున్నది.

తృతీయ ప్రణాళిక ఆరంభంతో మన రాష్ట్రంలో ఉత్పత్తిఅయిన అహారధాన్యాలు 63.19 లక్షల టన్నులు. తృతీయ ప్రణాళిక కాలంలోనే అధనంగా మరో 26.67 లక్షల టన్నులు ఆహార ధాన్యాల్ని ఉత్పత్తిచేయడానికి అవకాశం కల్పించబడింది. నాలుగవ ప్రణాళిక కాలంలో అదనంగా 40.48 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయాలన్నది మన లక్ష్యం - ఈ లక్ష్యాన్ని సాధించగలిగితే, తృతీయ ప్రణాళిక చివరన ఉత్పత్తి చేసిన ఆహార ధాన్యాలకంటే 44.6 శాతం యెక్కువ అహార ధాన్యాలను ఉత్పత్తి చేసినట్లవుతుంది.

బృహత్తరమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో మొదటిదశ పూర్తిఅయింది. కాలికేదారాలతో విశాలమైన ప్రాంతాలు సస్యశోభితం కావడానికి వీలుగా నాగార్జునసాగర్‌నుండి మన పొలాలకు సంతతధారగా చల్లని సలిలాలు ప్రవహించనున్నాయి.

రక్కసివంటి అకలికి వ్యతిరేకంగా. చదలచీకటివలె కరడుగట్టిన పేదరికానికి వ్యతిరేకంగా మనం జరుపుతున్న సాహసోపేతమైన సమరంలో నీటిపారుదల ప్రాజెక్టులు మనపాలిట విజయమూలమైన గాండీవాలు. అవే మన అజేయమైన అస్త్రశస్త్రాలు.

మన ప్రాజెక్టులన్నీ ఫలస్వరూపం ధరిస్తే, మన పథకాలన్నీ చల్లని చూపులు ప్రసరిస్తే కరువులు, కాటకాలు గతకాలపు జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. కథలుగా కరిగిపోతాయి.

**టి. రామచంద్రరావు - డైరెక్టర్.**

సమాచార పౌర సంబంధ శాఖ — ఆంధ్రప్రదేశ్ — హైదరాబాద్.

# ఎన్నికలు- గోరా భావాలు

## 'పార్టీలను బాయ్‌కాట్ చేసి ప్రజాభ్యర్థులను బలపర్చండి'

"మాకు గోడలు లేవు
గోడలను పడగొట్టడమే మాపని.
అలజడి మా జీవితం
ఆందోళన మా వూపిరి
తిరుగుబాటు మా వేదాంతం

ముళ్ళు రాళ్ళూ అవాంతరాలెన్నివున్నా
ముందుదారి మాది.

ఉన్నచోటు దాటను మీకు
ఇంకా వెనక్కు పోతామంటారుకూడా
మీలో కొందరు



శ్రీ గోరా

ముందుకుపోతాం మేము
ప్రపంచం మావెంట వస్తుంది

తృప్తిగా చచ్చిపోతారు మీరు
ప్రపంచం మిమ్మల్ని మర్చిపోతుంది

అభిప్రాయాలకోసం
బాధలు లక్ష్యపెట్టనివాళ్ళు
మాలోకి వస్తారు
అభిప్రాయాలు మార్చుకొని
సుఖాలు కామించేవాళ్ళు
మీలోకి పోతారు"

ఈ మాటలు శ్రీశ్రీగారివి. శ్రీ గోరా గార్ని చూసినప్పుడల్లా యీ విలేఖరికి ఎందుకో యీ మాటలు జ్ఞప్తికొస్తాయి. గోరాగారి అభిప్రాయాల తీవ్రత, తీక్షణత అట్లాంటిది.

అభిప్రాయాలకోసం బాధల్ని లక్ష్య పెట్టనివాళ్ళు-గోడలులేవు, గోడల్ని పడ గొట్టడమే వాళ్లపని-అక్షరాలా అట్లాంటి వ్యక్తే శ్రీ గోరా. గోరా పరమ నాస్తికుడు. తన నాస్తికభావాల్ను వదులుకోలేక లక్షణమైన కాలేజి లెక్చరర్ వుద్యోగాన్నే వదులు కోవాల్సివచ్చింది. గోరా పరమ నిరాడంబరుడు, వైభవ విరోధి. అందుకనే కుటీరంలో జీవిస్తాడు; వాక ఇద్దరు పంచ, వొకేవొక కండువా, అంతేఆయన దుస్తులు. ఆయన కులమతభేదాలు లెక్క చేయడు. బ్రాహ్మణుడు, అయినా జంధ్యం ఎప్పుడో తెంచేశాడు. తన కుమార్తెలకు, కుమారులకు వర్ణాంతర వివాహాలను చేశాడు. గోరాగారిలో మనకు కన్పించే మరో అపురూపమైనగుణం – అభిప్రాయాలకు, ఆచరణకు మధ్య సరిహద్దు లెరుగని పరమ సాక్షీవ్యక్తిత్వం. చెప్పేది చేస్తాడు; చేసేది చెప్తాడు. దాచుకోవడం తెలియదు. దోచుకోవడం అంతకన్నా తెలియదు. తన అభిప్రాయాలు ఎంత జ్వాలాసహితమైనవో, తనఆచరణకూడా అంత కఠినాతి కఠినం. తన అభిప్రాయాల జ్వాలల్లో దహించుకొనైనా పోతాడుగాని వాటిల్ని వదులుకొని ప్రపంచానికి వొదిగిపోలేడు. గోరా వొకవిధంగా తపస్వి.

మనిషి చూడడానికి సర్వోదయవాదిలా కన్పిస్తాడుగాని, ఆయన నిజానికి విప్లవవాది. ఇప్పుడు సరికొత్తగా విన్పిస్తున్న నినాదం-పార్టీరహిత ప్రజాస్వామ్యవాదం. పార్టీరహిత ప్రజాస్వామ్య స్వతంత్ర అభ్యర్థిగానే వచ్చే ఎన్నికల్లో విజయవాడ నియోజకవర్గంనుంచి అసెంబ్లీ స్థానానికి ప్రజల అభ్యర్థిగా నిలబడబోతున్నాడు.

పోయినసారి ఎన్నికల్లోకూడ పార్లమెంటు స్థానానికి పోటీచేసి డిపాజిట్ నెగ్గించుకున్నాడు. కేవలం ఏకాకిగా తనే

—కొరవ 10 వ పేజీలో

కమ్యూనిస్టుల స్వీయప్రయోజనాలకు సాధనాలవుతున్న కమ్యూనిస్టు వ్యతిరేకపార్టీల శోచనీయవైఖరి

# విధ్వంసకమైన 'బంద్'ల నెదుర్కొనుటకు స్వతంత్ర ప్రజాస్వామ్య సంఘటనలవసరం!

(గతసంచికకొరవ)

సామాన్యప్రజల నిత్యజీవిత బాధలను పరిష్కరించను ఆందోళనగా తలయెత్తే యీ పరిస్థితికి ఒక వుద్యమ రూపమిచ్చి రాజకీయ ప్రయోజనాలు పొందను కమ్యూనిస్టులు ఐక్యసంఘటనలకు దారితీసుకుంటారు. కమ్యూనిస్టేతర, కమ్యూనిస్టు వ్యతిరేకపార్టీల ప్రభావంలోవున్న ప్రజలు కొంతవరకు స్థానిక కాంగ్రెసువాదులతో సంబంధంలోవుండే ప్రజలూ నిత్యజీవిత యిబ్బందులు సమానంగానే అనుభవిస్తూ వుంటారుకావున యీ ఆందోళనలకు సానుభూతిని తెలియపరుస్తుండడం సహజం. కమ్యూనిస్టులు ప్రజా అసంతృప్తిని వినియోగించుకుంటే-యితరపార్టీలు పూరకుంటే ప్రజలు జారిపోతారుకావున-ఇతర పార్టీలు యీ రంగంలో ప్రవేశిస్తాయి.

ఇది ప్రథమదశ. ఒంటరిఒంటరిగా ఇల్లా యెవరికివారు ఆందోళన సాగించితే ప్రయోజనం వుండదు—కావున ఐక్యవుద్యమం అనివార్యమనే నినాదం కమ్యూనిస్టులు లేవదీస్తారు. రాజకీయవైరుధ్యాలు యెన్నివున్నా యిట్టి సమష్టి కోరికలకు కలిసి పనిచెయ్యటం సమంజసమేకదా అనిపించి యితర పార్టీలను యిందులో దూర్చుతుంది. ప్రారంభంలో ప్రజలనుండి దూరమవుతామనే భీతి యీ ఆందోళనకెల్లా పురికొల్పుతుందో, యిప్పుడూ ఆదేభీతి వారిని ఐక్య ఆందోళనలో పాల్గొనేట్లు చేస్తుంది. ఇది రెండవదశ. దీనితో మూడవదశకు దారి దొరుకుతుంది.

ఐక్య ఆందోళన జయప్రదం కావాలంటే ఐక్యసంఘటనకావాలి. సమష్టి ఆలోచన, కార్యక్రమం, నిర్వాహణ కావాలనే నినాదం కమ్యూనిస్టులు వినిపిస్తారు. ఇంతదూరంవచ్చి వెనక్కువెళ్ళితే రాజకీయంగా దెబ్బ తగులుతుందనే వత్తిడి వస్తుందికావున ఐక్యసంఘటన అనే అర్గళ నైజేషన్లో తగుల్కొంటారు. అవిధంగా యీ క్రమంలో కమ్యూనిస్టులు వంటరిగా వుద్యమాలు లేవనెత్తి రాజకీయంగా వారి నిజస్వరూపం బయటపడే ప్రమాదమును దాటుకొని మందిలో కలిసిపోతారు. ఐక్య సంఘటనలో పటుత్వమైన, సంఘటితమైన పార్టీ కమ్యూనిస్టుపార్టీయే. మిగిలినవి లూజు ప్రజాస్వామ్య పార్టీలు. చిన్న చిన్న ప్రదర్శనలు ఆందోళనలనుండి రాష్ట్ర బంద్‌లు చేస్తేతప్ప, దేశబంద్‌లా చేస్తే తప్ప ప్రయోజనంలేదనే దశకు యీ ఆందోళనను నెట్టినప్పుడు, ప్రజలను వీధులకు దించుతారు. ఐక్యసంఘటనలో – నాయకత్వంలో కమ్యూనిస్టులు అంతగా కనుపించరు. అది వారు జాగ్రత్త తీసుకొని చేస్తారు. కార్యక్రమం, నినాదాలు కమ్యూనిస్టుపార్టీపేరుతో వినిపించవు. రాజకీయ వాసనరాకుండాచూసి నినాదాలతో, అంతే పరిష్కారసాధ్యంకాని కోరికలతో ప్రజలను వీధులలోకి దించుతారు. వేలాది ప్రజలను యెందుకు వీధుల కురికించాలో వారికి ఒక అంచనావుంది. ఇతరులకివి సామాన్య కోరికలకు శాంతియుతంగా జరిగే బంద్‌లు, ప్రదర్శనలక్రింద కనుపించి వెనుకపడక తప్పదు. నియంతృత్వ శక్తులనుండి, అసాంఘిక రౌడీమూకలనుండి-యీ ప్రదర్శనాలలో పట్టుసంపాదించి వుద్యమాన్ని దౌర్జన్యపద్ధతులు పట్టించడం తేలిక.

బెంగాల్,అస్సాం, ఉత్తరప్రదేశ్,మధ్యప్రదేశ్ మొదలైన ప్రాంతాలలో నడిచిన, నడుస్తున్న ప్రదర్శనలు, ప్రతిఘటనలను పరీక్షిస్తే బయటపడేదేమిటి? ఈ సందర్భంలో స్పష్టమైన నిర్దిష్టమైన రాజకీయ శక్తులులేకుండా, సమాజసంపద అయిన పోస్టాఫీసులు, రైల్వేలు, స్కూళ్లు, కాలేజీలు, విద్యుద్దీపాలు, షాపులు వగైరాలను ధ్వంసంచెయ్యడం; అధ్యాపకులను, యితరులను నిర్బంధించడం, తన్నడం లాంటి క్రమంలో యీ వుద్యమాన్ని నెట్టడానికి ప్రయత్నించడం; దీనికి వ్యతిరేకంగా పోలీసులు కలుగజేసుకొనడం, అప్పుడప్పుడూ బాధ్యతారహితంగా పోలీసులు ప్రవర్తించడం, అలా నిత్యజీవిత కోరికలకు ప్రారంభమైన యీ వుద్యమం

**శ్రీ జి. సి. కొండయ్య**
ఎం. ఎల్. ఏ.

ప్రభుత్వ వ్యతిరేక వుద్యమంగా పరిణమించడం యీ క్రమంలో అనివార్యం అవుతుంది. ఈ వుద్యమంలో వీధులకు అడ్డుకట్టలువేసి, పోలీసు బలగాలను దిగ్బంధం చేసి, సందుగొందులనుండి, ఇండ్లపైనుండి చేతికిదొరికిన ఆయుధాలతో, బాంబులు, హాండ్ గ్రెనేడ్సు విసరడం, భూగర్భంలోవుంటున్న టెలిఫోను సంబంధాలను త్రెంచివెయ్యడంలాంటి చర్యలు అసాంఘిక, అరాజకశక్తులుచేసేవనిరాదు. నిర్దుష్టమైన, శిక్షితమయిన రాజకీయశక్తులు మాత్రమే యిట్టి విస్తృత విధ్వంసమునకు ప్రజలను నడిపించగలవు.

ఇక అంత్యదశ ఏమిటి? ఇంత చేసినా ధరలు తగ్గవు-జీతాలు పెరగవు-కరువు తీరదు. కావున యీ ప్రభుత్వం పడిపోతే తప్ప, పడగొట్టితేతప్ప మార్గంలేదనే అంత్యనినాదం వినిపిస్తుంది. కమ్యూనిస్టుల ఐక్యసంఘటన నినాదాలు మాత్రమే ప్రత్యర్థులనినాదాలుగా అందరూ అంగీకరిస్తారా, లేదా అనేది అప్రస్తుతం. ఐక్యసంఘటనలో విభిన్నశక్తులు వుండడం నిజమైనా, ఆచరణలో కమ్యూనిస్టుల అవసిష్ఠశక్తోక్కటే సమష్టి కోరికలౌతాయి. ఈ కోరికలు అంగీకరిస్తే జరిగేదేమిటో చూదాము. కావున ఇక మిగిలింది రాజకీయ పోరాటం.

ప్రభుత్వం పడిపోనిదే ఐక్యసంఘటన కోరికలు నెరవేరవు. ఇట్లా రెచ్చగొట్టబడి, రెచ్చిపోయిన ప్రజలను వీధులకురికించినప్పుడు సామాన్య పోలీసులు శాంతిని నెలకొల్పలేరు కావున సైన్యం వీధులకు రావాలె, వస్తుంది. "సైన్యం వీధులలోకి రావలసి వచ్చిందంటే ప్రభుత్వానికి అంత్యదినాలు సమీపించినాయన్నమాట. సైన్యం యుద్ధం చెయ్యడానికి, దేశ రక్షణకు నిర్మించబడిందేకాని ప్రజలను చంపడానికికాదు."అనే లెనిన్‌నిర్వచనాన్ని నమ్మే కమ్యూనిస్టులు సైన్యాన్ని నంకరం చెయ్యడానికి ప్రయత్నిస్తే ఆశ్చర్యపడ నక్కరలేదు. సామాన్యప్రజలలో నుండి వచ్చిన సైన్యం సామాన్య ప్రజలపై ఎన్ని సార్లు పోరాడుతుంది? దీనిఫలితాలు ఏమికానున్నవో కమ్యూనిస్టులకు తెలుసును కావున పోరాటమును యీ దశకు నెట్టుతారు.

నేడు దేశంలో జరుగుతున్న పోరాటాలను వివిధరంగాలకు విస్తృతంచేసి, ప్రధానంగా కీలకరంగాలకు విస్తృతంచేసి ప్రభుత్వమును స్తంభింపచెయ్యను, నిర్దుష్టమైన, తీవ్రమైనప్రయత్నం జరుగుతూంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వోద్యోగులను, టీచర్లను, విద్యార్థులను, కార్మికులను, పట్టణప్రజలను ఇందులో ఇరికించను పథకాలు వేస్తున్నారు. ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా విద్యార్థులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులు ప్రభుత్వోద్యోగులు, యజమానులకు వ్యతిరేకంగా కార్మికులు, పట్టణప్రజలకు వ్యతిరేకంగా పల్లెప్రజలు, పల్లెల్లో

—కొరవ 8 వ పేజీలో


గ్రాము : భారత్. * టెలిఫోన్ : 44.

కమ్మని కాఫీకి - సువాసన వక్కపొడికి

:: రెడ్డీస్ కాఫీపొడి

:: భారత్ వక్కపొడి

పేరు ప్రఖ్యాతి చెందినవి.

—— విక్రేతలు ——

పి. కోటారెడ్డి, బి. తిరుపతిరెడ్డి కంపెని

ట్రంకురోడ్డు—కావలి.

జమ్మివారి లివర్‌క్యూర్

పిల్లల లివర్, స్ప్లీన్ వ్యాధులకు

మా డాక్టరు ప్రతి నెలా వచ్చేదరు

| ప్రదేశం: | తేది: | సమయం; పగలు: | అడ్రసు: |
|---|---|---|---|
| నెల్లూరు | 6 | 9 నుండి 12 వరకు | అజంతా హోటల్, ట్రంకురోడ్డు. |
| చీరాల | 13 | 9 నుండి 12 వరకు | రాజమహల్ లాడ్జి, రైల్వేస్టేషన్‌వద్ద. |
| గుంటూరు | 14 | 9 నుండి 12 వరకు | ది మెడికల్ స్టోర్సు - కొత్తపేట. |
| తెనాలి | 15 | 9 నుండి 12 వరకు | కన్యకాపరమేశ్వరీ సత్రము. |
| రాజమండ్రి | 16 | 9 నుండి 12 వరకు<br>2 నుండి 4½ వరకు | ఈశ్వరదాస్ అండ్ కో.,<br>యిన్నీసుపేట. |
| విజయవాడ | 17 | 9 నుండి 12 వరకు<br>2 నుండి 4½ వరకు | మోడరన్ కేఫ్ - లాడ్జింగ్ సెక్షన్<br>గాంధీనగర్. |

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్సు
వివేకనగర్ — ముషీరాబాద్ పోస్టు.
చిక్కడపల్లి - హైదరాబాద్-20. (ఆం. ప్ర.) ఫోన్ : 34061.




## ⊕ ఉదయగిరి సర్పంచ్‌పై అవిశ్వాసం-8 మంది సభ్యుల నోటీసు
## ⊕ కందుకూరు సాంస్కృతిక సమితి
## ⊕ బిట్రగుంట గ్రంథాలయ పునరుద్ధరణ
## ⊕ పెదపుత్తేడు హైస్కూలు ముందంజ
## ⊕ రాపూరులో డాక్టరు లేడు, మందులు లేవు-బస్‌స్టాండు లేదు
## ⊕ ఇస్కపాళెం రేడియో వార్తలు చెప్పదు

### ఉదయగిరి అవిశ్వాసం

ఉదయగిరి పంచాయతీ అధ్యక్షుడు శ్రీ ఎస్. ఎ. అబ్దుల్ ఖాదర్ మీద తమకు విశ్వాసంలేదని అధిక సంఖ్యాక సభ్యులు కావలి ఆర్. డి. ఓ. కు వ్రాతపూర్వకంగా నివేదించినట్లు తెలుస్తున్నది. పంచాయతీలో 11 మంది సభ్యులుంటే, 8 మంది యీ అవిశ్వాస తీర్మానంమీద సంతకం పెట్టారట. అధ్యక్షుడుకాక మిగిలిన యిద్దరిలో ఒకరు సంవత్సరంగా వూళ్లోలేరట; బెంగుళూరులో కాపోలు పనిచేస్తున్నాడట. ఇంకొకరు తటస్థులట. అంటే తానుతప్ప అధ్యక్షుడికి పంచాయతీలో నా అనేవాడు లేకుండాపోయాడన్నమాట. అవిశ్వాస తీర్మానాన్ని చర్చించుటకు ఆర్. డి. ఓ. బహుశా ఈనెల 25 తేది పంచాయతీ సమావేశాన్ని ఏర్పాటు చేయవచ్చునని అంటున్నారు.

అవిశ్వాస తీర్మానం మీద ఈ ఎనిమిది మంది సంతకం చేసినట్లు తెలుస్తున్నది: షేక్ బాషా (ఉపాధ్యక్షుడు), రాచపూటి శేషమ్మ, వల్లెకొండ నాగమ్మ, సయ్యద్ ఖాదరువలి, ఎస్. బి. జాఫర్‌సా, ఎస్. గౌస్‌మొహిద్దీన్, ఎ.ఎఫ్. గౌస్‌మొహిద్దీన్, ఎస్. జి. ఖాజామొహిద్దీన్.

అవిశ్వాసానికి పాత్రుడైన శ్రీ అబ్దుల్ ఖాదరు జిల్లా కాంగ్రెస్ సభ్యుడు; బహుశా కార్యవర్గసభ్యుడుకూడా. మొన్న పోటీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్నట్లున్నది. —ఓ. వి.

### కందుకూరు సమితి

సమితి అనగానే పంచాయతీ సమితి అనుకునేరు; కాదు-క్రొత్తగా స్థాపింపబడిన స్కందపురి సాంస్కృతిక సమితి.

ఈ సమితి ప్రారంభోత్సవం మొన్న విజయదశమినాడు వేరోక్తంగా జరిగింది.



దొనకొండ హైస్కూలు పేరెంట్సు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ ఏ. వి. రమణ

రైల్వే పోర్ మెన్‌గా వుంటూకూడా, విరాళాలద్వారాసేకరించి కలెక్టరుగారు వచ్చినపుడు రూ. 1500/- లు వర్తి చేరు సమర్పించారు. ఇప్పుడు తిరుగా రూ. 2000/- ల సేకరణకు పూనుకున్నారు. గాంధీ జయంతినాడు రైల్వే యార్డులో గాంధీజీ విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. ప్రభుత్వోద్యోగం ప్రజాసేవను ప్రతిబంధకం కాదని చాటుతున్న వ్యక్తి శ్రీ రమణ.

శ్రీ పైడిపాటి నారాయణ అధ్యక్షత వహించిన సభలో కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ టి కె. కృష్ణస్వామి, డాక్టరు పి. హనుమంతరావు, చిల్లర గురునాథం, వి. సీతారామరావు, మిట్టపల్లి రాధాకృష్ణయ్య, అలపాటి రాధాకృష్ణమూర్తి, నాట్యాచార్యనందా మార్కెండేయశర్మ ప్రభృతులు చక్కని ప్రసంగాలు చేశారు.

రాత్రింబవళ్లు, శలవులు గిలవులు లేకుండా పనిచేస్తూ, కళాశాల అభివృద్ధికి పాటుబడుతున్న ప్రిన్సిపాల్ శ్రీ కృష్ణస్వామిగారిని; కళాశాల సాధించిన మంత్రి శ్రీ వెంగళరావు నాయుడుగారిని; దాత శ్రీ తిక్కవరపు రామరెడ్డిగారిని; ఈ సాంస్కృతిక సమితి స్థాపనలో ఎక్కువ కృషిచేసిన మొవలి రమురామశాస్త్రి. బొట్లగూడూరు వెంకటేశ్వర్లుగార్లను వక్తలు అభినందించారు. —ఓ. వి.

### బిట్రగుంట గ్రంథాలయం

కలికివాయబిట్రగుంటలో గ్రామకక్షలవలనైన శ్రీరామగ్రంథాలయం విజయదశమిరోజు పునరుద్ధరింపబడింది. శ్రీ ఎర్రా వెంకటేశ్వర్లు అధ్యక్షుడుగా ఎన్నుకోబడినారు. గ్రామ రాజకీయాలను గ్రంథాలయంలో చొప్పించకూడదని నిర్ణయించుకున్నారు. ఆచరణలో ఏమిచేస్తారో కాలం చెప్పవలసివుంటుంది. పుస్తకాలసేకరణ, భవనసముద్ధరణకృషి ప్రారంభంకావడం శుభసూచకం. ఈవిషయంలో విద్యావంతులైన రంగిశెట్టి శ్రీనివాసులు, కుండ బాలిరెడ్డి, అల్లి సుబ్బారెడ్డి చొరవ అభినందనీయం.

, , ,

నీడలేనికారణంగా మంజూరైన అప్పర్ ప్రయిమరీస్కూలు రద్దయిపోతుందేమోనని భయపడ్డాము. శ్రీ యర్రా వెంకటేశ్వర్లు కృషితో, గ్రామస్థుల సహకారంతో షెడ్డు నిర్మాణంజరిగి, 20 మంది విద్యార్థులతో వస్ట్‌ఫారంతో స్కూలుప్రారంభమై జరుగుతున్నది. మాకంతా ఆనందాన్నికూర్చిన విషయమిది. —మా వి.

### పెదపుత్తేడు హైస్కూలు

శ్రీ వై. మీరారెడ్డిగారు హెడ్మాష్టరుగా వచ్చి మూడునెలలే అయినా; హెడ్మాష్టరుగా ప్రమోట్ అయినతర్వాత తొలి అనుభవం యిదే అయినా; మాలో - అంటే విద్యార్థుల్లో-వచ్చిన మార్పు మాకే ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. చదువు సంధ్యలు చక్కగా సాగడమేకాదు, క్రమశిక్షణ కూడా యెంతగానో పెంపొందింది. పర్యవేక్షకులు లేకుండా విద్యార్థులు మూడు నెలల పరీక్షలు వ్రాయగలిగామంటే, అది అందరికీ సంతృప్తిని కలిగించిందంటే విద్యార్థులలో ఎంత మార్పువచ్చిందో మీకే తెలుస్తుంది. యెవరైనా టీచరు రాకుంటే హెడ్మాష్టరుగారు వేరొకటీచరును పంపుట లేదు; విద్యార్థులే నిశ్శబ్దంగా క్లాసులో కూర్చొని, తమపనిలో తాము నిమగ్నులు కావలసిందే. మీరారెడ్డిగారు పుణ్యాల భవిష్యత్తుగల హెడ్మాష్టరుగా రాణించబోతారు. మాలో క్రమశిక్షణను, సత్ప్రవర్తనను యింత కొద్దికాలంలో అంత మెక్కువగా పెంపొందించినందుకు మా ఆనందాన్ని వ్యక్తంచేసుకుంటున్నాము.

—బి. సుధాకరరెడ్డి.

### రాపూరు సమస్యలు

తాలూకా కేంద్రమైన ఈ గ్రామంలో పెరుకు ఆస్పత్రివుంది; ఎం. బి., బి. ఎస్. డాక్టరువుండాల. కాని డాక్టరూలేడు, మందులూలేవు. ఈ ఆస్పత్రి రాత ఎప్పుడూ యింతే! నోరుగలిగిన మంత్రిగారి నియోజకవర్గంలోని ఈఆస్పత్రి ఎప్పుడూ ఇట్లా దుస్థితిలోవుండడం, నిరుపయోగంగా వుండటం అన్యాయం. మంత్రిగారైనా ఒక మాటచెప్పి డాక్టర్నువేయిస్తే వారి మేలు మరచిపోము.

, , ,

పాపం! యూనాదులు పొట్టకూటికి నాలుగుకట్టెలువీరి తెచ్చుకుంటుంటే పారెస్టరుగారు కట్టెలు స్వాధీనంచేసుకోవడమేగాక, కత్తులుకూడా పెరుక్కున్నాడట. దొంగతనంగా అడవులను నేలమట్టంజేసి, వేలు లక్షలు ఆర్జించే పెద్దమనుషులజోలికిపోకుండా; నిరుపేదలైన గిరిజనులమీదనా మీ ప్రతాపం? అన్యాయమండి, పారెస్టరుగారూ!

, , ,

—తరువాయి 11 వ పేజీలో



టి. బి. సీల్స అమ్మకంలో రాష్ట్రంలో నెల్లూరుజిల్లా ప్రథమంగా వచ్చింది. గతఏడుకూడా నెల్లూరుదే అగ్రతాంబూలం. క్షయరోగుల సేవలోకూడా బహుశా నెల్లూరే మొదటిదిగావస్తుంది. క్షయాసుపత్రి సూపరింటెండెంటు, జిల్లా టి. బి. అసోసియేషన్ కార్యదర్శి అయిన డాక్టరు ఎ. బి. రామచంద్రారెడ్డిగారు హైదరాబాదులో శాసనసభ్యురాలు శ్రీమతి రోడా మిస్త్రీనుండి ట్రోఫీ నందుకోవడం చిత్రంలో చూడవచ్చు.



## ★ ప్రదర్శనకు నోచుకోని నెల్లూరు డాక్యుమెంటరీ సినిమా! ★★ వి. ఆర్. కాలేజి క్యాలెండర్—కొన్ని నిజాలు, మరికొన్ని అబద్ధాలు!!

నెల్లూరుజిల్లా విషయాలపై మన మనవి వహించిన ఆంధ్రప్రభుత్వంవారు వొక డాక్యుమెంటరీసినిమా తీస్తున్నారనీ అది నెల్లక్రితం ఇదేశీర్షిక క్రింద అలావనచేశాము. ఇట్లాంటి డాక్యుమెంటరీసినిమా వొకటి తీస్తున్నట్లుగాని, అది పూర్తవబోతున్నట్లుగాని సడీ సవ్వడు లేకుండా మనవారికెవరికీ తెలియకుండానేజరిగిపోతున్నదనీ; నెల్లూరు ప్రాంతీయుల్లో విషయజ్ఞులైన ప్రముఖులు కొందరితో ఒక అనధికారసంఘాన్ని ఏర్పరిచి వారిసలహాలు-సూచనలు తీసుకోకుండానే, ప్రభుత్వాధికారుల నిర్జీవమైన రిపోర్టుల ఆధారంతోనే ఈ డాక్యుమెంటరీని వెండితెర మీదకు ఎక్కించబోతున్నారని హెచ్చరించడంకూడా జరిగింది.

ఇప్పుడు అక్షరాలా అట్లనేజరిగింది. ఆ నెల్లూరు డాక్యుమెంటరీసినిమాతీయడం పూర్తయింది. విడుదలకు సిద్ధంగావున్న ఫిలింకాపీఒకటి తయారై నెల్లూరుకు వచ్చిందికూడా. ఈ డాక్యుమెంటరీఫిలిం నిర్మాణానికి మన ప్ర. వ. వారు 15 వేల రూపాయలుకాబోలు వెచ్చించివున్నారు కూడా.

అయితే ఆంధ్రప్రభుత్వంవారు ఈ ఫిలిం తీసేముందు నెల్లూరు జి. వ. వారితోగాని, జిల్లాకలెక్టరుతో మరే యితర అనధికార ప్రముఖులతోగాని సంప్రతించకుండానే

—తరువాయి 11 వ పేజీలో

10-12-66 నుండి మూడవస్కీము ప్రారంభం

# సుబోధ్ ఏజన్సీస్

6, ఏ. సి. సుబ్బారెడ్డి బిల్డింగ్సు - నెల్లూరు.

బీరువాల లాట్రీ స్కీము నెంబరు-3.

బీరువాలయొక్క వివరములు:-

సైజు : 78" X 36" X 19"

ఈ స్కీముయొక్క నిబంధనలు

(1) ఈ స్కీములో నూరు నుండి నూట యిరవై మెంబర్లు వుందురు.
(2) ప్రతిమెంబరు నెలకు 20-00 లు చొప్పున 20 నెలలు కట్టవలయును.
(3) ఈ లాటరీ ప్రతినెల 10 తేది సాయంత్రం 5 గంటలకు పై ఆఫీసులో హాజరయిన మెంబర్ల సమక్షమున యెత్తబడును.
(4) బహుమతి పొందిన మెంబరు మిగిలిన వాయిదాలకు పైకము చెల్లించ అవసరములేదు. ఆ దినమే అతనికి బీరువా యివ్వబడును.
(5) ఏ మెంబరు అయినను వాయిదాల సొమ్ము చెల్లించని యెడల అట్టి మెంబరును యేలాంటి నోటీసు లేకుండానే తొలగించబడును. అంతవరకు కట్టిన డబ్బు వాపసు యివ్వబడదు.
(6) 20 నెలలు పూర్తి అయిన వెంటనే అందరికి బీర్వాలు యివ్వబడును.

షరా:- మూడువందల అరవైరూపాయలు చేయు బీర్వాకాని లేక అంత విలువ చేయు యితర వస్తువులు - U Foam పరుపులు - సోఫాసెట్లు, డైనింగ్ మంచాలు - వాటరు హీటర్సు లేక ఏ యితరమైన మేము అమ్ము సామానులు యివ్వబడును.

—సుబోధ్ ఏజన్సీస్.

March & September Exams!

**S. S. L. C. and Matric**

BOYS and GIRLS

Please Join

Sri Vani Tutorial College

51, (Mantapal) Achari Street, NELLORE.

Best Tution for Sure Pass and Special Coaching for backward Students. Hostel for Boys.

D. SREENIVASA RAO, Principal.

# ఎలక్షన్ ముచ్చట్లు

ఈవారంలో ఆసక్తిని కల్గించే విష యాలుకాని, వుద్రేకాలను రెచ్చగొట్టే సన్నివేశాలుకాని ఏమీలేవు. జిల్లాస్థాయిలో పార్టీబందుల్లో ఎంతవరకు జరగాల్నో అంతవరకు జరిగి, రంగం హైదరాబాదుకు బదలీఅయింది. రంగంతోపాటు, జిల్లా ముఖ్యులందరుకూడా మకాం మార్చారు. అందువల్ల నెల్లూరులో ఎలక్షన్ విశేషాలుగా ఏముంటాయి?

రాష్ట్రస్థాయిలో ఎట్లా జరగబోతుందో ఏమిటో ఇంకా బయటపడలేదు. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ తొలిరోజు సమావేశంలోనే సమార్థీయుల వాకౌట్‌ను ప్రదర్శించారు. శాసనసభల్లో, లోక్‌సభలో ప్రతిపక్షం వారి వాకౌట్లు చూచిచూచి వీరూ అలవాటు చేసుకున్నట్లున్నారు కాని, లేకుంటే కాంగ్రెస్‌పార్టీ సమావేశంలో ఈ వాకౌట్లేమిటి? మంత్రులైనవాళ్లు చీటికిమాటికి బయటకు వరుగెత్తడమేమిటి? వాకౌట్‌కు తగినంత కారణం వుండవచ్చుగాక; ఒక్కసారైతే విలువుంటుంది కాని, పలుసార్లు జరిగితే పేలవమైపోదా? ఈ వాకౌట్ సెలక్షన్లకు సూచనైతే, జిల్లాలనుండిపోయినట్లు రాష్ట్రం నుండికూడా రెండుజాబితాలుపోకతప్పదనే తీర్మానించుకోవచ్చు. కాని సమార్థీయులు మళ్ళీ ఈ రోజునుండి ఎలక్షన్ కమిటీ సమావేశాల్లో పాల్గొనవచ్చని తెలుస్తున్నది. అదే నిజమైతే క్రిందామీదాబడి, కొన్నిస్థానాలవరకైనా ఏకీభావానికివచ్చి, మిగతది ఢిల్లీపరిష్కారానికి వదులుతారో; లేక మాట్లాడుకోవడమనేదే లేకుండా ఢిల్లీలో చూచుకోవచ్చు ననుకుంటారో తెలియదు. హైదరాబాదు – నెల్లూరుమధ్య ఈ రోజు ఫోను సంబంధాలుకూడా లేవు. అందువల్ల ఏ సంగతీ తెలియలేదు.

రెండులిస్టులనేది ఏమిటో అర్థంకాదు. తప్పుకాని, ఒప్పుకాని; పాక్షికంకాని, నిష్పాక్షికంకాని, రాష్ట్రకాంగ్రెస్ పంపేది అధికారజాబితా అవుతుంది కాని, దానికి వ్యతిరేగా సమార్థీయులు పంపేదానికి ఆ హోదా ఎక్కడనుండి వస్తుంది? అయితే వీళ్ళు తమ అభ్యర్థులెవరెవరైందీ సమగ్రమైన లిస్టుతో ఢిల్లీకిపోవచ్చు; ఢిల్లీలో పోరాడి, పలుకుబడినిబట్టి, అధికార జాబితాలో మార్పులుచేయించుకోవచ్చు. అంతేకాని తమ జాబితాను సమార్థీయులు ఎలక్షన్‌కమిటీ సమావేశం ముందువుంచే వీలుంటుందా? కౌన్సిల్ అభ్యర్థులసెలక్షన్ సమయంలో కూడా రెండవజాబితా తీసుకొని పోయారు; కాని ఏమిజరిగింది మనకు తెలుసు.

అందువల్ల ఇక్కడే ఏదైనా సామరస్య పరిష్కారానికి ప్రయత్నించుకోవడం గౌరవప్రదంగా వుంటుంది కాని, అసలు సమావేశానికే హాజరుకాకుండా బిగుసుకోవడంవల్ల ప్రయోజనమేముంటుంది?

• • •

సెలక్షన్లకు ముందు సమార్థీయులు ఒక ఎత్తుగడకు ప్రయత్నిస్తున్నారా అనిపిస్తుంది. సంజీవరెడ్డిగారు రాష్ట్ర నాయకత్వానికి తిరిగి రాబోతున్నారని, వస్తారనేవాతావరణం రాష్ట్రంలో కల్గించినందువల్ల, బ్రహ్మానందరెడ్డిగారిని ఎదుర్కోడం సులభంగా వుంటుందనే అభిప్రాయం వారిలో కల్గిందని రాజకీయ పరిశీలకుల వూహ. అందువల్ల సంజీవరెడ్డిగారిని రాష్ట్రానికి తీసుకొవ్వలనుటను వారు కృషి ప్రారంభించారని; వారంరోజులక్రితం సంజీవయ్య– పి. సి – రఘురామయ్యగారలు అనుకోకుండా మద్రాసుకు చేరుకోవడం, కామరాజ్‌ను కలుసుకొని మాట్లాడడం ఇందుకోసమే జరిగి వుండవచ్చునని వూహిస్తున్నారు. అంతేకాక, పి. సి. ముందు అనుకోకుండ ఢిల్లీకి పోవడంకూడా ఈ సందర్భంగానే జరిగివుంటుందని వూహిస్తున్నారు. హైకమాండుచేత సంజీవరెడ్డిగారిని రాష్ట్రానికి పంపినట్లు అనిపించాలనేది వీరి ప్రయత్నంగా కనపడుతున్నదనికూడా అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంలో వీరు ఎంతవరకు కృతకృత్యులవుతారో, హైకమాండు వీరి అభీష్టాన్ని తీర్చుటకు ఎంతవరకు సిద్ధపడుతుందో చెప్పలేము.

బ్రహ్మానందరెడ్డిగారు ఇప్పుడు ముఖ్యమంత్రిగా వున్నారు. వారికై వారుగా విరమించుకుంటేనో, లేక పార్టీలో బలం లేకుంటేనో, లేక రాష్ట్రపాలనకు చాలకుంటేనో హైకమాండు జోక్యం కలుగచేసుకోగలదుగాని; నిష్కారణంగా బ్రహ్మానందరెడ్డిని వద్దనలేదుగదా!

బ్రహ్మానందరెడ్డిగారిని కేంద్రానికి రమ్మని పిలుస్తారనుకుందాం; ఈనాడు వారు వదలి పెట్టిపోయే స్థితిలోలేరు. వారితో ఎందరి రాజకీయ భవిష్యత్తో ముడిపడి వుంది. వాళ్లందరిని గాలికి వదిలేసి బ్రహ్మానందరెడ్డిగారు పోతారా? ఊహించలేని విషయం.

సంజీవరెడ్డిగారికి మాత్రం రాష్ట్రంలో ఏమి అనుకూలంగ వుంది? పి. సి. సి. ఎన్నిక అనంతరం, ఉక్కు ఫ్యాక్టరీ వుద్యమంలో ప్రజాభిప్రాయాన్ని గమనించిన తర్వాత, విజయవాడ సంఘటనను చూచిన తర్వాత– సంజీవరెడ్డిగారు కూడా తన రాష్ట్ర పునరాగమన ఆలోచనను పునఃపరిశీలించుకోవలసిన అవసరం కనపడడం లేదా?

అయినా ఈ విషయాన్ని గూర్చి ఇప్పుడు ఎక్కువగా తరచడం అనవసరమనిపిస్తుంది.

• • •

జిల్లా విషయానికొస్తాం—

పార్లమెంటుకు గోపాలరెడ్డిగారితో ఢీకొనగల అభ్యర్థికోసం స్వతంత్ర పార్టీయేకాదు, ఇంకా కొందరు అన్వేషిస్తూనేవున్నారా అనిపిస్తుంది. శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారు ఆంధ్రపత్రిక విలేఖరితో ఈవిషయమై ప్రస్తావించినట్లు తెలుస్తున్నది. తాను పోటీ చేయబోవడం లేదని వారు ఖచ్చితంగా చెప్పలేదట; ఇంకా ఆలోచిస్తున్నానన్నారట. తాను వుండకపోయినా తమపార్టీఅభ్యర్థి తప్పకవుంటారని వారు చెప్పారట. శ్రీమతి భారతీదేవిరంగాగారు అభ్యర్థి అయినా కావచ్చునన్నారట. ఎవరైతేనేమి స్వతంత్ర పార్టీ అభ్యర్థిఒకరు వుంటారనేది ఖాయం.

రామచంద్రారెడ్డిగారిని ప్రోత్సహించే వారూ లేకపోలేదు. ఆ ప్రోత్సాహకుల్లో కాంగ్రెస్ వాదులుండినా ఆశ్చర్యంలేదు. మేము గ్రహించినంతవరకు భారతీదేవిగారు రారనే తోస్తుంది. ఆమెకు రాజకీయాల మీద రోయింపు పుట్టింది. అదీగాక రంగాగారు ఇంకోచోట పోటీచేస్తున్నారు. మూడవది ఇది ఆమె నియోజకవర్గంకాదు. ఈ మూడుకారణాలవల్ల బలవంతం చేసినా ఆమె ఒప్పుకోకపోవచ్చునని మేమువూహిస్తున్నాము.

ఇదిట్లావుంటే ఒక బాధ్యత గల కాంగ్రెస్‌వాది (కాంగ్రెస్‌వాది అనవచ్చునా?) తాను గోపాలరెడ్డిగారితో పోటీచేయబోతున్నానని అన్నారట. రహస్యంగా అనడమేమీకాదు, నలుగురున్నప్పుడే అన్నారని విశ్వసనీయంగా తెలిసింది. వీరు అంత పొరపాటు చేస్తారని మేము వూహించలేకున్నాం. అందువల్ల ఈ ప్రస్తావనను ఇంతటితో ముగిస్తున్నాము.

ఎందువల్లనో గోపాలరెడ్డిపట్ల పి. సి. వర్గీయులు ఇటీవల అక్కసుతో వున్నట్లుంది. మొన్న ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ ఎన్నికలో గోపాలరెడ్డిగారు బ్రహ్మానందరెడ్డిగారి అభ్యర్థిని బలపరచినప్పటినుండి; జిల్లాలో తమకు వ్యతిరేకంగా ఏమూల ఏమిజరిగినా వాటికంతా గోపాలరెడ్డిగారే కారకులా అనే అపోహ వారిలో కల్గుతున్నట్లుంది. బత్తేపాటి రామిరెడ్డి దరఖాస్తుకు కారకుడు గాని గోపాలరెడ్డి, అది వుపసంహరింపబడకుండుటకు ఎట్లా కారకుడవుతాడు? అయినా, వారిలో ఆ అపోహ వున్నట్లుంది. రాపూరుకు దరఖాస్తు వేయవద్దని గోపాలరెడ్డిగారు బి. సి. కొండయ్యకు సలహా యిచ్చారనే విషయం వీరికి తెలిసినట్లులేదు. ఏవుద్దేశంతో వారు ఈ సలహా యిచ్చివుంటారు? –పి. సి.కి పోటీ వుండ కూడదనేగదా! అలాంటి గోపాలరెడ్డిగారి పట్ల దురభిప్రాయపడడం అన్యాయంకాదా!

• • •

రాపూరు కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి శ్రీ బత్తేపాటి రామరెడ్డిగారి అభ్యర్థిత్వాన్ని పి. సి. వర్గీయులు మొదట అంతశ్రీవంగా పరిగణించినట్లులేదు. ఇప్పుడు వారి దరఖాస్తు విరమణ అవసరమని భావిస్తున్నట్లుంది. దీనికి కారణం ఆ నియోజకవర్గ పరిస్థితులను లోతుకుదిగి తెలుకోవడంగా వుండవచ్చునంటున్నారు. రాపూరులో పి. సి. కి ప్రత్యర్థిని నిలపాలనే ప్రయత్నం గట్టిగా వున్నట్లేవుంది. అది గ్రామగ్రామానికి ప్రాకినట్లుంది. అది ఇట్లనే కొనసాగితే, రేపు మరింతబలం కావచ్చు. ఈ పరిస్థితిని పి. సి. వర్గీయులు ఇటీవల బాగ గ్రహించినట్లుగా తోస్తుంది. అందువల్లనే తమవారెవరు, పరాయివారెవరు అని తేల్చుకొనుట కుద్యుక్తులైనట్లుంది.

పి. సి. కి పోటీపెట్టడం, దాన్ని కాంగ్రెస్ వాది అనేవాడు ప్రోత్సహించడం ఎవ్వరూ సమర్థించరు, సహించరు. అలాంటి ప్రయత్నమేదైనావుంటే కాంగ్రెస్ వాదులంతా కలసి విరమింప చేయుటకు ఇప్పుడే ప్రయత్నించవలసి వుంటుంది.

కాని ఇతరచోట్ల పి. సి. వర్గీయులు ఈ కాంగ్రెస్ వ్యతిరేక కార్యకలాపాలతో ఏమాత్రం సంబంధం పెట్టుకున్నా, పెట్టుకుంటున్నారనే వదంతులు వ్యాపించినా చిక్కేనని మా అభిప్రాయం. గూడూరు తదితరచోట్ల వీరు కాంగ్రెస్‌కు వ్యతిరేకం చేయబోతున్నారనేమాట బయటకు పొక్కుతున్నది. అది ప్రమాదకరం. ఇరువర్గాల వారూ ఈ విషయంలో ఒక గట్టి ఒప్పందానికివచ్చి, నిజాయితీగల కాంగ్రెస్‌వాదులుగా వ్యవహరిస్తేతప్ప, ఎవ్వరిస్థానమూ భద్రంగా వుండదు. పి. సి. గెలవాల, చెంచురామానాయుడుగారు గెలవాల; ఆనం సంజీవరెడ్డి విజయం పొందాల, బి. సి. కొండయ్య విజయుడుకావాల; ఆర్. డి. ఆర్. గెలుపొందాల, అల్లం కృష్ణయ్య గెలవాల. ఒకరుగెలిచి, ఇంకొకరు ఓడిపోవాలని ఏ కాంగ్రెస్‌వాది కోరుకున్నా, అది అందరికీ ముప్పుగానే వుంటుంది,

ఇలాంటి పొరపాట్లేమీ జరగకుండా ముందుగానే చర్యలు తీసుకోవడం అవసరంకాబట్టి, ఇంత స్పష్టంగా హెచ్చరించవలసివస్తున్నది.

• • •

నెల్లూరులో శ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారు ఎన్నిక ప్రచారంలో నిమగ్నులైపోయారు. వీధివీధి, వాడవాడ తిరుగుతున్నారు. పోయినచోటంతా ప్రజాభిప్రాయం ప్రోత్సాహవంతంగా వున్నదని రాఘవయ్యగారు సంతోషిస్తున్నారు; విజయంపట్ల పరిపూర్ణ విశ్వాసంతో వున్నారు.

శ్రీ వేమారెడ్డి వెంకురెడ్డిగారుకూడా ఎలక్షన్ ప్రచారానికి అంకురార్పణ చేసినట్లే. సమితి సమావేశంనాడు కోవూరుకు పోయి పంచాయతీ రాజులందరికీ ఒక నమస్కారబాణంవేసి వచ్చారట. కంచి కామకోటి పీఠాధిపతుల ఆశీర్వాదాలను కూడా పొందివచ్చినట్లుంది. కోవూరుసీటు వెంకురెడ్డిగారికి ఖాయంకావడం సంభవిస్తే, గెలుపుకూడా ఖాయమనే చెప్పవచ్చు.

ఉత్తరజిల్లాలో ఏ నియోజకవర్గం ఎవరికిస్తారో ఇప్పుడే చెప్పడం తొందరపాటవుతుందేమోననిపిస్తుంది.

దర్శి, పొదలి, కందుకూరు, కొండపిలో ఖాయంగా పాతవారే వుంటారని అనుకోవచ్చునేమో! కనిగిరి, కావలి విషయం వూహించలేము. బుచ్చిలో దశరథరామరెడ్డి గారిని రాకుండా చేయాలని ఒక స్త్రీ అభ్యర్థిత్వాన్ని సృష్టించడం తప్పితే, ఆమె ఏనాటి కాంగ్రెస్‌వాది? ఇప్పటి ఆర్. డి. ఆర్. అభ్యర్థిత్వ మొస్తే గెలుపు అనుమానముండదు.

ఆత్మకూరు విషయం ఒకటుంది. పి.సి – ఆనం సంజీవరెడ్డిగారలలో ఎవరో ఒకరిని నెల్లూరుకు పంపాలనేది అధికారవర్గంవారి వాదం. ఆవిషయంలో వారు పట్టుబట్టవచ్చు. ఏమవుతుందో చెప్పలేము. ఆత్మకూరు సంజీవరెడ్డికి యిచ్చి, కొండయ్యను కావలికి పంపుతారో; లేక కొండయ్యకు ఆత్మకూరిచ్చి సంజీవరెడ్డిని ఉదయగిరికి పొమ్మంటారో ఏదీ వూహించలేము. ఈ రెండవ ఏర్పాటుమాత్రం వుత్తమంగా వుంటుందనీ, ఇరువర్గాల సామరస్యానికి దోహదకరంగా వుంటుందని మా అభిప్రాయం. సంజీవరెడ్డిగారుదానికిసిద్ధపడాలగదా!

బుచ్చిలో మహానంద అన్నివిధాల అర్హుడైన అభ్యర్థి. అతనిని ఈతడవకూడా త్రోసివేయడం న్యాయంకాదు. అది కాంగ్రెస్ బలహీనతకు దారితీయవచ్చు. రమణారెడ్డిగారు 1955 నుండి సభ్యులుగా వుంటున్నారు. 1955లో తనకు లభించిన అభ్యర్థిత్వాన్ని మహానంద రమణారెడ్డికి దఖలు పరచారు; అంతేకాదు వారివిజయం తన విజయంగా భావించి పనిచేశారు. అలాంటప్పుడు రమణారెడ్డిగారు మహానందకు అనుకూలంగా తాను వుపసంహరించుకుంటే ఎంత వుదారంగా వుంటుంది! ఇంత విశాలంగా ఆలోచిస్తారా? ఇంత వుదారంగా వ్యవహరిస్తారా?

రమణారెడ్డిగారు ముఖ్యమంత్రిగారి స్వంత అభ్యర్థి అనే అభిప్రాయముంది. అందువల్లనే జిల్లాలో అధికారవర్గం కళ్ళుమూసుకొని వారిని సిఫారసుచేసింది. అందువల్ల ముఖ్యమంత్రిగారే ఈనియోజకవర్గం విషయంలో సముచితంగా వ్యవహరించవలసివుంటుంది.

——

## నెల్లూరు ముచ్చట్లు

విమర్శకుడు

### వర్షం

స్వాతికార్తె దంచివదలుతున్నది. 3,4 తేదుల్లో కుండపోతగా వర్షించింది. ఈ సంవత్సరం ఒకటి రెండు రోజుల్లో ఇంత ఎక్కువగా కురియడం ఇదేననుకుంటాము.

3 తేది, 4 తేది వుదయం వరకు నెల్లూరు ఆనకట్టవద్ద 6¾ పదున్లు; సర్వేపల్లి రిజర్వాయరువద్ద సుమారు 7 పదున్లు; కలిగిరి రిజర్వాయరువద్ద 4¾ పదున్లు; సంగం ఆనకట్టవద్ద 6¾ పదున్లు వర్షం కురిసింది. ఈవర్షం జిల్లావ్యాప్తంగావుంది; ఇంకా కురుస్తూనేవుంది. 3తేది గాలికూడా వుండినది.

ఈ రోజు కండ్లేరు, పంబలేరు వెల్లువలవల్ల గూడూరు–నెల్లూరుమధ్య బస్సులు రాకపోకలు ఆగిపొయ్యాయి. రైళ్లు లేవు. ప్రయాణీకుల దురవస్థ చెప్పలేము.

ఈ రోజు (4 తేది) నెల్లూరు ఆనకట్టమీద 2. 2 అడుగులు, సంగం ఆనకట్టమీద 2.3 అ. నీరు ప్రవహిస్తున్నది.

### సోమశిలకు ముక్తి?

సోమశిలప్రాజెక్టు పరిశీలనకు (ఇన్‌వెస్టిగేషన్‌కు) రెండుసబ్‌డివిజన్‌లుఏర్పాటు చేయబడి, ఇద్దరుఅసిస్టెంటుఇంజనీర్లుసిబ్బంది నియమింపబడి, వెంకటగిరి–ఆత్మకూరులలో పనిచేస్తున్నట్లు అధికారయుతంగా తెలుస్తున్నది. ఇంతవరకైనా సంతోషించదగివుంటుంది. ఈపని చివరవరకు కొనసాగాలని, సోమశిల కార్యరూపం పొందాలని ఆకాంక్షిస్తున్నాము. సబ్‌డివిజన్‌లు ఏర్పాటుచేసి, పరిశీలన జరిపిస్తున్నందుకు ఆంధ్రప్రభుత్వాన్ని అభినందిస్తున్నాము.

### జీతాలు లేవు!

కనుపూరుకాల్వలో పనిచేసే ఇంజనీర్లకు, తదితర సిబ్బందికి రెండు మాసాలుగా జీతాలులేవట. డబ్బులేక కాదు; సిబ్బంది కొనసాగింపుకు ప్రభుత్వ మంజూరు లేకపోవడమే కారణమట.

ఇంజనీర్లకు రెండు నెలలుకాదు, రెండేళ్ళు రాకపోయినా చింతలేదు; చిన్న వుద్యోగులు ఇంతకాలం జీతాలు రాకుంటే ఈ గడ్డురోజుల్లో ఎట్లా బ్రతుకుతారు?

### ఎస్. ఇ. బదలీ

సూపరింటెండింగు ఇంజనీరు శ్రీ జగన్మోహనరావుగారిని గుంటూరుకు బదలీచేస్తూ వుత్తరువులు వచ్చాయట. వారు 15తేది ప్రాంతంలోపోవచ్చునంటున్నారు.

### లయన్స్‌క్లబ్బు

నెల్లూరు లయన్స్‌క్లబ్‌వారు ఐక్యరాజ్యసమితి దినోత్సవ సందర్భంగా జరిపిన వ్యాసరచన పోటీల్లో దొడ్ల కౌసల్యమ్మ స్త్రీలకళాశాల విద్యార్థినులు కుమారి టి. సుజాత ప్రథమ బహుమతి రూ 116 లు, కుమారి టి. ఇంద్రాణి ద్వితీయ బహుమతి రూ 58 లు పొందగా; 1 తేది డెప్యూటీ ఎస్. మస్తానారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్. పి. శ్రీ శరణ్యా బహుమతి ప్రదానంచేసి, వుపన్యసించారు. కార్యదర్శి డాక్టరు చంద్రశేఖరనాయుడు ధన్యవాదములు చెప్పారు.

### మరణం

తాసిల్దారుగా, హుజూర్ సిరస్తదారుగా నెల్లూరులో పనిచేసి, నిజాయితీగల అధికారిగా కీర్తిగడించి, డిప్యూటీ కలెక్టరై, వైద్యశాఖ అసిస్టెంటు డైరెక్టరుగా రిటైరైన శ్రీ టి. వి. గోవిందరాజులు గత 25 తేది హైదరాబాదులో హృదయ చలనమాగిపోయి హఠాత్తుగా మరణించారట.

వారి కుటుంబానికి మా సానుభూతి.

——

**కీర్తిశేషులు**

**బి. కిసనాశింగుగారు**

మాతండ్రిగారగుబి. కిసనాశింగుగారు 27–10–1966 తేది గురువారము దివంగతులైనారని తెలుపుటకు చింతిస్తున్నాము. వారి కర్మ క్రతువులు (దశకర్మ, గ్యార్మా, బార్మియా) నవంబరునెల 5, 6 తేదులలో రాపూరులో జరుగును.

ఇట్లు,

బి. పుల్లుశింగు,
బి. రామ్‌సింగు,
బి. బాలాజీసింగు.

రాపూరు, 29–10–1966.

# నెల్లూరులో, నాయుడుపేటలో అరెస్టులు

(మొదటిపేజీకొరవు)

గారు, స్టోన్‌హవుస్‌పేటలో నాళా వెంకట శేషయ్యగారుమాత్రం తమ అంగళ్ళను నిర్భయంగా తెరచివుంచారు. ఏమీ జరగ లేదు. బస్సులుకూడా దాదాపు అన్నీ నడిచేసినట్లే. మూయమని అడిగినవారు కూడాలేరు. రామచంద్రమూర్తి గారు ఇది వరకుకూడా కమ్యూనిస్టుల సమ్మెను ప్రతి ఘటించి నిలువగలిగారు. వీరికి లేని ఇబ్బంది, నష్టం ఇతరులకుఏమివుంటుంది? 2 తేది అందరూ తెరచివుంచినాఅడిగేవారు లేరు. అయితే మూసివేసినందువల్ల, అల్లర్లు సృష్టించాలనుకునేవాళ్లకు ఆ స్కారమే లేకుండా పోయిందనుకోండి!

కమ్యూనిస్టులు ఈసారి పూర్తిగా ఆశా భంగంచెందారు. విద్యార్థుల ఆందోళన, అమృతరావు దీక్ష అవకాశంగానుకొని అరా జకం కల్పించవచ్చునని క్రమపడి 16 తేది జరగాల్సిన బంద్‌ను 2 తేదికితెచ్చుకున్నారు. కాని, బంద్‌బండారం బయటపడిపోయింది. పోలీస్ చాల కట్టుదిట్టమైన చర్యలు తీసు కున్నది. ముఖ్యమైన ప్రదేశాలలో ఉక్కు టోపీ సాయుధ పోలీస్‌జట్లను వుంచింది; ముఖ్యమైనరోడ్లలో పెట్రోలు జరిపించింది; చాల అప్రమత్తంగా వ్యవహరించింది. ఎస్. పి. శ్రీ శరణ్యన్ పోలీస్ బలంతోనే కాదు, యుక్తియుక్తంగా, లౌకికంగా వ్యవహరించి రక్షణ చర్యలు గైకొన్నారు. డి. ఎస్. పి. శ్రీ ఎం.బి. రామచంద్రరావు గారు ఆరోజు రెండుకాళ్లు ఒకచోట పెట్ట కుండా టవునులో తిరుగుతూ, పర్యవేక్షి స్తూనే వుండినారు. ఈసారి పోలీస్ చురుకుదనం మాత్రం ప్రశంసనీయమని చెప్పకతప్పదు.

'బంద్' రోజు కమ్యూనిస్టుల ఆట లెందుకు సాగ లేదంటే ఎన్నోకారణా లుంటాయి. కమ్యూనిస్టులకు పూర్వపు బలంకుబడిలేదు. హిందీ వ్యతిరేకోద్యమంలో రాడీమూకవల్ల పోలీస్ కఠినంగా వ్యవహ రించడంవల్ల, ఈసారి రిక్షాలవాళ్ళు తది తరులు ముందుకు రాలేదని చెప్తున్నారు. రైళ్ళు లేకపోవడం, బస్సులు నడవక పోవడం, అంగళ్లూ వగైరాలన్నీ మూత బడడంవల్ల కమ్యూనిస్టులకు అవకాశం చిక్కలేదు. ఇంకో ముఖ్యమైన కారణం కాలేజి విద్యార్థులు బంద్‌తో సహకరించు టకుకాని, వుత్సవాలు వగైరాలలో పాల్గొ నుటకుకాని నిరాకరించడం. ప్రజాసహ కారం ఇంతగా లోపిస్తుందని పాపం కమ్యూనిస్టులు కలలోకూడా వూహించి వుండరేమో!

ఈ సందర్భంలో ముందుజాగ్రత్త చర్యగా టవునులో 30 మంది అరెస్టు గావింపబడినట్లు తెలుస్తున్నది.

జిల్లా అంతటాకూడా 'బంద్' ప్రశాం తంగా జరిగిపోయినట్లు తెలుస్తున్నది.

ఇక మళ్ళీ కాలేజివిద్యార్థుల విషయాని కొస్తాం—

29 తేది ఇద్దరు విద్యార్థులతో ప్రారంభ మైన ప్రాయోపవేశం, ఈ రోజు (4 తేది) ఇద్దరు విద్యార్థులతో కొనసాగుతున్నది. ఉక్కుఫ్యాక్టరికి సంబంధించి కేంద్ర ప్రభుత్వహామీ స్పష్టంగాతెలిసేవరకు వారు దీక్ష విరమించకూడదని నిర్ణయించుకున్న ట్లుంది. సమ్మెకూడా ఈరోజుకొనసాగింది. కాలేజేకాదు, వీరు ఇతర స్కూళ్ళకుకూడా వెళ్ళి విద్యార్థులను పోనిచ్చినట్లులేదు. ఉమెన్సుకాలేజి, కస్తూరిదేవి విద్యాలయం పనిచేస్తున్నాయి. ఏమైనాఅమృతరావుగారు విరమించుకున్న తరువాత, విద్యార్థులూ విరమించుకొనివుంటే బాగుండేది. రేపటి నుండి విరమించు కుంటారో, లేదో!

నిరాహారదీక్ష చేసిన విద్యార్థి సోద రులు: తొలిరోజు - సి. హెచ్. మాలకొం డయ్య, డి. రఘునాథరెడ్డి (యిరువురు I బి.ఎ. విద్యార్థులు). వీరు యిద్దరూ మూడురోజులపాటు నిరాహారదీక్ష చేశారు. గోరాగారు కాలేజికివచ్చిన సందర్భంలో ఈ విద్యార్థులను కల్సుకొని ఆశీర్వదిం చారుకూడా. తర్వాతరోజు మరో యిద్దరు విద్యార్థులు ఆ జట్టుతోకలసి నిరాహారదీక్ష చేశారు. బి. పెంచలరెడ్డి (II బి.ఎస్‌సి.) బి.హెచ్. రామ్మైల్లు (I బి. ఎ.). తర్వాత వీరు విరమించగామరోఐదుగురు విద్యార్థులు 1 తేది నిరాహారదీక్షలో కూర్చొన్నారు- జి. రవీంద్రనాథ్ (II బి. ఎ.), బి. రామ కృష్ణరాజు, సి. హెచ్. విశ్వనాథం, ఎం. సుబ్బారెడ్డి (II బి. ఎ. విద్యార్థులు), ఆర్. బి. శర్మ (I బి. ఎ.). 2 తేది మరో ఐదుమంది విద్యార్థులు - పి. ప్రభాకరరెడ్డి (III బి. ఎ.), బి. రాధాకృష్ణారెడ్డి (I బి. ఎ., విద్యార్థి సంఘకార్యదర్శి) పి. వెంకటరెడ్డి (I బి. ఎ.), పి. శ్రీనివా సులరెడ్డి (I బి. ఎస్‌సి.), సి. రామరెడ్డి (II బి. ఎస్‌సి.); 3 తేది మరో ముగ్గురు విద్యార్థులు: ఎం. రామకృష్ణబాబు, కె. శ్రీనివాసులరెడ్డి (I బి. ఎ. విద్యార్థులు), కె. శ్రీనివాసులు (I బి. ఎస్‌సి.) నిరా హారదీక్ష చేశారు. ఆఖరు ఇద్దరు విద్యార్థులు నాలుగోతేదికూడా దీక్ష కొనసాగించాలని నిర్ణయించుకొన్నారట.

వి.ఆర్. కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ సుబ్బా రెడ్డిగారు విద్యార్థులతో సహకరిస్తూ, సాను భూతిని వ్యక్తంచేస్తూ, సాదరపూర్వకంగా వ్యవహరిస్తూ వారి నిరాహారదీక్షకు వాక వేదికనుకూడా రాలేజిలో నిర్మించుకో నిచ్చారు.

ఏమైనా మిగతా ఆంధ్ర నగరాల్లో పరి స్థితి అదుపుతప్పి ఎంతో ఆందోళన వ్యక్త మవుతున్న సమయంలోకూడా వి. ఆర్. కాలేజి విద్యార్థులు శాంతియుతంగా వుద్య మాన్ని నిర్వహించినందుకు వారిని అన్ని విధాలా శ్లాఘిస్తున్నాము. ఈ ఆందోళనకు నేతృత్వం వహించిన వి ఆర్. కాలేజి విద్యార్థిసంఘం కార్యనిర్వాహకులు ఎ. సదా శివరెడ్డి (అధ్యక్షులు) కె. హరినారాయణ రెడ్డి (వుపాధ్యక్షులు), రాధాకృష్ణరెడ్డి (కార్యదర్శి), సి. సుధాకరరెడ్డి (సహాయ కార్యదర్శి), తదితర విద్యార్థి ముఖ్యులు ప్రత్యేకంగా శ్లాఘనీయులు. సమయం చూసి, 'బంద్'ను ముందుకునెట్టి, రంగం లోకి దొరబడి, ఆందోళన గంభీరస్వభా వాన్ని చెడగొట్టి, అదుపుతప్పించి అరాచ కాన్ని సృష్టించాలని చూసిన కమ్యూనిస్టు ప్రదర్శకులతో సహకరించక విస్పష్టంగా ప్రతిఘటించినందుకు మరీ అభినందిస్తు న్నాము. ఉద్రిక్తులై వుద్యమాన్ని అదుపు తప్పించనందుకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నాం.

## న్యాయవాదుల దీక్ష

నెల్లూరు న్యాయవాదులు శ్రీయుతులు ఎస్.ఎ.ఆర్. విఠల్‌రావు, కాకాణి సుబ్బ రామయ్య, మేనకూరు మోహనరామరెడ్డి, కె. నారాయణరావు, జె.ఎల్. నారాయణ, బి. వెంకటరత్నం, కె. వెంకటరమణయ్య, కె. ఆదిశేషయ్యగుప్తగారలు 3 తేది వుద యం కోర్టులో నిరాహారదీక్ష ప్రారంభిం చారు. 24 గంటలు చేయాలనుకున్నారు కాని మధ్యాహ్నం అమృతరావు విరమణ వార్త తెలిసినతర్వాత వీరూ విరమించు కున్నారు. ఇదివిన్న ఒకమిత్రుడు వ్యాఖ్యా నించాడు-"....లేట్‌లంచ్" అని!

న్యాయవాదు లందరూ కోర్టులకు పోకుండా సమ్మెచేశారు.

## ఇతరచోట్లు

నాయుడుపేటలో సిగ్నల్ పరికరాలు, ఇంజనురూము ధ్వంసం చేయబడినవి. రూ 3000 లు నష్టముంటుందని అనధి కార అంచనా.

నాయుడుపేట చెక్‌పోస్టు తగులబెట్ట బడింది. పదివేలరూపాయల విలువచేసే సామాన్లు ఊసివేసారట. లేకుంటే అవంతా నష్టమైవుండేది.

నాయుడుపేటలో 5 మంది అరెస్టు గావింపబడినారు.

సూళూరు పేటలో విద్యార్థుల సమ్మె, పుత్సవం, బంద్‌రోజు హర్తాళ్ తప్ప వేరే షాలేమీలేవు.

గూడూరులో విద్యార్థులు కాస్త గొడవ చేసినట్లే వున్నారు. బస్సులను ఆపడం వగైరా అల్లర్లకు దిగారు. రైలు మీద దాడి చేయాలను కున్నారట కాని, జరగలేదు.

విద్యానగర్ కాలేజిలోకూడా సమ్మె జరిగింది. కాని అది strike by consent.

చిట్టగుంటలో హైస్కూలు విద్యార్థులు స్టేషన్ మీద దాడి చేశారు. ఇంజన్ల మీద రాళ్లు రువ్వారు. ఒక డీజిల్ ఇంజన్ గ్లాసులు వగైరా పగిలి పోయాయట.

కావలిలో పేర్కొన దగిన సంఘటన లేమీలేవు.

కందుకూరు తాలూకాలో వాచిలేటి పాడువద్ద ట్రంకురోడ్డుమీదవున్న చెక్ పోస్టు తగులపెట్టబడింది. టంగుటూరు నుండికాలోలు ఒకగుంపు లారీలోవచ్చి ఈపనిచేశారట.

కందుకూరులో విద్యార్థుల సమ్మెలే కాకుండా; 3 తేది న్యాయవాదులు పి. వి. బాలకృష్ణమూర్తి, సత్యనారాయణ, అతి వాద కమ్యూనిస్టులైన రావి చెంచయ్య, వి. రాఘవులు; వి. బాలకృష్ణగారలు ప్రాయోపవేశం ప్రారంభించి, సాయంకా లం విరమించుకున్నారట.

ఇతరచోట్ల విద్యార్థుల సమ్మెలు, బంద్ హర్తాళ్లుతప్ప ఇంకేమీలేదు.

## ఐదురోజులుగా రైళ్లులేవు

31 తేదిమొదలు 4 తేది సాయంకాలం వరకు రైలుకూత వినబడలేదు. ఐదురోజుల పాటు రైళ్ల రాకపోకలులేని సాదృశ్యం బహుశా రైళ్లపుట్టినప్పటినుండీ లేదేమో!

4 తేది మధ్యాహ్నం విజయవాడనుండి ఒక పైలెట్ రైలు వచ్చింది. అన్నిరైళ్లూ బహుశా రేపటినుండి నడవవచ్చునను కుంటున్నారు.

## గూడూరు రోటరీసేవ

రైళ్ళు, బస్సులు రాకపోకలు నిల్చిపోవ డంతో, గూడూరు స్టేషనులో తిరుపతి తది తర ప్రయాణీకులు వెయ్యిమంది వరకు నిల్చిపోయి, తిండికి తిప్పలకు అల్లాడు తున్నారు.

ఈ బాటసారులు దురవస్థనుచూచి గూడూరు రోటరీక్లబ్బువారు వీరాకొలు ప్రోగుచేసి భోజనం, పాలు, వైద్యసహాయం అందిస్తున్నారు. రోటరీ ఈ కృషికి వుదా రులైన స్థానికులనేకులు సహకరిస్తున్నారు. జనసంఘంవారు, పాలిటెక్నిక్ విద్యార్థులు కూడా తోడ్పడుతున్నారు.

ఈ ప్రయాణీకులను కనీసం ఒంగోలు వరకైనా బస్సులలో పంపాలని రోటరీ ప్రయత్నిస్తున్నది.

నిరుపమానమైన సేవ చేస్తున్న గూడూరు రోటరీ క్లబ్బీయులను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాము

## ఒంగోలులో బంద్ విఫలం

2 తేది ఒంగోలులో బంద్ పూర్తిగా విఫలమైంది. ఒక్క అంగడీ మూయలేదు. ప్రశాంతంగా వుండినది.

—

## ఆశాభంగం

ఐదవ వుక్కుఫ్యాక్టరీ విశాఖపట్నంలో నెల కొల్పాలని కేంద్రమంత్రివర్గ వుపసంఘం నిర్ణయించిందనే వార్త వచ్చింది.

కేంద్రమంత్రివర్గం ఉపసంఘ నిర్ణయాన్ని ఆమోదించగలదని ఆశించబడింది. ఈ కారణంవల్లనే ముఖ్యమంత్రి హామీపై అమృతరావుగారు నిరాహారదీక్ష విర మించారు.

కాని 4 తేది సాయంకాలం పార్లమెంటులో జరిగిన ప్రకటన ఈ ఆశలకు విరుద్ధంగా వుంది. మంత్రివర్గం ఈ ఫ్యాక్టరీని ఎక్కడ పెట్టాలనేది నిర్ణయించలేదని, ఇప్పుడు నిర్ణయించే వుద్దేశ్యంకూడా లేదని తేలింది.

ఈవార్త రాష్ట్రప్రజలను సంతృప్తి పరచ గలుగుతుందా? ఏమైనా వుద్రేకరహి తులమై వేచిచూద్దాం!

## అంధకారంలో ఆంధ్ర

(మొదటిపేజీకొరవు)

### విజయవాడ

విజయవాడలో ప్రదర్శకులు పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి నానాగలభా చేసి నప్పుడు పోలీస్ జరిపిన కాల్పుల్లో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. 17 మంది గాయపడ్డారు.

గాంధీనగరం కూడలిలో 2 సంవత్స రాల క్రితం ఆవిష్కరింపబడిన శ్రీ నీలం సంజీవరెడ్డిగారి నిలువెత్తు కంచువిగ్రహాన్ని ఆగ్రహావేశంలో నేలకు పడగొట్టి ముక్కలు ముక్కలుగా చేసేసి ప్రక్క కాల్వలో పారే శారు. బ్రతికున్న నాయకులకు విగ్రహ ప్రతిష్ఠాపనలు జరగకూడదనేది యిందు వల్లనే!

### గుంటూరు

గుంటూరులోకూడా పరిస్థితి దారుణమై పోయింది. అనేక ప్రభుత్వకార్యాలయాలపై సామూహిక దాడులు జరిపి రికార్డులు ధ్వంసంచేశారు, దహనంచేశారు. కమ్మ ర్షియల్‌టాక్సెస్ డిప్యూటీ కమీషనర్ కార్యాలయం, మున్సిపల్ భవనాలు, కెనరాబ్యాంకు, మున్సిపల్‌లైబ్రరీ, ఎంప్లా యిమెంట్ ఎక్చేంజి ఆఫీసులు యీదాడు లకు గురై రికార్డులు చిందరవందర చేయబడి, నిప్పుపెట్టబడినాయి. మున్సిపల్ లైబ్రరీ భస్మీపటలం అయిపోయింది. రైల్వే స్టేషనుపైకూడా దాడి సాగింది. టిక్కెట్లు స్టాకువుండే గదికి నిప్పు అంటిం చారు. 10 లక్షలు విలువచేసే ఆస్తి నిలు వునా బూడిదైపోయింది. సహకార స్టోర్సు గిడ్డంగులుకూడా లూటీచేసి తగులపెట్టారు. గుంటూరులో ఒక రోజంతా హోరకలి తాండవించింది; వొక శ్మశానమైపోయింది; వొక యుద్ధరంగమైపోయింది. గుంటూరు పోలీస్ కాల్పుల్లో ముగ్గురు మరణించారు, 28 మందికి తీవ్రంగా గాయాలు తగిలాయి.

బందర్‌లో రైల్వే బుకింగ్ ఆఫీసుపై ప్రదర్శకులు దాడి చేసి తగులపెట్టారు. అనేక రైల్వేపార్శిల్పును ఎవరికి దిక్కినవి వాళ్లు ఎత్తుకొని పోయారు.

నర్సారావుపేటలో రెండు ప్యాసెంజరు రైల్వేపెట్టెలకు నిప్పుపెట్టారు. ముఖ్య మంత్రి సోదరుడు, పార్లమెంటు సభ్యులు అయిన శ్రీ కె. వెంగళరెడ్డి యింటిపైకి మూకవుమ్మడిగావెళ్లి శ్రీ వెంగళరెడ్డిని, శాసనసభ్యులు శ్రీ ఆర్. చౌదరిని నిర్బం ధించి రాజీనామాలు పెట్టమని ఆదేశించారు. కిమ్మనకుండా వాళ్ళు రాజీనామా పత్రాలమీద సంతకాలుచేసి ఆ మూకకు అందచేశారు.

### విశాఖపట్నం

విశాఖపట్నం పరిస్థితి మరీ దారుణం అయింది. ఇక్కడి పోలీస్ కాల్పులలో 10 మంది మరణించారు. మరణించిన వారిలో ప్రసాద్‌అనే వొక బి. ఎస్‌సి. విద్యార్థికూడా వున్నాడు. 11 మంది ఈకాల్పుల్లో గాయపడ్డారు.

ఒక తుపాకి దుకాణాన్ని ప్రదర్శకులు లూటీచేయగా, ఆదుకాణదారుడు ఆత్మరక్ష ణార్థం కాల్పులుజరపగా యిద్దరు మరణిం చారు. వారిలోనివాడేనట పైచెప్పిన విద్యార్థి.

విశాఖపట్నం హెడ్‌పోస్టాఫీసులోకి ప్రదర్శకులు దౌర్జన్యంగా జొరబడాలని ప్రయత్నించినపుడు పోలీస్ కాల్పులు జర పగా జరిగిన మరణాలే మిగతావన్నీ అంటు న్నారు. నగరంలో వుద్రిక్త పరిస్థితి అలుముకొని, ఎట్టి అవాంతర పరిస్థితి సంభవించకుండా చూసేందుకు ప్రత్యేక విమానాల్లో విశాఖకు సైన్యం తరలించ బడిందనికూడా అన్నారు.

### విజయనగరం

విజయనగరం ప్రదర్శకులు స్టేట్ బ్యాంకును లూటీచేసి నిప్పుపెట్టి పోలీస్ స్టేషనుపై దాడి జరిపినప్పుడు పోలీస్ కాల్పులు జరపగా ఇద్దరు మరణించారు.

—

## శ్రీ అమృతరావు

( మొదటిపేజీకొరవు )

మొదటినుండీ ఉక్కు ఫ్యాక్టరీ కొరకు పట్టుదలగా కృషిచేస్తున్నారు. అందు వల్లనే ఈ వుద్యమంలో బ్రహ్మానంద రెడ్డిగారిపట్ల వ్యతిరేక భావం ఎక్కడా కనుపించలేదు. అమృతరావు దీక్షా విరమణ ముఖ్యమంత్రికి ఒకవిజయం.

రాష్ట్ర శ్రేయస్సు కోసం కఠోర దీక్షవహించి, ముఖ్యమంత్రి హామీపై విరమించిన అమృతరావుగారిని అభి నందిస్తున్నాము.

—

## రెండు రాష్ట్రాలు

(12 వ పేజీకొరవు)

మానా రాష్ట్రాల ఆర్థిక స్థితిమీద వ్యవ సాయం యొక్క ప్రభావమే ఎక్కువగా వుంటుంది. జనసాంద్రత చదరపు మైలుకు పంజాబులో 572 అయితే: హరియానాలో 447 అట. అందువల్ల హరియానాలోని హిస్సార్ జిల్లాలో పెద్ద పెద్ద కమతాలు ఎక్కువ. పంజాబులో మాత్రం ఇంక ఎదుగు బొదుగుకు అవకాశం లేదు.

వ్యవసాయ పద్ధతులు,పంటతీరులో,నీటి సౌకర్యంలో హరయానా పంజాబుకంటే వెనుకబడివున్నా సారంలో మాత్రం హరి యానా భూములు మేలైనవని చెప్పక తప్పదు. హరియానా రైతులు ఇప్పుడి ప్పుడు మేలిరకమైన పైర్లను, వ్యాపార పంటలకు మరలు తున్నారు. ఆహారధా న్యాలకు సంబంధించి పంజాబులో 72 లక్షల 15 వేల ఎకరాలు సాగవు తుంటే, హరియానాలో 86 లక్షల 82 వేల ఎకరాలు సాగవుతున్నది. అదే వ్యాపార పంటలు పంజాబులో 19 లక్షల 70 వేల ఎకరాలైతే, హరియానాలో 12 లక్షల 8 వేల ఎకరాలు. చెరకు, గోధుమ, పత్తి, రాలుబడి లెక్కకు తీసుకుంటె హరియానా ముందు వస్తుంది. 1961-62 లో హరి యానాలో వ్యవసాయం వల్ల 104 కోట్ల 52 లక్షలు ఆదాయం. ఈ ఆదాయం హరియానాలో ఇంకా పెరిగే అవకాశ ముంది; పంజాబులో సాగులోకి రావల సినభూమి ఇక అంతగా మిగిలిలేదు. కాని యాంత్రిక, శాస్త్రీయ వ్యవసాయంవల్ల పంజాబులైపు పంటను రెట్టింపు చేయ గలదు. ఇప్పుడే కొత్తపంజాబురాష్ట్ర వ్యవ సాయాదాయం 214 కోట్ల 55 లక్షలు.

—(నశేషం.)

—

## బాపట్ల డి॥ ము॥ కోర్టులో

S. C. No. 177 of 1966.

సూరగాని సుబ్బారావు — వాది.

కాగితాల ఆశీర్వాదం (తండ్రి శివరత్నం).

మురుకొండపాడు ... — ప్రతివాది.

వాది ప్రయుంటు పరిహారముల నిమిత్తము సీపై ఈ నెంబరున దావా దాఖలుచేయుగా సీకు నోటీసు నిమిత్తం 24-11-66 తేదీకి వాయిదా వేసినారుగాన, సదరు తేది పగలు 11 గం॥కు పై కోర్టువారి యెదుట స్వయంగాగాని, వకీలు ద్వారాగాని హాజరై సీకుగల ఆక్షేపణలు తెలుపుకొనని యెడల సీ పరోక్షమందు తీర్మానించబడును.

—మావిరాజు శ్రీహరికోటేశ్వరరావు.
వాదితరపు న్యాయవాది.


# శివారెడ్డి పద్యాలు

### చైనా రెడ్‌గార్డ్సు

కమ్యూనిస్టు చైన కథనమ్ము విన్నార?
ఆ విషాధగాధ అర్థమైంద?
ఎఱ్ఱజండకొఱకు ఎగ్గ్రబాకునాయన్ల
కింద్యకమ్యూనిష్టు కిరాక పాకం.

కాళ్లచేతులిరిచి కట్టేసి ప్రావనర్ల
బట్టకొద్ది పేడకట్టలిచ్చి
ముడ్డిమీదదన్ని మొయ్యిస్తువున్నారు
అచట రెడ్డుగార్డ్సు అనురల్బృందం!

బౌద్ధభిక్షకులను బట్టిబంధించారు,
గుళ్లగోపురాలు గూల్చినారు,
వుత్తమాంగనలను వురిదియ్యసాగారు
కత్తిసుత్తి మావో కాల్బలాలు!

దుష్టబుద్ధిమావొ దుర్యోధనునికన్న,
కంసరాజుకన్న ఖలఖలుండు
చెననలయ్యె, యింక జెప్పేదిపేముంది
నరకకూపమేర నవ్యచైన!

భూతలస్వర్గము వర్ణా
శీతము నవచైనఅని వదేపదె పిచో
కోతలగోస్తారిచ్చట
ప్రేతలు చెవ్వన్నలయ్యె ప్రియశిష్యులహా!

### విద్యార్థిసమ్మె

మేటరైనవాళ్ళ మీసాలుగడ్డాలు
వచ్చినోళ్ళు యూనివర్సిటోళ్ళు
చదువుకున్నవాళ్ళు సమ్మెల్లోపాల్గొంటె
దిలిపివనిదిగితె చేసెదేంది!

చిన్నబిడ్డలైతె దీవాట్లుబెట్టొచ్చు,
పట్టకొచ్చికొట్లొ గొట్టవచ్చు,
త్రాగుబోతులైతె తాసీలుబట్టొచ్చు
చదివెకుఱ్ఱవాళ్ళ సంకటమ్ము!

ఏ ప్రభుత్వమైన, ఎవరైన ఘోరాతి
ఘోరములకు ప్రజలు దారిదీస్తె
రాకపోకలాపి రౌడీజమొనరిస్తె
గవర్నమెంటు జూడి గమ్మగుంట్ద?

సద్యయింతకంటె విద్యార్థులనుగూర్చి
తడవబూనుకుంటె, తప్పవొప్పు
తేరబోస్తెముప్పు, తేలిగ్గబోనిచ్చ
తగిలితగలకుండ తప్పదన్న!

### అత్తివరపు వెంకటరామరెడ్డి

జగమెఱింగినోడు జస్టీసుపార్టీకి
జెందినోడు సిద్ధిపొందినాడు
వెంకట్రామరెడ్డి, విన్నాకయావార్త
చెవుల, నాకు కాలు చెయ్యి ఆళ్ల!

నాటుమోటుకవిని ననునత్కరించు ది
నాల్లో వొక్క పెద్దనప్పునన్ను
చేతికిచ్చివాని చెక్కు నూటవదార్లు
రామరెడ్డి మరపురానివ్యక్తి!

### హరేరామక్షేత్రం(ఇనమడుగు)

అబ్బ! ఏమిజెప్పుదు హరెరామక్షేత్రంలొ
రాత్రివగలు వొకటె రామభజన!
కలియుగంలొ యింతకంటెమార్గంలేదు
తా తరించ వేరు తపములేదు.

### బంద్‌లు

(4 వ పేజి తరువ)

రైతులకు వ్యతిరేకంగా కూలీలు, పెద్ద వ్యాపారస్తులకు వ్యతిరేకంగా చిన్నవ్యాపారులు – ఇలా సంఘంలో అంతర్ కలహం–సంఘర్షణను తీవ్రతరమై,విస్తృత ప్రభుత్వ వ్యతిరేకసంఘర్షణగా రూపొందించవచ్చు. ఐక్య సంఘటనలో యింత కుంభకోణం గర్భితమైవున్నదని తెలియని రాజకీయ పక్షాలు, నాయకులు, యీ దశలో వ్యతిరేకించీ అంత ప్రయోజనం వుండదు. తమ ప్రజలకే దూరంకావచ్చు. అదే జరిగితే కమ్యూనిస్టులకు అంతకన్నా కావలసిందేమీలేదు. అందరిపైన నాయకత్వం వారికే లభించి, కాంగ్రెసు వ్యతిరేక ప్రజలకు, ప్రతిపక్ష వుద్యమాలకు వారే నాయకులై, కాంగ్రెసు–కమ్యూనిస్టు పార్టీల మధ్య నవున్న ఇతరపార్టీల ప్రాముఖ్యత అంతర్ధాననమై, కమ్యూనిస్టుపార్టీ ప్రత్యామ్నాయ ప్రతిపక్షంగా అవతరించుతుంది.

భారతదేశం నేడున్న విపత్కర పరిస్థితిలో యిది ఒక అనూహిత ప్రమాదమునకు పునాది అవుతుంది. చైనా ఒకవైపు-పాకిస్తాన్ ఒకవైపు సమయం కొరకు సరిహద్దులలో సైన్యాలను పెట్టుకకూర్చుని వున్నవి. ముఖాముఖి యుద్ధంకన్నా ముందే అంతర్గత కల్లోలంతో భారత ప్రభుత్వ పతనం తప్పనట్లు చైనా–పాకిస్తాన్‌లు వూహించడమేగాక,ప్రయత్నిస్తున్నాయి. సరిహద్దులలో కొండజాతులకు గోరిల్లా యుద్ధంలో, విధ్వంసంలో తరిఫీదు ఇచ్చి అంతర్‌గత అరాచకీకసకాట్లులేవనెత్తుతున్నారు. ఐక్యసంఘటనలో ప్రముఖ భాగమైన అతివాద కమ్యూనిస్టులు యీ జాతుల అంతర్‌గత విధ్వంసమును స్వాతంత్ర పోరాటంగా చిత్రించి, వారికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఇవ్వాలని చాటుతున్నారు. సరిగ్గా చైనా–పాకిస్తాన్‌లు ఇదే చెప్పుతున్నాయి.

ఐక్య సంఘటనలో మరొక ప్రముఖ వర్గం, మితవాద కమ్యూనిస్టులు యీ వాదమును కాదనలేక పోతున్నారు. శతృవాదమునకు, మిత్రులకు-పైవర్గాల అభిప్రాయాలకు అంత వ్యత్యాసం లేనప్పుడు, "ఇప్పుడు శాంతియుత ప్రవర్తనతో చెప్పుతున్నాము. -ఈసారిమాత్రంఇలావుండదు" అని మితవాద కమ్యూనిస్టు నాయకుడు డాంగే ఢిల్లీ పార్లమెంటు ప్రదర్శనలో హెచ్చరించాడు. ఆ విధంగా యింటా–బయటా ప్రయత్నాలు సమన్వయం కావనే గ్యారంటీ ఏమిటి? కమ్యూనిస్టు పాలసీలను, కార్యక్రమాలను సిద్ధాంతరీత్యా వ్యతిరేకించే సంయుక్త సోషలిస్టులు, తదితరులు ఇందులో భాగస్వాములు కావడం విచారకరమైన విషయం. కొండజాతుల విధ్వంస యుద్ధాలను వీరు సమర్థించరు. కాశ్మీరుకు స్వయంనిర్ణయ హక్కును యివ్వటం వీరు కాదంటారు. నిజానికి పాకిస్తాన్, ఇండియా కలిసిపోవాలంటారు. చైనాను ప్రతిఘటించి ప్రతి అంగుళాన్నీ విముక్తి చెయ్యాలంటారు. కమ్యూనిస్టు, అతివాద మితవాద వర్గాలు యిందుకు వ్యతిరేకులు. అయినా గుడ్డి కాంగ్రెసు వ్యతిరేకతలో పడిపోయిన యీ పార్టీలు ప్రజలనుండి యెంతదూర మౌతాయో–అంత అధిగా యీ ఐక్యసంఘటనలలో అంతర్‌భాగం అయిపోవడం–తుదకు తాము విశ్వసించిన అభిప్రాయాలకు–ఆదర్శాలకు వ్యతిరేకంగా కొట్టుకపోవడంతో ఐక్యసంఘటనలు – బంద్‌లు కమ్యూనిస్టుల స్వీయప్రయోజనాలుసాధించే సాధనాలు అయిపోతున్నాయి.

పరిస్థితిని యింకోవైపునుండి సమీక్షించినా తెలిసేదేమిటి? ఈ అంతర్గత సంఘర్షణలతో ప్రభుత్వం పడిపోయిందనుకొండి. ఎవరు అధికారమునకు రాగలరు? ఐక్యసంఘటన అధికారమునకువచ్చి నేడది కోరేకోరికలు అమలుజరిపితే యేమవుతుందో యీ వ్యాసం ప్రారంభంలోనే చూదాము. అంతటితో సరిపోదుగదా? ఐక్యసంఘటనలో ప్రముఖ నాయకత్వమైన కమ్యూనిస్టులు నాగా–మిజో–గరో–కోసీ కొండజాతులకు స్వాతంత్ర్యం యివ్వాలి. కాశ్మీరుకు అధినివేశస్వాతంత్ర్యం యివ్వాలి. చైనా కోరినవరకూ భూమి నిచ్చి పరిష్కారం చేసుకోవాలి. ఐక్యసంఘటనలో యితరపార్టీలు యీ విపత్కర పరిష్కారములను అంగీకరించలేవుకావున ఐక్యసంఘటన అధికారం విచ్ఛిన్నం కావడమో–లేక అధికారం కమ్యూనిస్టులకు దఖలుకావడమో జరగాలి.

ఇంత రాద్ధాంతం దేశంలో కొనసాగుతున్నప్పుడు చైనా–పాకిస్తానులు వూరకుండవు. వారి దురాశ, దురాక్రమణకు అంతకన్నా సదవకాశం వుండబోదు కావున, వారి జయప్రద ప్రవేశానికి పరిస్థితి పరిపక్వమవుతుంది. ఇంతవాకా ప్రభుత్వ వ్యతిరేక ప్రతిఘటనలకు పురికొల్పబడిన ప్రజలు–దురాక్రమణను ప్రతిఘటించడం దుస్సాధ్యం కావచ్చు. నిజానికి అట్టిపరిస్థితి యీ పరిణామంలో సృష్టించను ఐక్య సంఘటనలో కొన్ని శక్తులు పద్ధతిగా కృషిచేస్తున్న సంగతి అర్థంచేసుకోగలిగితే యీ దృశ్యంస్వరూపం గ్రహించడం తేలికవుతుంది. ఈ పరిస్థితి మరో అవాంతరమును సృష్టించినా ఆశ్చర్యంలేదు. రాజకీయ పార్టీలు, నాయకులు విఫలమైనప్పుడు సైన్యంరంగంలో ప్రవేశించి అధికారమును చేపట్టవచ్చు. అలా చైనాకో, పాకిస్తాన్‌కో, లేక యిద్దరి సంయుక్త కుట్రకో–లేక వారి అంతర్గత మిత్రులకో దేశం దఖలయినా-లేక సైన్యానికి స్వాధీనమయినా స్వాతంత్ర్యం – ప్రజాస్వామ్యం స్వరూపాలంటూ వుండవనేది వేరే చెప్పనక్కరలేదు. సామాన్యప్రజలకు ఇందులో గర్భితమైన విషయాలు తెలియవు వారి చర్యల ఫలితం సాధించిన స్వాతంత్ర్యానికి నిర్మించుకున్న ప్రజాస్వామ్యానికి ప్రమాదం తీసుకరావడమేగాక, శతృదేశాల దురాక్రమణకు వేయూతనిస్తుందని తెలియదు. పోనీ ధరలుతగ్గి, ధాన్యందొరికి, జీతాలు పెరుగుతాయా అంటే వారాశించిన మేరకు అందవు సరిగదా – అనూహిత ఆర్థికనష్టం కలిగిస్తుంది. బెంగాల్‌లో రెండురోజుల బంద్ 38 కోట్ల రూపాయల వుత్పత్తిని పడగొట్టివేసింది.

ఈ విషయాలు, వీటి అర్థం తెలియక ప్రతిపక్షాలు యిట్టి కార్యక్రమంలో నిమగ్నమవుతున్నాయా అనేప్రశ్నకు సమాధానం కావాలి. ఈ కార్యక్రమం తెలిసి, పథకం ప్రకారం నడిపించే రాజకీయ శక్తుల వెనుక–ఇందుకు భిన్నాభిప్రాయాలా, లేక యిదేదో తాత్కాలిక సామాన్యప్రజల ఆందోళన అని, ప్రతిపక్షాలుగావుండి ఏదో ఒకటి చెయ్యకుంటే బలంరాదని, గుడ్డి కాంగ్రెస్ వ్యతిరేకత వారిని నక్రమ అలోచనకు రానిచ్చినట్లులేదు. ఈ వుద్యమాలు యేవో యాదృచ్ఛికంగా లేచినవేనని, లేక యెన్నికలు వస్తున్నాయికావున ప్రతిపక్షాలు ఓట్లకొరకు లేవనెత్తిన రభస అని కొందరు ప్రముఖులు వూహిస్తున్నారు. ఎందుకైనా కానివ్వండి, విదిరంగానైనా ప్రారంభం కానివ్వండి, ప్రజావుద్యమాలు అంటువ్యాధి లాంటిదనేదటుంది – యీ కార్యక్రమం వెనుక నిర్దుష్టమైన రాజకీయశక్తులు, పథకాలు లేవనుకొనడం, విస్మరించడం ఆత్మవంచనే అవుతుంది.

దీనికి పరిష్కారం పోలీసు, సైనిక చర్యలు కానేరవు. ఏ ప్రభుత్వమైనా ఆస్తి విధ్వంసమును, ప్రాణనష్టమును అరికట్టను, పోలీసు, సైన్యంపై ఆధారపడక తప్పదు. యీ రెంటి వినియోగమే పరిష్కారమనుకుంటే–యీ వుద్యమం ప్రజల మధ్య–ప్రభుత్వం మధ్య పోరాటంగా మారిపోతుంది. కావున అదే పరిష్కార మార్గం అనుకొనడం భ్రమఅవుతుంది. ఇదోరాజకీయసమస్య, రాజకీయసంక్షోభం కావున దీనిని రాజకీయంగానే పరిష్కరించాలి. ఈ కార్యక్రమం ఒక విస్తృత మహోద్యమంగా తయారుకావాలి, కాంగ్రెసుపార్టీ ప్రధానబాధ్యత వహించాలి. ప్రజాస్వామ్యంపై, స్వాతంత్ర్యంపై నమ్మకంవుండే అన్నిపార్టీలు, ప్రముఖులు యీ పరిణామంలో అదృశ్యంకాకుండా వుండాలంటే తీవ్రంగా ఆలోచించాలి.

నేటి దేశ ఆర్థికవ్యవస్థ – అభివృద్ధి–అవాంతరాలు, దుస్థితికి కారణాలు, పరిష్కార మార్గాలు స్పష్టంగా, నిర్భయంగా ప్రజలముందు పెట్టాలి. ఈ ఆర్థిక దృశ్యానికి, దేశాన్ని నేడావరించిన రాజకీయ ప్రమాదమును జోడించి వాస్తవిక చిత్రమును వారిముందుంచాలి. ఈ సంఘటనలు, బంద్‌లలో గర్భితమైన రాజకీయపార్టీలు, వాని కార్యక్రమాలను విస్పష్టంగా బట్టబయలు చెయ్యాలి. భారతదేశంలో ప్రభుత్వాన్ని తొలగించను ప్రజాస్వామ్య వసతులు, హక్కులు – ఎన్నికలు వున్నప్పుడు–కాంగ్రెసును ఓడించండి, యిష్టమొచ్చిన పార్టీని తెచ్చుకోండి, కాని యిట్టి హక్కులను వమ్ముచేసే విస్తృత వుద్యమాలకుతోత్పడి ఆశించిన కోరికలు తీరకపోగా, సాధించిన స్వాతంత్రం ఎలా అదృశ్యమై, నిరంకుశ, నిక్కష్టరాజ్య నిర్మాణానికో, పరదేశ దాస్యానికో ఎట్లా యిదంతా దారితీస్తుందో స్కూళ్ళు–కాలేజీలు–క్లబ్‌లలో పెద్దయెత్తున, చర్చలు, సంభాషణలు, సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, సేరంలాలా ఒకవైపు, యీ విషయాలపై విరివిగా పారస్యతం అందించుతూ రెండవవైపు; సామాన్యప్రజల సమస్యలను దట్టనమ్మత హక్కులను వినియోగించి శాంతియుతంగా సాధించను అరాచకీయ విధ్వంసములను అరికట్టను–స్వాతంత్ర, ప్రజాస్వామ్య రక్షణ సంఘటనలను నిర్మించి, నేటి విపత్కర పరిస్థితులలో ప్రజలకు అండగావుండడానికి పూనుకొనడమే నేటి దుస్థితికి పరిష్కారం.

---




కండల నొప్పులు
పోగొట్టుకోండి
ఇదిగో
# అమృతాంజనము

అమృతాంజన్‌లో శమనాన్ని కలిగించే 10 రకాల ఔషధాలు ఉన్నాయి. త్వరగా నమ్మకంగా నివారణ కలిగిస్తుంది. అతి కొంచెము వాడవలసి ఉండటంచేత ఒకే సీసా నెలల పాటు వస్తుంది. 70 ఏళ్ళు పేరు గడించిన అమృతాంజన్ బెణుకులకు, తలనొప్పికి, గుండె జలుబుకు, ఇతర బాధలు, జలుబులు మరియు నొప్పులకు అమోఘమైనది.

గాలిమార్పు, నిత్యజీవితంలో కావచ్చయాలు నొప్పులను, జలుబులను ఇతర బాధలను కలిగిస్తాయి. ఇంట్లో ఒక అమృతాంజన్ సీసా ఉంచుకోండి.

అమృతాంజన్ 10 రకాల
ఔషధాలు చేరిన మందు




అమృతాంజన్ క్రొత్తగా, అట్ట పెట్టెలో వస్తుంది. సీసా 'అయా'రేకుతో సీలు చేయబడి ఉంటుంది.

అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ


---

## పంచాంగం

### వర్షం

నవంబరు 4 తేదినుండి 12 తేదిలోగా యోగావయోగాలీతములు వుండుటవలన గాలితోకూడిన వర్షపాతములు సంభవమగునట్లు గ్రహగతికి చెప్పవలసియున్నది.

### విశాఖకార్తె

నవంబరు 6 తేది రాత్రి 9–27 గం.కు విశాఖకార్తె కటకజలరాశిలో ప్రవేశమగును. పూర్ణజలం.

### దీపావళి పండుగలు

10 తేది రాత్రి 4 యామమున చంద్రోదయ సమయమందు నరకచతుర్దశి అభ్యంగస్నానం. 11 తేది నరకచతుర్దశి. 12 తేది దీపావళిఅమావాశ్య.

### నవంబరు తిథులు

| | | | |
|---|---|---|---|
| 5 శని | సప్తమి | మ. | 1-39 గం.వ |
| 6 ఆది | అష్టమి | మ. 11-47 గం.వ | |
| 7 సోమ | నవమి | ఉ. | 9-37 గం.వ |
| 8 మంగళ | దశమి | ఉ. | 7-13 గం.వ |
| | ఏకాదశి | తె. | 4-42 గం.వ |
| 9 బుధ | ద్వాదశి | రా. | 2-04 గం.వ |
| 10 గురు | త్రయోదశి | రా. | 11-37 గం.వ |
| 11 శుక్ర | చతుర్దశి | రా. | 9-21 గం.వ |

—నిమ్మగడ్డ వెంకటేశ్వరశాస్త్రి.

---


## జమీన్‌రైతు

నంవత్సరం చందా ... రు. 12–00
6 మాసములకు ,, 7–00
అంతకు తక్కువకాలమునకు పంపబడదు.




★ ★ ★ శార్వరి ★ ★ ★

ఆకాశవాణి అపస్వరాలు

# దిలీప్-సైరాల పెండ్లి రేడియోలో చెప్పదగినంత ముఖ్య సంఘటనా?

**ఆకాశవాణి అపస్వరాలు**

ఆల్ ఇండియా రేడియో అనగా ఆకాశవాణి శ్రోతల అదరాభిమానాలను కోల్పోయి చాలాకాలమైంది. సిలోన్ పాటలకు, ఇప్పుడు ఢిల్లీనుండి వెలువడే పాటలను వినహాయిస్తే, చప్పెవరూ రేడియో వినరు సామన్యంగా. కారణం రేడియో కార్యక్రమ నిర్వాహకులు, వారు అనుసరించే విధానాలు... ఏమహా వ్యక్తి చనిపోతేనో, లేదా ఎన్నికల సమయంలోనో కాస్త ఆసక్తి కలిగిస్తుంది. అంతే.

ఇటీవల బొంబాయిలో ఒక తార-తారడు పెళ్లిచేసుకున్న వార్త రేడియో వ్రసారం చేయడం బహుశా మన ఆకాశవాణి చరిత్రలోనే ఒక కొత్త మలుపు. ఎన్నడూ పెళ్లిళ్ల వార్తలు రేడియో ప్రసారం చేయగా నేను వినలేదు. ఉత్తరాదిన బొంబాయిలో సైరాబాను-దిలీప్‌ల వివాహం బహుశా జాతీయ సమస్య అయివుంటుంది. లేదా, ఆ మహావార్త అందకపోతే, దేశం నష్టపోతుంది-అనుకొని వుంటారు రేడియో నిర్వాహకులు.

ఈ పెళ్లికి జాతీయ స్థాయిలో విలువ ఇచ్చినందుకు, ఒక దినపత్రిక ఖండించింది. కొన్ని సినిమా పత్రికలు రేడియో వారిని అభినందించాయి. పైగా దానిని న్యూస్‌రీల్ (వార్తా చిత్రంగా) తీసి, దేశం యావత్తుచూపి, భారతీయులను తరింపచేయనందుకు సమాచార శాఖవారిని కోప్పడ్డాయికూడా. మనదేశం అనేక రకాలుగా పతనమైపోయింది. ఇంకా దిగజారిపోవడానికి జారుడుమెట్లు లేకపోలేదు.

ఈరోజు దిలీప్-సైరాల వివాహం అంత ప్రాధాన్యంవహించిందా! అమెరికాలోనో, ఫ్రాన్స్‌లోనో అలా జరిగిందంటె అర్థం వుంది. దేశంలోనవాలక్షఉద్యమాలు,మరో లక్ష అలజడులు.... పరిష్కరించవలసిన సమస్యలు ఉండగా, రేడియో వారికి అతి ప్రముఖంగా కన్పించిన అంశం ఇదేనా! పతనానికి మరోపేరు ఆకాశవాణి నిర్వాహకుల నిర్వహణ కాదుకదా!

సినిమా తారల ఇళ్లపై ప్రభుత్వం దాడి చేసినపుడు, లక్షలు పట్టుకున్నపుడు, రేడియో ఆవార్తల్ని వ్రసారం చేసింది. ఎక్కడ అన్యాయార్జితం పేరుకొనిఉన్నదో ప్రజలకు తెలియచెప్పింది. అలాగే మంత్రుల అన్యాయాల్ని బయటపెట్టింది. ఇదే మహానటుడు పాకిస్తాన్‌యుద్ధానికిముందు భారతదేశంలోపాకిస్తాన్ ఏజంటుగా ఉన్నాడని, అతన్ని అరెస్టుచేయాలని ఢిల్లీలో పార్లమెంటు సభ్యులు[illegible]. ఆయనే భారతదేశ రక్షణ నిధికి పైసా ఇవ్వకుండా పరదేశశక్తుని చాటుకున్నాడు. ప్రభుత్వం సహించింది.

ఈరోజు అతని వివాహవార్త, అఖిల భారతస్థాయిలో ఒక ప్రధాన సంఘటన అయినట్లు రేడియో ప్రచారం చేయడం విడ్డూరంగా ఉంటుంది. రేపు మద్రాసులో, కలకత్తాలో, బెంగుళూరులో, బొంబాయిలో అనేకమంది తారలు-తారడులు పెళ్లి చేసుకుంటారు.... కార్యాలు చేసుకుంటారు. అవిఅన్నీ వార్తలుగా, వార్తా చిత్రాలుగా తయారుచేసి, ప్రజలకు వినిపించి, జన్మలు తరింపచేస్తారా రేడియో సమాచార శాఖీయులు!

ఒక సినిమాతార ఎవర్నో ప్రేమిస్తే ఇంక అదీవార్తే.... చేసేదీకలి వ్యాపారాలన్నీ వార్తలే, వార్తాచిత్రాలే.... ఇంక మంత్రులు, ఇతర వి. ఐ. పి. లు వారి పెళ్లిళ్లు, వారి ఇళ్లల్లో కార్యాలు అన్నీ వార్తా చిత్రాలే కావచ్చు. దేశాన్ని ఉద్ధరించి, కాస్తంత నైతిక విలువలు, మర్యాదలు నిలబెట్టలేనపుడు, వాటిలో లికిపోకుండా వాటిని ప్రజలకే వదలడం మంచిది. ప్రభుత్వం- కొన్నికొట్లు వెచ్చించి చేస్తున్న[illegible] మరీ పతనం చేయించకుండా ఉంటే అదేమేలు.



సిటడల్‌వారి "ప్రేమలో ప్రమాదం"లో రామకృష్ణ-కృష్ణకుమారి

## తెలుగు సినీసుందరికి రత్నాలహారం అలంకరించిన అక్కినేని లక్ష్మివరప్రసాద్

శ్రీ అక్కినేని లక్ష్మి వరప్రసాద్ పేరు చాలామందికి తెలియకపోవచ్చు. కాని తెలుగు సినీ ప్రేక్షకులందరికి తెలుసు. వారే శ్రీ ఎల్. వి. ప్రసాద్.

శ్రీ ఎల్. వి. ప్రసాద్ పేరు వింటేనే చేతులు జోడించాలి అనిపిస్తుంది. కారణం ఒకనాటు మహామేటి దర్శకులలో పనిచేసి, తన ప్రతిభనుచూపి తెలుగు సినీసుందరిని రత్నాలతో అలంకరించిన మహా మేధావి ఆయన. నేడు శ్రీ ఎల్. వి. ప్రసాద్‌కు షష్టిపూర్తి అయింది. అరవైయేళ్ల జీవితంలో శ్రీ ప్రసాద్ అనేక పాఠాలునేర్చి, ఎందరికో నేర్పి, ఎందరినో తీర్చి దిద్దారు.

శ్రీ ప్రసాద్ చిత్రాలలో నిశిత దృష్టి, శిల్పం, పనితనం కనిపిస్తాయి. లోపాలు సాధారణంగా కనిపించవు. తన లక్ష్యం మాటిగా సాధించడంలో ఆయన దిట్ట. ఆయన ఏనాడూ ఒకరిని అనుసరించలేదు. తనను తానే అనుసరించి తన మార్గం తాను ఏర్పర్చుకొని ఆదర్శ ప్రాయుడైనారు.

ఈనాడు ఎల్. వి. ప్రసాద్ నిర్మాత, దర్శకుడు, స్టుడియో అధిపతి,సంపన్నుడు. ఒకనాడు ఏమీలేనివాడు - ఉత్సాహం, పట్టుదల, మినహా. సినిమా నిర్మాణంలో వారికి తెలియని అంశం లేదీనాడు. కథ, స్క్రీన్‌ప్లే దగ్గరనుండి,సంగీతం, పాత్రలు, నటన వరకు అన్నింటిలోనూ సిద్ధుడే. చురకైన నటుడు. ఈనాటికీ ఆయన నిగర్వి.... సరళ స్వభావి, భావుకుడు ఎల్లప్పుడూ.

ఒకనాడు చినయాన్ని, దరిద్రాన్ని భోజనం చేసి కడుపు నింపుకొని, కళ్లల్లో వెలుగుల్ని సంతరించుకున్నాడు. అన్ని బాధలు, కష్టాలు ఆయనలో కారుణ్య రూపంలో కనిపిస్తాయి ఈనాటికి. తొలి రోజుల్లో మద్రాసులో ఒక ఫిలిమ్ కంపెనీ చిన్న 'ఎక్‌స్ట్రా'. అలా అతి సామాన్యుడుగా ఉంటూ, పరిశ్రమలలో ఒక్కొక్క మెట్టెక్కుతూ, వెనుతిరిగిచూస్తూ ముందడుగు వేశాడు. శ్రీ హెచ్. ఎం. రెడ్డిగారి 'గృహప్రవేశం' లో దర్శకుడైనాడు. అందులో ప్రముఖ పాత్రకూడా తానే పోషించాడు. "షావుకారు"లో శ్రీ ప్రసాద్ నటనకు తలదన్నిన వాడు ఈనాటికీ లేడంటే అతిశయోక్తి కాదు

—తరువాయి 10 వ పేజీలో


చంద్రభవన్
నెల్లూరు

31 సంవత్సరములుగా నెల్లూరులో అందరి మన్ననలు పొందుతూ యున్న నిలకడగల కాఫీ భోజనహోటల్

దీపావళికి
అనేక సరికొత్త రకములు
మిఠాయి - టపాకాయలు -
[illegible] - [illegible] -
[illegible] - [illegible] -
[illegible] వగైరాలు.
మాధవరావు స్టోర్సు.
ట్రంకురోడ్డు—నెల్లూరు
విన్ని - మెట్టూరు - D. C. M.
[illegible] - ఫోన్ :: 421.

— త్వరపడండి —
రూ. 11/- లకె స్టీలు మైనరు స్టెయిలు
తీసుకుని - రూ. 200/- లు ఖరీదుగలది.
40 నెలలు - ప్రతినెలా 'డ్రా' 11 తేది
మొదలు 11-11-1966.
రావు అండ్ గుప్త,
(పి. సి. బిల్డింగ్ నెం. 4 రు.)
ట్రంకురోడ్డు — నెల్లూరు.


### కందుకూరు మునసబు మేజస్ట్రేటువారి కోర్టులో

E. P. 68 of 66 Sc 310 of 64.


లింగారెడ్డి రమణారెడ్డి —వాది.

వాకా రోశమ్మ —ప్రతివాది.

ఈ నెంబరున షెడ్యూలు దాఖలాఆస్తి 21-11-66 తేదిన ఈ కోర్టువారిముందు యేలము జరుపబడును. కావలసినవారు పాటలు పెట్టుకొనవచ్చును.

షెడ్యూలు:- నెల్లూరుజిల్లా, కందుకూరు తాలూకా, కరేడుగ్రామములో నెం. 82 రు పట్టా దాఖలా కొరుమెట్ట సర్వే నెం. 277 రు. యె 2-28 ట్లలో యె 1-30 టున్నూ, సర్వే నెం. 275 రు, యె 5-02 ట్లలో యె 2-87 సెంట్లున్నూ. కుల్లు:- యె 4-17 ట్లు యేక ప్రదేశములో వరమటిచేను పట్టావాది భూమికి హద్దులు:- [తూ] లింగారెడ్డి వెంకటసుబ్బారెడ్డి భూమి [ద] లింగారెడ్డి రామకృష్ణారెడ్డి భూమి [ప] సర్కారు డొంక [ఉ] యెంబేటి పెదతాలమ్మ పురుషోత్తమ్మ అబద్దమ్మ కాలాడు ఈ నెంబరులోని భూమి. ఈ హద్దులలోని యె 2-09 ట్లు యీ భూమిని, మరికొంత ఆస్తిని వాకా సుబ్బారెడ్డికి ప్రతివాది 17-1-59 తేదిన రూ. 200/- లకు అంతకయ్యే వడ్డి నెల 1-కి 100-కి రూ. 0-75 పైసలు ప్రకారము పుంచిన అనుమానము అసలు ఫాయిదా బకులో బడి క్రియం రూ. 200/- లు, అమీనా క్రియం రూ. 400/- లు.

—యస్. సుబ్బారావు.
పిటీషనరు అడ్వకేటు.




**జి. శ్రీనివాసులు. నెల్లూరు.**

ప్ర: రామారావు, నాగేశ్వరరావు కలిసి ఏచిత్రంలోనైనా నటిస్తున్నారా?

జ: డి. ఎల్. గారి 'ఏకవీర'లో ఆ ప్రయత్నం జరిగింది. కాని వారు 'ఏకవీర' మానివేసినట్లు విన్నాను. బహా ఆ ఇద్దరు హీరోలనే పట్టుకుని ప్రాకులాడ్డం చాలామంది నిర్మాతలు మాను కొని, కొత్తవారితో బాగుపడుతున్నారు.

**సయద్ యస్. బాష కనిగిరి**

ప్ర: హిందీ తారలకు మేకప్ లేకపోయినా బావుంటారు. అలా మన తెలుగుతారలు మేకప్‌లేకుండా వుండగలరా?

జ: మీకు హిందీవారంటేఅభిమానం అంతే. నిజానికి దక్షిణాది తారలకు పెద్ద మేకప్ అవసరం లేదని, కొన్ని షేడ్స్ ఇచ్చి టేక్‌వేస్తేచాలని, చాలామంది ఒప్పుకున్నవిషయం. బయట వికారంగా కనిపించాలనే, బయటకు వచ్చినపుడు మేకప్‌తో వస్తారు.


గమనిక

ప్రశ్నలను
ఈ క్రింది చిరునామాకు పంపండి:
యామినీదేవి,
C/o శార్వరి,
12 బి. సుబ్బారెడ్డి స్ట్రీటు,
వెస్టు మాంబళం,
మద్రాసు-33


**ఇ. సులోచనారాణి కావలి**

ప్ర: సినిమాలలో చేరవలెనని సరదాపడెడి స్త్రీలకు మీరిచ్చే సలహా ఏమిటి?

జ: పిల్లల తల్లి అయినా 'కుమారి' అయి, అందం, గౌరవముంటే సరదా తీర్చుకోవచ్చు. దానికేం, అలాంటివారికి కాదు పొమ్మనేవారు ఇక్కడ ఎవరూలేరు.

**ఆర్. కొండయ్య పవని**

ప్ర: ఈమధ్య పిక్చర్సులో రామారావు గుమ్మడి కలిసి నటించడంలేదు. వారి ద్దరిమధ్య ఏదో తగాదాలు ఏర్పడినట్లు విన్నాం?

జ: కొంతవరకునిజం. అన్నపూర్ణ పిక్చర్సులో రంగారావు నటించడం మానుకున్నాక, నాగేశ్వరరావుకు గుమ్మడి అవసరం ఏర్పడ్డది. గుమ్మడిని ఆయన అభిమానిస్తున్నాడనితెలిసి, రామారావు కొంచెం దూరంగా జరిగాడు. నిజానికి గుమ్మడి, రంగారావు ఇద్దరూ 'హీరోద్వయం' రాజకీయాలకు అతీతులు. తమ ప్రజ్ఞ, ప్రతిభలపై పూర్ణ విశ్వాసం కలవారు.

**షేక్ ఖాదర్ భాషా జరుగుమల్లి**

ప్ర: అడుగుజాడలు వంటి చెత్త చిత్రమును నిర్మించుట ఎందుకు? ఎన్.టి. రామారావు అటువంటి పనికిమాలినపాత్ర తీసుకొనుట ఎందువల్ల? రేలంగి చిత్రమునే ఖూనీచేయలేదా! అసలు డాక్టర్ డైరెక్టు చేశాడా?

జ: చెత్తచిత్రాలు రాకపోతే, మంచిచిత్రాలు ఏవో ఎట్లా తెలియడం? ఎన్. టి ఆర్. ధరించిన పాత్ర పనికిమాలినది అయినా, నిర్మాతలు ఇచ్చినడబ్బు పనికివచ్చేదేగా. రేలంగి ఖూనీచేశాడా! డబ్బు.... డబ్బు ... పాత్రల విలువలు నశించి చాలాకాలమైంది. డాక్టర్ అంటారా. స్వయం ప్రతిభ చూపించి వుంటారు.

**కె. పాపారావు పెద్దపవని**

ప్ర: దాసివాకరు పాకిస్తాన్ గూఢచారిగా...

—తరువాయి 10 వ పేజీలో


పసిరికలు -
- కామెర్లు
భయపడవనిలేదు
•
డాక్టరు సి. [illegible] అయ్యంగారు.
రంగనాయకుల పేట—నెల్లూరు




## నెల్లూరు మునిసిపాలిటీవారి ప్రకటన

నెల్లూరు ట్రంకురోడ్డులో రంగమహల్ సినిమాహాలుకు యెదురుగా నూతనముగా కట్టబడిన "ఏ. సి. సుబ్బారెడ్డి" భవనములోని క్యాంటీనుషాపు రూములున్నూ, మరియు 2 మునిసిపల్ బంకులున్ను 1-12-66 తేది నుండి, 31-3-69 తేది వరకు అద్దెకు తీసుకొను హక్కున్నూ మునిసిపల్ ఆఫీసు వద్ద 7-11-66 తేది సోమవారం పగలు 10 గంటలకు మున్సిపల్ సెక్రటరీ మరియు స్పెషల్ ఆఫీసరు వారిచే బహిరంగముగా యాలం వేయబడును. సదరు వేలము షరతులు, గుత్త నిబంధనలు వగైరాలు వివరములు మున్సిపల్ ఆఫీసు పనిచేయు కాలములో తెల్సుకొనవచ్చును.

**యస్. యం. ముర్తుజా,**
సెక్రటరీ అండ్ స్పెషల్ ఆఫీసరు.
మున్సిపల్ ఆఫీసు, నెల్లూరు. 28-10-66.

## కడప డి॥ ము॥ కోర్టులో

E. P. 197 of 66. Sc. 249 of 65
సానా గోవిందు — —పిటీషనరు.
మాదిగ తుమ్మలూరు యంకటన్న, తండ్రి గంగయ్య - రాయిచోటి తాలూకా- కల్పనాయని చెరువు అగ్రహారం మజరా - మాదిగెపల్లె —రెస్పాండెంటు.

ఈ పిటీషనరు, రెస్పాండెంటు తాలూకు స్థిరాస్థిని వేలమునకు కోరినందున పైకోర్టు వారు వేలమునకుగాను 21-11-66 తేదికి వేసినారు. ఆ రోజున బహిరంగముగా పై కోర్టువారు వేలము వేయుదురు.

షెడ్యూలు:- కడప డిస్ట్రిక్టు రాయిచోటి సబ్ డి॥ లో చేరిన రాయిచోటి తాలూకు, చిన్నెపాడు పొలము:-
(1) నర్సారుపుంజ. డిస్ట్రిక్టు నె. 855 రు, య 2-60 సెంట్లు, తరం రు. 3-85 పై. క్రయం రూ. 200/- లు.
(2) డిటో నె. 856 రు, య 0-76 ల్లు, తరం రు. 0-75 పై. ఇందులో ⅜ భాగం రాన్ని సంన్యష్టం రూ. 80/- లు.
— కె రామమూర్తి, అడ్వకేటు.

## కుష్టు-బొల్లి

చర్మమేహపాకలకు దివ్యౌషధము.
**రెడ్డి అండ్ కో., (Regd)**
H. O.
గోపాలపురం - తూ. గో. జిల్లా.
బ్రాంచి:
ట్రంకురోడ్డు—నెల్లూరు.
వేలుమొదలియార్ వర్కుషాపు ప్రక్కన

# గోరా భావాలు

(4 వ పేజీ తరువాయి)

తప్పెటతీసుకొని, తప్పటవాయించుకుంటూ, నడిచి అరువుకొంటూ ప్రచారం చేసుకొన్నాడు. తన ఎన్నికల ప్రచారానికి లక్షలు ఖర్చుకాలేదు, వేలు ఖర్చుకాలేదు. అరకమైన మొండి విశ్వాసబలమే వారిని ముందుకు తీసుకెళుతుంది, వారిచేత వింత సిద్ధాంతీకరణలు చేయిస్తుంది.

అట్లాంటి గోరాగారు యీవారంలో నెల్లూరుకు వచ్చారు. నెల్లూరులో పార్టీ రహిత ప్రజాస్వామ్యవాదిగా శ్రీ కత్తుల రమణయ్య కొత్తగా రిజిష్టరుచేసుకోవడంతో ఆయన ఆహ్వానం మీదనే శ్రీ గోరాగారు నెల్లూరుకు వచ్చారు. నెల్లూరులో వారికి వి. ఆర్. కాలేజి లెక్చరర్ డాక్టరు డి. శేషాచలంగారు ఆతిధ్యమిచ్చారు. వారి ఆతిధ్యంవల్లనే కాబోలు వి. ఆర్. కాలేజి స్టాఫ్‌వారు ఎప్పుడూలేనిది ఒక చిన్నసమావేశం యేర్పాటు చేశారు. ఆ సమావేశం అనంతరం టౌనుహాలు బహిరంగసభలో వుపన్యసించారు. అయనతో బాటు రాడికల్‌హ్యూమనిస్టులు శ్రీ ఎం. రామమూర్తి, శ్రీ రాజారెడ్డిగారలు కూడా వుపన్యసించారు. బహిరంగసభకు శ్రీ శేషాచలం గారు అధ్యక్షతవహిస్తే, శ్రీ కత్తుల రమణయ్య స్వాగతం చెప్పారు.

శ్రీ గోరా వైభవ విరోధికాబట్టి కనీసం ఒక పూలమాలకూడా వేయలేదు. నెల్లూరులో యేకోశాకిస్కా నాయకుని సభ జరిగినా వీనుగుతొందాలంత పూలమాలలు వేసే అలవాటును కాస్త యీ వైభవవిరోధి పరోక్షంగా వెక్కిరించినట్లే అయింది.

ఇక ఎన్నికలను గూర్చి గోరాగారి భావాలు:- పార్టీలవల్ల ప్రభుత్వంలో పక్షపాతం - ప్రజల్లో చీలికలు ఏర్పడుతున్నాయనీ, పార్టీతత్వం ముదిరి అధికారపక్షం వారి ఆశ్రితపక్షపాతానికి దారితీస్తుందనీ అంటాడు. ఒక రాష్ట్ర శాసన సభ్యుణ్ణి పార్టీపేరుతో పిలవడం తప్పుఅలవాటు అంటాడు. ఎవరైనా ఎన్నికైనతరువాత ఓటువేసినవారికి, వెయ్యని వారికి కూడా ప్రతినిధి అవుతాడు కాబట్టి, ఫలానా నియోజక వర్గం ప్రజాప్రతినిధి అని మాత్రమే పిలవాలంటాడు. ప్రజాప్రతినిధులుగా వుండాల్సినవారికి మనం ఈ పార్టీలపేర్లు కగిలించి పొరపాటు చేస్తున్నందువల్లనే యీ పార్టీలు ఒకవిధంగా రాజకీయ కులాలుగా తయారై ప్రజల్లో చీలికలకు దారితీస్తున్నాయంటాడు.

అసలు ఈ పార్టీలపద్ధతి మనరాజ్యాంగ చట్టంలోనే లేదంటాడు. మన రాజ్యాంగ చట్టం 164 సెక్షనులో ముఖ్యమంత్రిని గవర్నర్ నియమించాలని మాత్రమేవుంది. అయితే మెజారిటీ పార్టీనాయకుణ్ణి ముఖ్యమంత్రిగా నియమించే ఆచారం విచిత్రంగా తలయెత్తిందంటాడు. 300 మంది వున్న శాసనసభలో 160 కలిస్తే అది మెజారిటీపార్టీ అవుతుంది. అందులో మళ్లీ 90 మందితో ముఠాకట్టినవ్యక్తి మెజారిటీ పార్టీనాయకుడౌతాడు; అంటే ముఖ్యమంత్రి అవుతాడు; అంటే 90 వోట్ల ముఠానాయకుడు 300 మందికి ముఖ్యమంత్రి అయ్యేవీలును యీ పార్టీతత్వం కల్గిస్తుంది. ఇందువల్లనే పార్టీల్లో గ్రూపులుకూడా యేర్పడుతున్నాయంటాడు. పార్టీలు, గ్రూపులువల్ల ప్రభుత్వం చిందరవందరై ప్రజాదృష్టిలేని గ్రూపురాజకీయాలుగా తయారవుతున్నాయంటాడు. అందువల్లే యీ అవకతవక ఆచారాన్ని తీసేసి మెజారిటీ పార్టీ మాత్రమేగాకుండా ఆ 300 మంది శాసనసభ్యులూ కలిసి అధికసంఖ్యాక ఓటుతో ఎన్నుకొన్నవాడినే ముఖ్యమంత్రిగా గవర్నరు నియమించే ఆచారం పెట్టుకోవాలంటాడు. ఇది కేవలం ఆచారం మార్పేగాని రాజ్యాంగంలో మార్పుకాదంటాడు. ఈ కొత్త ఆచారమే వుండివుంటే కేరళలో అసెంబ్లీసభ్యులంతా ఎన్నికయిన తర్వాత వాళ్ళసారికూడా సమావేశం గాకుండా రద్దయిపోయి వుండేదికాదు అంటాడు.

ఈ పార్టీలు వున్నందువల్లనే అసలు పార్టీ అభిప్రాయాలకే ప్రాముఖ్యతపోయి, ముఠాలు అధికారాన్ని చేజిక్కించుకొనే పెత్తన రాజకీయాలకు ప్రాముఖ్యత ఏర్పడిపోతున్నదంటాడు. ముఠాప్రాబల్యాలు, పెత్తన రాజకీయాలు దిదిగాబొరబడి ప్రజాదృష్టిఅనేది పూర్తిగా లోపించి పరిపాలన కలుషితమైపోయి, అంధఅధికార వ్యామోహం ఏర్పడి, వొకపార్టీతో యింకో పార్టీ పోటీపడుతూ చివరకు అన్నిపార్టీలు ప్రజలను మర్చిపోతున్నాయంటాడు.

పార్టీల్లో 'విప్' పద్ధతి వున్నందువల్ల అవతలి పార్టీలవారు ఎంత సబబుగా మాట్లాడుతున్నా, అది సబబని అందరికీ అన్పిస్తున్నా; అదంతా కేవలం కంఠశోషగా వుండి అంతా వేస్టు అయిపోయి వోటింగ్ వచ్చేసరికి విప్‌చెప్పినట్లు నడుచుకోవల్సి వస్తున్నదిగనుక; బిల్లులపై చర్చ అనంతరం నిర్ణయం కావల్సిందిపోయి, చర్చలకు ముందే నిర్ణయం నిశ్చయమై పోతున్నదంటాడు. ఏమిచెప్పారో అనేదానికన్నా ఏపార్టీవారు చెప్పారో అనేదానికే అసెంబ్లీల్లో ప్రాముఖ్యతకలిగి; మెజార్టీ పార్టీ యొక్క డిక్టేటర్‌షిప్, ఇంకా లోతుకుపోతే మెజార్టీముఠాయొక్క డిక్టేటర్‌షిప్ ఏర్పడి; అపోజిషన్ అనేది అహింసాయుతంగానే అంతర్థానమైపోయే ప్రమాదం వాటిల్లుతున్నదంటాడు. (Dictatorship of the majority party and nonviolent liquidation of opposition). ఆచరణలో యీ విధంగా పార్టీలపద్ధతివల్ల ప్రాథమిక ప్రజాస్వామ్యలక్ష్యాలే బుగ్గిపాలైపోతున్నాయంటాడు. ఈ పార్టీ విధానాల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వాలు, కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఏర్పడతాయిగాని ప్రజల ప్రభుత్వం ఏర్పడేమాటే పోతుందంటాడు. ప్రభుత్వాలు కేవలం మంత్రి స్వామికాలై పోయి ప్రజాస్వామిక సాంద్రతే తగ్గిపోతున్నదంటాడు.

ఎన్నికల గుర్తుల కేటాయింపుల విషయమై తాము త్వరలోనే హైకోర్టులో రిట్ వేయబోతున్నామనికూడా శ్రీ గోరా అన్నారు. ఎన్నికల్లో నిల్చోడానికి ఎవరో టికెట్ యివ్వాల్సిన పనిలేదని, ఎవరైనా సరే డిపాజిట్‌కట్టి నిల్చోవచ్చని, వారందరికీ ఎన్నికలగుర్తు వొకేసారి యివ్వాలనీ గోరావాదం. కాని ఆచరణలో యీపార్టీల పేరుతో పార్టీలఎన్నికలగుర్తులను ముందుగానే పదిహేనేళ్లముందరే కేటాయించడం జరిగిందనీ; ఎవరైనా పార్టీరహిత ప్రజాస్వామ్యవాదిగా నిల్చొంటే వారికిమాత్రం ఎలక్షన్లకు నాలుగైదువారాలముందు గుర్తు కేటాయిస్తారనీ - యిందువల్ల పార్టీలవారికేమో ఆగుర్తులుపదిహేనేళ్లుగాప్రచారంలో వుండి; పార్టీరహితులకేమో ఎన్నికలకు కొద్దికాలంముందే కేటాయించడంవల్ల అనహజమైనవివక్షత (unhealthy goodwill of the party symbol counts more) చూపడంచట్టవిరుద్ధమని తాను రిట్ వేయబోతున్నట్లు చెప్పాడు.

ఇట్లా పార్టీపద్ధతివల్ల రాజ్యాంగ సభకునే తప్పుతోవను పట్టిస్తున్నదని దక్షతతో అనర్గళంగా వాదిస్తూ—కేవలం స్వతంత్ర అభ్యర్థిగా నిల్చినంతమాత్రంచేత అతను పార్టీరహిత ప్రజాస్వామ్యవాది కాబోడని స్పష్టంచేశాడు. ముందు స్వతంత్ర అభ్యర్థిగానిల్చి గెల్చినతర్వాత ఏ పార్టీలోనో దూరే అవకాశవాదిగా వుండవచ్చును గనుక పార్టీ రహిత ప్రజాస్వామ్యంలో గట్టినమ్మకమున్నవారే ముందుకొచ్చి యీ వుద్యమాన్ని పోషించాలన్నాడు. అందుకు గోరా విన్పించిన నినాదం-"పార్టీ అభ్యర్థుల్ని బాయ్‌కాట్ చెయ్యండి, ప్రజా అభ్యర్థుల్ని బలపర్చండి". విన్నవారంతా ఆయన వాదంలోని వేడిని గ్రహించారుకాని యీ పార్టీరహిత ప్రజాస్వామ్యం అసలు ఆచరణలో ఎట్లా పనిచేస్తుందని చర్చించారు.

ఇన్నేళ్ళుగా యీ పార్టీ పద్ధతిలో ఆలోచించే అలవాటువల్ల యీఅసంతృప్తి జనించవచ్చుగాని, మన ఆలోచనా విధానంలోనే మార్పువస్తే ఇదేమంత ఆదారణకు అసాధ్యం కాదన్నాడు. ఏ మైనా ఆయన విశ్వాసం, సిద్ధాంతాల్లో నిజం కొంత లేకపోలేదనిపించింది. —మా ప్ర. వి.

---

# చిత్ర జగత్

(9 వ పేజి తరువ)

శ్రీ గూడవల్లి రామబ్రహ్మం గారు అసంపూర్తిగా వదలిన చిత్రం 'పల్నాటి యుద్ధం' దర్శకుడుగా శ్రీ ప్రసాద్ పేరు దర్శకుల జాబితాలోకి వచ్చింది.

శ్రీ ప్రసాద్ నిర్మాణం మెలుకువలు ఇతరులకు తెలియవు నిజంగా. ప్రతిఅంశం సూక్ష్మంగా పరిశీలించి, స్థిర నిర్ణయానికి రావడం ఆయనకు అలవాటు. అందుకే నిర్మాతలలోనూ మేటిఅయినాడు. ఈరోజా బొంబాయి రంగాల్లోనూ అగ్రశ్రేణి నిర్మాతలలో ఒక నిర్మాత, దర్శకులలో ఒక దర్శకుడు, సర్వ సమృద్ధమైన స్టుడియో యజమానులలో ఒకరు, మద్రాసులోని ప్రసాద్ స్టుడియో, కొన్ని కొన్ని ప్రత్యేక యంత్రాలకు ప్రసిద్ధి, ఇండియా వారికెక్కడలేని సాంకేతిక ప్రజ్ఞ ఇక్కడ ఉన్నది.

ఇప్పటికి శ్రీ ప్రసాద్ ఆదర్శంలో 50 చిత్రాలు వచ్చాయి. వాటిలో షావుకారు, సంసారం, కల్యాణం పన్నిపార్, మనోహర, మిస్సమ్మ, ఇటీవల శారద తో అఖిల భారత స్థాయిలో పేరు వచ్చింది. బేటీ బేటా, దాదేహా- ఇదయ కమలం (ఇల్లాలు)....
నాటికీ, నేటికి యువదర్శకులకు నిర్మాతలకు, నటులకు సైతం శ్రీ ఎల్. వి. ప్రసాద్ ఆదర్శ ప్రాయుడే, మార్గ దర్శకుడే.

### సరస్వతీ శపథం

తమిళంలో రజతోత్సవాలు జరుపుకుంటున్న 'సరస్వతీ శపథం' తెలుగులో శరవేగాన తయారవుతోంది. మూడు గంటలలోపు ప్రదర్శన కాలంలో తయారైన పౌరాణికం ఇటీవల కాలంలో ఇదే. మాటలు, పాటలు ఆరుద్ర అనువదిస్తున్నారు. పాటలు పి. సుశీల, ఘంటసాల కె. వి. మహాదేవన్ దర్శకత్వంలో పాడుతున్నారు. ఇందులో సావిత్రి, దేవిక, పద్మిని, కె. ఆర్. విజయ, నగేష్, హరనాధ్, ప్రభాకరరెడ్డి, శివకుమార్, నాగయ్య, శివాజి గణేశ్, జమిని గణేశ్ నటించారు.

### పార్వతీ పరమేశ్వరులు

శ్రీ రామా పిక్చర్ పతాకక్రింద శ్రీ బోళ్ల సుబ్బారావు కొత్తరకం పౌరాణికం 'పార్వతీ పరమేశ్వరుడు' ప్రారంభించారు. ఇది జనవరి నాటికి తయారవుతుంది.

ఇందులో కాంతా రావు, శోభన్‌బాబు, హరనాధ్, రామకృష్ణ, రాజశ్రీ, గీతాంజలి, మీనాకుమారి, ధూళిపాల, మిక్కిలినేని, చదలవాడ, రాజబాబు తారాగణం.

### మరోరకం మనసులు 'చిన్నారి మనసులు'

ఏమనసులు ఏమిటో, ఎవరి మనసులు ఎలాంటివో, ఏపాల్లో మనసులో జనానికి అర్థంకానిస్థితి ఏర్పడ్డది ఆదుర్తి దయవల్ల. చివరకు మహారచయిత ఆత్రేయకూడా మనసుల వలలోనే పడ్డారు.

సుచిత్రా మువీస్ పతాకక్రింద ఆత్రేయ స్వంతంగా డైరెక్టుచేసి, ప్రొడ్యూస్‌చేసే చిత్రం 'చిన్నారి మనసులు'. ఈ కథమీద ఆయన చాలాకాలంగా ఆలోచిస్తున్నారు. చివరకు ముడిపడ్డది. పాటలు ఆత్రేయ, దాశరథి వ్రాస్తున్నారు. రచన స్వంతంగా చేస్తున్నారు. క్లైమాక్సు పాటలు వ్రాసేశారు.

ఈ చిత్రాన్ని నెల్లూరు ప్రాంతంలో కాల్‌షీటులో చాలాభాగం చిత్రిస్తారు. మిగిలినసని హైదరాబాదు స్టూడియోలో తీస్తారు.

12 ఏళ్ల కుర్రాడికోసం చూస్తున్నారు ఆత్రేయ.

### జి. వరలక్ష్మి దర్శకత్వం

చంద్రశేఖర పిక్చర్సువారి చిత్రానికి శ్రీమతి జి. వరలక్ష్మి దర్శకత్వం నిర్వహించబోతున్నది. చిత్రంపేరు "మూగ జీవులు" ఇందులో ప్రసన్నలక్ష్మి (పాత నాగరత్నం), రాజకుమార్ (కొత్తముఖం) కనిపిస్తారట.

### సాహిత్య అకాడమీ బహుమతి పొందిన 'విశాలనేత్రాలు'

శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారి 'విశాల నేత్రాలు' నవలను బాబూమూవీస్‌వారు శ్రీ ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో సినిమా తీయ ప్రయత్నిస్తున్నట్లు పాఠకులకు తెలిసిందే. ఈ నవల బాగా ప్రజాదరణ పొందింది. ఈవాడు అకాడమీ ఆదరణకు పాత్రమైంది. సాహిత్యఅకాడమీవారు 'సినిమాకు ఎన్నికచేసిన నవల'కు బహుమతి ఇవ్వడం యిదే ప్రథమం. ఇదోమంచి సాంప్రదాయం కాగలదని ఆశిస్తున్నాం.

### తార కారుక్రింద పడితే జన్మ తరిస్తుందా ...

అనేక సినిమాల్లో చూస్తుంటాం. ఓ అందమైన అమ్మాయి, అందునా బాగా కలవారి అమ్మాయి కారుక్రింద ఓ అభాగ్యుడు పడడం, ఆమె అతగాణ్ణి, ఇంటికో, ఆస్పత్రికో చేర్పించి, స్వయంగా మందులు మాకులూతాగించి, అతనుకళ్లుతెరచి, నేనెక్కడున్నాను, మీరెవరు అంటే మీరు నా వద్దనేవున్నారు, నేను మీ దాన్నే అన్న మాట విని, అతగాడు బ్రతికినందుకు ఉక్కిరిబిక్కిరైప్రేమించేయడం; ఆ బికారి, సంపన్నుడు, సంసారి కావడం చూస్తున్నాం.

అలాంటి అదృష్టంకోసం కలలుకనే ఓ దౌర్భాగ్య దామోదరుడు మొన్న బొంబాయిలో 'తనూజ' అనే తార - నూతన్ చెల్లెలు-కారుకి అడ్డంపడ్డాడు. అయితే విధి మరోలా మారింది. అతగాడు అడ్డం రావడం ఆమె కారు, సినిమాలో పలె నడన్‌గా ఆగకుండా, డాష్‌కొట్టడము, అతడు మళ్లీకళ్లుతెరవకపోవడం, పోలీసులు ఆ అమ్మాయిని అరెస్టు చెయ్యడం, జామీనుపై విడుదలచేయడం.. తర్వాత కథ.

---

# ప్రశ్నోత్తరావళి

(9 వ పేజి తరువ)

జ: పొత్తిగాకాదు. అర్థంలేని ఈ ప్రశ్నకు సమాధానం అనవసరం. బాసివారర్ మీపైన 'దావా' వేయగలడు. మీ ఉత్తరం అంతా ప్రచురిస్తే.

**వై. హరిప్రసాద్**

ప్ర: పూనా విద్యాలయంలో చేరాలని వున్నది. క్వాలిఫికేషన్ ఏమివుండాలి?
జ: టెక్నికల్ శాఖకు ఇంటర్, డైరెక్షన్‌కు బి. య్యే. అనుకుంటాను. అయినా వారికి వ్రాయండి వివరాలు అన్నీ పంపుతారు.

## Wanted

Mine Manager approved by the Regional Inspector of Mines to work in Barytes or Steatite Mine. Apply before 15-11-66 stating age, experiance and Salary required to Messrs The South Indian Mining Comp, Betamcherla P.O. Kurnool District.



(5 వ పేజీ తరువాయి)

వెంకటగిరి-రాపూరురోడ్డులో త్రైవర్షిక రోడ్డుపని ఎత్తుకోనేలేదు. వెలికల్లు కట్టమీద రోడ్డుస్థితి అధ్వాన్నం. మొన్న 13 తేది మంత్రి ఏ. సి. గారు ఆ కట్టమీద ప్రయాణం సాగించలేక అర్ధగంటసేపు నిల్చిపోయారు. సూడూరు అసిస్టెంటుఇంజనీరు గారూ! దీనికెప్పుడు మోక్షం?

' ' '

రాపూరుకూ ఒక పంచాయతీ బోర్డు వుంది. దానికొక అధ్యక్షుడు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరూ వున్నారు. ఎందుకు? పన్నులు వసూలుచేసుకోడానికి, ఏపనిచేయకుండా నిద్రపోవడానికి తప్ప! ఈ వూరికి బస్‌స్టాండులేదు; ప్రయాణీకుల వసతిగృహంలేదు; మరుగుదొడ్డు లేవు. ఎండాగాలికి, కాలకృత్యావసరాలకు ముఖ్యంగా స్త్రీలదురవస్థ చెప్పలేము. బస్‌స్టాండు నిర్మాణానికి సమితికూడా గ్రాంటు యిచ్చిందట. ఏమైంది? ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు ఏమిచేస్తున్నాడు? ఆ పంచాయతీని, ఆ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ను ఎవరు నిద్ర లేవగొట్టాలో దయచేసి కాస్తచెప్పండి!

' ' '

నెల్లూరు-రాపూరు బస్సులు రెండు బ్రేకులునిలబడి రెండునెలలైంది. ఇటీవల గమ్యం చేర్చగలదనే ఆశలేని ఒక స్పేరు బస్సును వేశారు. అంటే రోజుకొకసారే ప్రయాణం. ప్రయాణీకులు చాల ఇబ్బంది పడిపోతున్నారు. ఆర్. టి. ఓ. గారూ! ప్రత్యామ్నాయమైన ఏర్పాటేమైనా చేయించండిసార్.

' ' '

రాపూరులో జూదం యెక్కువగావుంది; దానివల్ల తగాదాలుగూడా యెక్కువగా వున్నాయి. సబ్‌యిన్‌స్పెక్టరుగారికి వ్రాతపూర్వకంగా కొందరు పౌరులు నివేదించారటకూడా. వారు ఏమిచేశారో? —ఒ. వి.

## ఇస్కపాళెం ఇక్కట్లు

పేదల సౌకర్యార్థం ఒక అంగడిలో నిర్ణీత ధరకు బియ్యం అమ్మే యేర్పాటు చేశారు; సేరు రూ. 1-06 లకు తక్కువ దొరకడంలేదు.

చక్కెర పేదవారికి దొరకడంలేదు. బ్లాక్‌లో అయితే పుష్కలంగా వుంటుంది.

మా గ్రామ రేడియో పాటలు పాడుతుందిగాని వార్తలు వినిపించదు. రేడియో పాటలకొరకా?

పంచాయతీకొచ్చే వార్తాపత్రికలు మా కంటబడవు. గ్రంథాలయంలేదు.

—ఇదంతా వ్రాస్తున్నది "ఒక విద్యార్థి". ఇంతకూ యీ ఇస్కపాళెం రామిరెడ్డి దశరథరామరెడ్డిగారి రాజ్యంలోదో, దొడ్ల లక్ష్మీనరసారెడ్డిగారి ప్రభుత్వంలోదో అందులోలేదు.

## పొట్లపూడి చక్కెర

నెల్లూరు తాలూకా పొట్లపూడికి రెండు మూడు మాసాలుగా చక్కెరదర్శనంలేదు. ఎందువల్ల అని అడిగేవాడు లేడు. వీశ రూ 3-00 లు పెట్టి కొనలేక గ్రామస్థులు బాధపడుతున్నారు. ఆర్. డి. ఓ. గారూ! ఈ వూరికి చక్కెర తీసుకపోయి యెన్ని నెలలయిందో, అవిధంగా యెందుకు జరిగిందో కాస్త విచారించండి; గ్రామస్థుల యిబ్బందిని తీర్చండి. —గ్రామస్థుడు.

## తలుపూరు యూత్‌లీగ్

తుమ్మల తలుపూరు యూత్‌లీగ్‌వారు దశరావుత్సవాలను చాల వేడుకగా, వుత్సాహంగా జరుపుతున్నారు. సమితి అధ్యక్షుడు శ్రీ ఎం. ఆదినారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. పంచాయతీ అధ్యక్షుడు శ్రీ పి. సి. ఎస్. ప్రసాద్ ఆహూతులకు స్వాగతం చెప్పారు. జిల్లా వశువైద్యశాలాధికారి యూత్‌లీగ్ కార్యకలాపాలకు తమహర్షాన్ని వెలిబుచ్చారు లీగ్ అధ్యక్షుడు శ్రీ బి. శంకరయ్య సహాయాన్ని అర్థించారు. హైస్కూలు ప్రిన్సిపాల్ శ్రీ ఎల్. నందగోపాల్ గ్రాండు అసౌకర్యాన్నిగూర్చి, క్రీడా పరికరాల కొరతనుగూర్చి ప్రస్తావించారు. సమితి, పంచాయతీ అధ్యక్షులు తమ సహాయ సహకారాలను వాగ్దానం చేశారు. శ్రీ వేటూరు సంజీవప్పనాయుడు గారు బహుమతి ప్రదానం గావించారు.

తోట విజయలక్ష్మి డ్యాన్సు; రోజవారుగా వై వద్మజ అభినయం ప్రశంసార్హంగా వుండినవి. కార్యదర్శి శ్రీ వి.వి. రామయ్య వందనాలతో కార్యక్రమం ముగిసింది. యీ కార్యక్రమం ఏర్పాటులో రామకృష్ణ, హరనాథ్‌బాబు శ్రద్ధాసక్తులు ప్రతిబింబించాయి. లేబర్ వెల్ఫేర్‌ఫండ్ సహాయాన్నిపొందుటకు గట్టికృషిచేసి, యూత్‌లీగ్‌ను అభివృద్ధిపరచుకొనుటలో ఆ కార్యకర్తల పట్టుదలను చూడవలసివుంది. —టి. ఎం. ఆర్.

## మనుబోలు కళామందిర్

రవీంద్ర కళామందిర్‌కు శ్రీ బి. రామమూర్తి బి. ఏ., ఎల్‌ఎల్. బి. గారధ్యక్షులుగ; సి. ఆర్. రాఘవ కార్యదర్శిగ; పి. శ్రీనివాసులు సంయుక్త కార్యదర్శిగ; బి. కృష్ణారెడ్డి కోశాధికారిగ ఎన్నుకోబడినారు.

1967 జనవరిలో జిల్లావ్యాప్తమైన ఏకపాత్రాభినయ పోటీలను నిర్వహించుటకు నిర్ణయించారు. మూడు రూపాయల రుసుం, స్క్రిప్టుతో దరఖాస్తులు డిసెంబరు 15 తేదీలోగా కార్యదర్శికి చేరాలట.

## సూళ్లూరుపేట వార్తలు

జిల్లాపరిషత్ కార్యదర్శిగా నియమితులై బదలీ అయిన ఐ. ఎ. ఎస్. బి. డి. ఓ. శ్రీ సి. ఎస్. రంగాచారిగారికి సమితి సిబ్బంది గత 19 తేది ఘనమైన, హార్దికమైన వీడ్కోలు సన్మానం, విందు చేసింది. సమితి అధ్యక్షుడు శ్రీ వై. రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టరు దశరథరామరెడ్డి, మేనేజరు శ్రీ రామచంద్రరావు, శ్రీ కె. కృష్ణయ్య, శ్రీ వై. రామలింగం, ఎన్. ఇ. ఓ. శ్రీ రాజారెడ్డిగారలు శ్రీ రంగాచారిగారి పాలనా సామర్థ్యాన్ని గూర్చి, పాపులారిటీనిగూర్చి ప్రసంగించి అభినందించారు. శ్రీ రంగాచారిగారు కృతజ్ఞత తెలుపుతూ, జి. వ. కార్యదర్శిగా వున్నప్పుడు నాల్గుసార్లయినా సూళ్ళూరుపేటకు వచ్చిపోగలనని, తగినసహాయం చేయగలనని వాక్రుచ్చారు.

శ్రీ రంగాచారి సమితి ఆఫీసును చక్కబెట్టారు; సమర్థవంతమైన పాలనను ప్రవేశపెట్టారు; సిబ్బంది గౌరవాదరాలను పొందారు; ప్రజలతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకున్నారు, నిష్పాక్షికతద్వారా వారి అభిమానానికి పాత్రులైనారు; మంచి పేరుతో బదలీ అయినారు.

' ' '

దశరా వుత్సవాల సందర్భంలో శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కాళహస్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపకులు, ఆధ్యాత్మిక పత్రిక స్థాపకులు, శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు భగవద్గీతోపన్యాసములుగావించారు. వారివుపన్యాసాలు మొండి నాస్తికులను సైతం మూఢ ఆస్తికులుగా మార్చగల విధంగా అత్యంత ఆకర్షణీయంగా వుండినాయి. శ్రీ స్వాములవారిని కన్యకాపరమేశ్వరి పాలంటీరు సంఘంవారు నూటపదార్లతో, నూతన వస్త్రాలతో సత్కరించారు. శ్రీ అయితా శ్రీరాములు శెట్టి, శ్రీ అయితా చిన్న చెంగయ్యశెట్టిగారలు చెరి అర్ధనూటపదార్లు సమర్పించుకున్నారు.

23 తేది కన్యకాపరమేశ్వరిదేవికి గొప్ప వుత్సవం జరిగింది. —మా. వి.

——

# కూనిరాగాలు

(5 వ పేజీ తరువాయి)

గుట్టు చప్పుడుగాకుండా అదరాబాదరాగా డాక్యుమెంటరీసినిమాతీసేశారు. ఇదంతా మన సమాచార - పౌర సంబంధాలశాఖ అధ్వర్యంలో-పంచాయతీరాజ్యశాఖ సంబోధతో జరిగిందట. మన జి. వ వారుకూడా 15 వేలైతే చెల్లించారుగాని ఆ తర్వాత ఏమైందో అనుకొన్నట్లులేదు.

తీరా సినిమాఅంతాతీసేసి ఫిలింబాక్సు వచ్చింతర్వాత నెల్లూరు జి. వ. తనతో సంప్రదించకుండానే తీసినందుకు తీవ్ర నిరసననుతెల్పింది. జి. వ. అధ్యక్షులు శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డికూడా స్వయంగా తన నిరసనను వ్యక్తంచేస్తూ ఆ డాక్యుమెంటరీని ప్రదర్శించనీయకుండానే ఆంధ్రప్రభుత్వంవారికే తిప్పిపంపివేయమని కోరారట. అంటే ఆ డాక్యుమెంటరీచిత్రం ఎట్లావుందో చూసేభాగ్యంకూడా మనకు లేకుండాపోయిందన్నమాట! ఇట్లావుంటయ్ మనప్రభుత్వంచేసేపనులు! ప్రాంతీయ ప్రముఖుల సలహా-సంప్రదింపులులేకుండా ఎందుకు డాక్యుమెంటరీసినిమా తీయాల? ప్రదర్శనకాకుండానే ఎందుకు త్రిప్పి పంపించుకోవాల?

అయినా ప్రభుత్వం డాక్యుమెంటరీలు తీస్తే అందులో ప్రచారం తప్ప కళ అనేది వుండదు సామాన్యంగా. ఆ ప్రచారం కూడా కళాత్మకంగానైనా వుండదు. ఈ మధ్యనే కేంద్రప్రభుత్వంవారు స్వర్గీయ కందుకూరి వీరేశలింగంగారిపై వొక డాక్యుమెంటరీని నిర్మిస్తున్నారనీ; అందులో మన నెల్లూరు ప్రఖ్యాత మోనోయాక్టర్ శ్రీ వి. చంద్రశేఖరం వీరేశలింగం పాత్రను నిర్వహిస్తున్నారనీ విన్నాం. అదీ యింతదాక విడుదలైనట్లులేదు. మన ప్రభుత్వం చేసేపనులు అంత త్వరగా తెముల్తాయా?

డాక్యుమెంటరీల ప్రస్తావన వచ్చింది గనుక యీ రంగంలో అంతర్జాతీయఖ్యాతి నందిన నెల్లూరీయుడు డాక్టర్ పి. వి. పతిగారు జ్ఞాపకానికి రాకుండా వుండలేదు. ఆయన యమునానదిపై నిర్మించిన డాక్యుమెంటరీచిత్రం (where the jamuna flows) న్యూయార్కు కంపెనీచే విడుదలచేయబడి ప్రపంచప్రఖ్యాతి గడించింది. బర్మాషెల్ కంపెనీవారికి "మాన్‌సూన్" అనే రంగుల డాక్యుమెంటరీని నిర్మించి ఆంధ్ర గ్రామసీమ దృశ్యసౌభాగ్యానికి దివ్యత్వం చేకూర్చారు. ఆ కోవలో ప్రభుత్వంతీసే యీ చిత్రాలు వుంటాయని ఎట్లా అనుకోగలం? ఏమైనా నెల్లూరుపై వచ్చిన ఈ మొదటి డాక్యుమెంటరీ చిత్రానికి యిట్లాంటి గతి పట్టింది! అదేమనబాధ!

' ' '

మన నెల్లూరు వి. ఆర్. కాలేజివారి క్యాలెండర్ పుస్తకం మొన్న విద్యార్థులకు పంపకమవుతుంటే అది 'లోకలిస్టు' కళ్లబడ్డది. లోకలిస్టుకళ్లబడ్డ తర్వాత దాన్ని కలయచూడకుండా వుంటాడా? నక్కలు బొక్కలు వెతుకును - కుక్కలు చెప్పులు వెతుకును - లోకలిస్టు తప్పులు వెతుకును- అని మీరనుకోకుండా వుండాలెగాని, అందులో యేలాంటి అవసవ్యమైన తప్పులన్నీ బడ్డాయో చెప్పాలని వుంది!

ఉదాహరణకు 95 పేజీ చూడండి: College re-opens for the 3rd term fees–అనివుంది. ఏమిటి దీనర్థం? మూడవటరమ్ కాలేజి తెరవడం విద్యార్థుల నుండి జీతాలు వసూలు చేసుకోడానికేనా? అంటే మూడవటరమ్‌లో చదువు చెప్పబడదు- అని పరోక్షంగా చెప్పడమే అవుతుందా? ఇట్లాంటివాటిల్నే Unconscious truths అంటే, అపస్మారకసత్యాలు అని అంటారు. అట్లనే 133 పేజీలో "Preparation of holidays for the University Examinations going students begin" అని వొకవాక్యం. ఏమిటో యీ వాక్యనిర్మాణం! ఇంత అబద్ధరగా, ఇంత అశ్రద్ధగానా విద్యాసంస్థలు ప్రచురించే పుస్తకాలు వుండడం? ఇందుకోసమేనా విద్యార్థుల దగ్గరనుండి రెండేసి రూపాయలు రుసుం వసూలుచేసేది? పూర్వం దీనితోబాటు విద్యార్థులకు సిలబస్ కూడా అచ్చయి వస్తుండేది. రెండుమూడు సంవత్సరాలనుండి అదీలేదు!

ఇక కాలేజి రీడింగురూమ్‌కు వచ్చే పత్రికల లిస్టు ముద్రించి వున్నారు. అందులో స్వతంత్ర (Swatantra) అనే పత్రికకూడా వుంది. పాపం, ఖాసా సుబ్బారావుగారు వచ్చి వ్యక్షన యెక్కడున్నాడో? ఆ పత్రిక నిల్చిపోయి వొక దశాబ్దం కావస్తున్నది. కాని యీ కాలేజి రీడింగ్‌రూమ్‌కు వచ్చే పత్రికల లిస్టులో దానినిచేర్చారు కాలేజి ప్రముఖులు. ఇక టైమ్, న్యూస్‌వీక్, లైఫ్-అనే ఆంగ్ల పత్రికలు కూడా కాలేజికి వస్తున్నాయి. కాని ఆ పత్రికల పేర్లమాత్రం ఇందులో చూపలేదు. దీన్నిబట్టే అర్థమవుతుంది-యీ పత్రికలు అసలు రీడింగురూముదాకా అయినా పోవనీ, మధ్యలోనే ఎవరోకొట్టేస్తున్నారనీ. అసలు ఏ పత్రికలైనా పోవడానికి ఆ పదరు కాలేజిలో రీడింగురూము అంటూ వొకటివుంటేగదా! కాలేజికి యిన్నేళ్ళచరిత్ర వున్నా రీడింగురూము సౌకర్యమంటూ లేని కాలేజి బహుశా ఇదేనేమో! నిన్నగాకమొన్న ఏర్పడిన వాకాడు కాలేజిలో వున్నంతవరకు వొక రీడింగ్ రూము, అందులో కొన్ని దిన, వారఆంగ్లాంధ్ర పత్రికలు పెట్టడం జరుగుతున్నదే! ఇక్కడమాత్రం ఆ సౌకర్యంలేదు, కాని విద్యార్థులచేత లైబ్రరీ-రీడింగురూము ఫీజు అని టరమ్‌కు మూడు రూపాయలు ముచ్చటగా వసూలు చేస్తూనేవున్నారు. చూడండి, యీ పత్రికలన్నీ రీడింగురూము అనేది లేనందువల్ల, వున్నా అందులో పెట్టకపోవడంవల్ల విజ్ఞానం ఎంత వేస్టయిపోతున్నదో!

ఇక ఆడియో విజువల్ ఎడ్యుకేషన్‌ఫీజు అని మూడురూపాయలు కట్టాలని అసదరు క్యాలెండర్‌లో వ్రాసివున్నారు. ఆ పేరుతో ఫీజు చెల్లించడమేకాని చాలమంది విద్యార్థులకు అసలు ఆ పేరే కొత్తగా వుంటుంది! ఎందువల్లనీఆ విద్యార్థులు ఆడియోవిజువల్లూ ఎరుగరు, ఆ సదరు ఎడ్యుకేషనూ ఎరుగరు! మొన్న ఏర్పడిన కావలి కళాశాలలో ప్రొఫెసర్లు అమ్ముకొని, వొక థియేటర్ కూడా కట్టుకొని, రెగ్యులర్‌గా కొన్ని ఎడ్యుకేషనల్ చిత్రాలు చూపిస్తున్నారే! అక్కడ జరుగుతుంటేది యిక్కడెందుకు జరగవు? ఎందుకు జరగవో అడిగేదెవరు? సమాధానం చెప్పేదెవరు?

ఇక గేమ్సుఫీజు టరమ్‌కు మూడు రూపాయలనికూడా ఆ సదరు క్యాలెండరే చెప్తున్నది! ఒక ఫిజికల్‌డైరెక్టరుగారు ఈ గేమ్సు, స్పోర్ట్సును పర్యవేక్షిస్తారనికూడా వుంది. వాలీబాల్, హాకీ, క్రికెట్, టెన్నిస్ వగైరా ఆటలు ఆడించబడునని కూడా అందులో చెప్పబడివుంది. ఏదో అరుదుగాతప్ప కాలేజివిద్యార్థులు ఆటలాడడంగాని, వారిచేత ఆటలాడించడంగాని మనంచూడలేదు. ఇటీవలదాకవుండిన టెన్నిస్‌కోర్టు ఇప్పుడు ఎత్తివేయబడిందికూడా. ఈకోర్టు నిర్వహణ తతంగం కాలేజి ఆడిట్‌రిపోర్టులోకూడా ప్రస్తావించబడింది. మనకావిషయాలన్నీ తెలియవు కాని ఆ విద్యార్థులకట్నతో కొందరు లెక్చరర్లు టెన్నిస్‌బ్యాట్లు కొనుక్కోవడం జరిగిందనేది బహిరంగరహస్యం. కాలేజిలో ఫిజికల్ డైరెక్టరు ఒకరుకాదిప్పుడు, ఒకరికి ముగ్గురున్నారు. మూడోఆయన ఈ మధ్యనే అపాయింట్ కావడం జరిగింది. కాని ఆ సదరు ఫిజికల్‌డైరెక్టర్లు వుండడానికి ఒక గదిఅయినా లేదు. ఒక ఫిజికల్‌డైరెక్టరు గారికే చేయడానికి చేతినిండా పనిలేకపోతే ఇప్పుడు ముగ్గురుండడం ఎందుకు? అని అంటారేమో, అదివేరేవిషయం! గూడూరు సమితిఅధ్యక్షులు శ్రీ కుమారస్వామిరెడ్డి గారు ఇటీవల జిల్లాకాంగ్రెస్ రాజకీయాల్లో అటునుండి యిటు జంప్‌చేసినందుకు బహూకృతిగా ఆయన సంబంధీకులొకరికి యీ కాలేజిలో మూడో ఫిజికల్‌డైరెక్టరుపోస్టు వచ్చింది! ఇట్లా ఒక్కొక్క అంశాన్ని కదిలించే ఎంతైనా చెప్పుకునిపోవచ్చు!

ఎలిమెంటరీస్థాయి విద్య సమితుల క్రిందను, సెకండరీస్థాయివిద్య పరిషత్తుల క్రిందను మొత్తం అస్థాయివరకువుండే విద్య మన పంచాయతీరాజ్యంక్రింద మగ్గిపోతూ వుంటే ఇక కాలేజివిద్యకూడా యిట్లా తగలబడిపోతున్నది! మనం ప్రేక్షకులమే. అంతే!

——


## విటా - అశోక

**స్త్రీల పాలిటి వరప్రసాదిని.**

సకల పైత్యములనుపోగొట్టి, మలబద్ధకమును నివారించి, జీర్ణశక్తిని, ఆకలిని, రక్తవృద్ధినియిచ్చును. శ్వేత రక్త ప్రదరములను, మేహజబ్బులను, అన్ని రకములైన బుతుదోషములను, దీర్ఘసేవనచే వంధ్యాదోషమునను సైతము నివారింపగల ఔషధ రాజము.

చిన్నసీసా 1-కి రూ. 2-50 పై. పెద్దసీసా 1-కి రూ. 4-50.

☞ మావద్ద స్పెన్సర్సు ప్యూర్‌బ్రెడ్‌కూడ దొరకును.

**సి. ఆర్. గోపాలు,**

ఉయ్యాలకాలువవీధి — నెల్లూరు.



### వడుగుపాడు గ్రామ పంచాయతి

## టెండరు నోటీసు

నెల్లూరుజిల్లా, కోవూరు తాలూకా, వడుగుపాడు గ్రామ పంచాయతి స్పెషల్ ఆఫీసరుగారిచే యీ దిగువ సుదహరించిన పని చేయుటకు 15-11-66 తేది పగలు 11 గంటల వరకు సీల్డు టెండర్లు తీసుకొనబడును. అదేరోజు పగలు 11-30 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షమున టెండర్లు తెరువబడును. ధరావతు చెల్లించని టెండర్లు - సక్రమముగా లేని టెండర్లు అంగీకరించబడవు. యితర వివరములు ఆఫీసు పనిచేయు కాలములో తెలిసికొనవచ్చును.

| పనివివరము :- | ఎస్టిమేటు విలువ | చెల్లించవలసిన ధరావతు |
| --- | --- | --- |
| వడుగుపాడు బ్రాంచి రోడ్డునకు G. N. T. రోడ్డునుండి బైపాస్ రోడ్డువరకు రిన్యూవల్ చేయుట | రూ. 7700/- లు. | రూ. 385/- లు. |

—పి. రాధాకృష్ణమూర్తి, బి. ఏ., - స్పెషల్ ఆఫీసరు.

# పదేళ్లలో జరిగిందేమిటి?

(3 వ పేజీ కొరవ)

వుంటే యిప్పుడు పంచాయతీరాజ్యం గొడుగుక్రింద 1056 పంచాయతీలు వున్నాయి. ఈ గ్రామపంచాయతీల ఆదాయం అప్పుడు 9 లక్షల 50 వేలరూపాయలుంటే యిప్పుడు 34 లక్షలా 67 వేలు వున్నది. ఈఆదాయం ఎట్లా ఖర్చుకాబడుతున్నదనిమాత్రం అడగొద్దు. 1956లో కేవలం 20 పంచాయతీలకు భవనసౌకర్యముంటే యిప్పుడు 153 పంచాయతీలకు భవన సౌకర్యాలున్నవి.

మరో ముఖ్యమైన అంశం-పదేళ్లక్రితం ఏపంచాయతీలోనూ మంచినీటిపథకమనేది యేర్పడలేదు. అట్లాంటిది యిప్పుడు 25 గ్రామపంచాయతీలకు ప్రొటెక్టెడ్ వాటర్ సప్లయిస్కీములు యేర్పడ్డాయి. మంచినీటి సౌకర్యం యెరుగని మెట్టతాలూకాలగ్రామాల్లోనాలనిమాత్రం అడగొద్దు! మరో 15 పంచాయతీల్లో యీ మంచినీటి పథకాలకు మంజూరుకోసం ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపబడి వుండడమేగాక, మరో 52 పంచాయతీలకు మంచినీటి పథకాలు పరిశీలనలోవున్నాయి.

ఇక వీధిదీపాల సౌకర్యంవున్న పంచాయతీలు 1956 లో కేవలం 64 మాత్రమే వుంటే యిప్పుడు 352 పంచాయతీలకు వీధిదీపాల సౌకర్యంవుంది. రోడ్లు వగైరా పనులకు అప్పుడు 2½ లక్షలు మాత్రమే ఖర్చుపెడితే యిప్పుడు అఖర్చు 6 లక్షలకు పెరిగింది. పదేళ్ళక్రితం 148 పంచాయతీలకు కమ్యూనిటీ రేడియోసెట్లు వుంటే యిప్పుడు 870 గ్రామాలకు కమ్యూనిటీ రేడియోసెట్ల సౌకర్యంవుంది. ఈ రేడియోసెట్లకు సరిగా బ్యాటరీలు వున్నయా, వుంటే గ్రామాదులకు సరిగా వుపయోగపడుతున్నయా లేదా అనేది వేరే విషయమనుకోండి!

## సాంఘిక సంక్షేమం

1965 లో సాంఘిక సంక్షేమశాఖ పర్యవేక్షణక్రింద 36 హాస్టల్స్ (విద్యార్థుల సంఖ్య 1350) వుంటే యిప్పుడు జిల్లాలో 94 హాస్టల్స్ (విద్యార్థులసంఖ్య 6113) వున్నాయి. బోర్డింగ్ గ్రాంట్లక్రింద ఇప్పుడు 12 లక్షల రూపాయలు ఖర్చవుతుంటే పదేళ్లక్రితం 2 లక్షలు మాత్రమే ఖర్చవుతుంది. ఈ హాస్టళ్లపేరుతో, గ్రాంట్ల పేరుతో ఎంత గోల్ మాల్ జరుగుతున్నదోమాత్రం అడగొద్దు. ఇటీవలేకదా కొందరు పెద్ద మనుషులు నడుపుతున్న హాస్టళ్లమీద ఆకస్మిక దాడులు జరిగినప్పుడు అందులో హాస్టల్సుపనిలేక, విద్యార్థులూ లేకుండా వేలకొంది గ్రాంట్లుమాత్రం భోంచేస్తున్నారని తేలింది. గత పదేళ్లల్లో 2 లక్షల 48 వేల రూపాయల ఖర్చుతో 330 యిళ్ళు నిర్మించబడి వెనుకబడిన తరగతులవారికి యివ్వబడ్డాయట. అట్లనే హరిజనులయిళ్లస్థలాలకుగాను 3 లక్షలా 24 వేల ఖర్చుతో 156 ఎకరాల స్థలాన్ని వివిధచోట్ల సేకరించివున్నారు. ఇక్కడజరిగే గోల్ మాల్ కూడా అడగొద్దు. పదేళ్ళక్రితం 1 ప్రభుత్వ హాస్టలుంటే ఇప్పుడు 12 ప్రభుత్వహాస్టళ్లు వున్నాయి.

## ఆరోగ్యం

కొన్ని పంచాయతీసమితుల్లో రెండేసి చొప్పున ప్రయిమరీహెల్త్ సెంటర్లు అంటే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు. ఏర్పడ్డాయి మరికొన్నిసమితుల్లో ఒక్కొక్క హెల్తు సెంటరుచొప్పునే యేర్పడ్డాయి. కనిగిరి, ఉలవపాడు సమితులలో అసలు హెల్తు సెంటర్లే ఏర్పడలేదు. ఈ హెల్తుసెంటర్లకుగాని, తాలూకా హాస్పిటల్సుకుగాని అనుబంధంగా యిప్పుడు 20 గ్రామీణ, 12 అర్బన్ కుటుంబనియంత్రణక్లినిక్‌లు ఏర్పడ్డాయి. వీటిల్లో కుటుంబనియంత్రణపథకంక్రింద వేసక్టమీ, స్టెరిలైజేషన్ చేయించుకొన్నవారి సంఖ్యకూడా యీ క్రిందివిధంగావుంది. 1959 లో 77 మంది (42 పురుషులు, 35 స్త్రీలు); 1962 లో 230 మంది; 1965 లో 488 మంది; 1966 లో 1189 మంది (406 స్త్రీలు. 585 పురుషులు, లూప్‌లు వగైరాలు 198).

## విద్యుత్

1956 లో 28 గ్రామాలకుమాత్రమే విద్యుత్ సౌకర్యంవుంటే ఇప్పుడు 336 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఏర్పడింది. ఇంకా 700 గ్రామాలదాక విద్యుత్తులేక అంధకారంలోనే పడివున్నాయి. మెట్ట తాలూకాలగ్రామాలకు విద్యుత్ సరఫరా పరిస్థితి మరీ నత్తనడకలో వుంటున్నది. ఈ పదేళ్లలో 9950 ఇళ్లకు, 3850 వ్యాపారగృహాలకు, 380 పారిశ్రామికసంస్థలకు, 2930 వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరాగావించబడింది. పైకేమో ప్రభుత్వం వ్యవసాయానికే విద్యుత్తు విషయంలో అగ్రస్థానమివ్వబడుతుందని అంటున్నా ఆచరణలో అందుకు భిన్నంగా జరుగుతున్నట్లు పై లెక్కలే చెప్తాయి. వ్యవసాయ పంపుసెట్లకు కనెక్షన్లకోసం యింకా పడిగాపులు కాయవల్సేవస్తున్నది. 1956 లో 5 మెగావాట్ల థర్మల్ స్టేషన్ వుండింది, ఇప్పుడు బృహత్తరమైన 30 మె. వా. థర్మల్ స్టేషన్ యేర్పడింది. 1956 లో 3 మె. గా. విద్యుత్తు వాడకం జిల్లాకు సరిపోతుంటే యిప్పుడు జిల్లా వాడకం 15 మె. వా. కు పెరిగింది. ఇక 66-67 సంవత్సరానికి 48 గ్రామాలకు, 700 వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ యివ్వాలని అంచనావున్నా అది జరుగుతుందో లేదో సందేహమే.

## విద్య

1959 లో 49 సెకండరీ స్కూల్సు మాత్రమేవుంటే యిప్పుడు 141 స్కూల్సు వున్నాయి. అంటే 92 స్కూల్సు అధికంగా యేర్పడ్డాయి. ఇందులో 3 సంస్కృత పాఠశాలలు, 7 బాలికల పాఠశాలలు. పంచాయతీ సమితులక్రింద 1959 లో 2320 ప్రాథమిక పాఠశాలలుంటే యిప్పుడు 2930 వున్నాయి. ఈ పాఠశాలలకు తగిన భవనవసతివుందా, కనీసం పశువుల దొడ్ల వంటి సౌకర్యాలుండేవి ఎన్నివున్నాయి అని అడగవద్దు. తగిన వుపాధ్యాయులున్నారా, సైన్సు పరికరాలవసతివుందా అనికూడా అడగవద్దు. అవేవీ లేకపోయినా లెక్కకు పాఠశాలలుమాత్రం ఏర్పడ్డాయి. చదువులుమాత్రం సాగుతున్నాయి.

1959 లో 1 లక్ష 17 వేల మంది బాలురు, 70 వేల మంది బాలికలు పాఠశాలలకు వెళ్తుంటే;యిప్పుడు 1లక్ష 46 వేల మంది బాలురు, 1 లక్ష 1 వెయ్యి మంది బాలికలు పాఠశాలలకు వెళ్తున్నారు. బాలికలకుకూడా బాగా చదువు అందుతున్నది.

ఇక 'కేర్' సంస్థ సహాయంతో, వివిధ పంచాయతీ సమితుల ఆధ్వర్యంలో 780 కేంద్రాలకు 47 వేల మంది విద్యార్థులకు 'కేర్' ఆహార పదార్థాలు-పాలపొడి, రవ్వ వగైరాలు అందుతున్నాయి. ఈ రంగంలో జరిగే గోల్ మాల్ విషయమంటారా? అది వేరే విషయం!

## వ్యవసాయం

వ్యవసాయరంగంలోజరిగిన అభివృద్ధిని స్పష్టంగా చెప్పలేముకాని అనేక కొత్త రకాల విత్తనాలు, కొత్త వరి పైర్లరకాలు ప్రవేశ పెట్టబడినాయి. ఇక వరిపంట 1956 లో ఎకరాకు 8-10 వస్తాలువస్తుంటే ఇప్పుడు 15-18 బస్తాల పంట పండుతున్నదని వ్యవసాయ శాఖాధికారుల లెక్కలు చెప్తున్నాయి. ఇక ఎరువుల వాడకం.- పదేళ్ల క్రితం 5 వేల టన్నుల నైట్రోజన్ ఎరువులు వాడుతూవుంటే యిప్పుడు జిల్లాలో 15 వేల టన్నుల నైట్రోజన్ ఎరువులదాకా వాడకం వుంటున్నది. అయితే ఇందులో ఎంత భాగం ఎరువులు బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవలసి వస్తున్నది; ఎందరు బ్లాక్‌మార్కెట్లో అమ్ముకొనడం జరిగి ఎంతెంత వెనుకేసుకొని ఎంతగా బలిసిపోయిందిమాత్రం మనం చెప్పలేము! పొటాష్, ఫాస్ఫేటు ఎరువుల వాడకం కూడా యీ దామాషాలోనే పెరిగింది. ఇక ప్లాంట్ ప్రొటెక్షన్ మందులు, తెగుళ్ల వగైరా మందుల వాడకం కూడా విరివిగా పెరిగింది. సగంధర దామాషా క్రింద సబ్సిడీగా మొత్తం 3 లక్షల రూపాయల మేరకు యీ మందులు యీసంవత్సరము రైతులకివ్వబడ్డాయట. ధనాఢ్యులైన రైతులకా? లేక సన్నకారు రైతులకా? రైతుల కెంత చెందింది? మార్కెట్‌కు ఎంత పోయింది? అని మాత్రం అడగకండి!

ప్రత్తి పంటకూడా యిటీవలే జిల్లాలో ప్రవేశ పెట్టబడింది. గత సంవత్సరమే 300 ఎకరాలకు సరిపడే 3500 కేజీల ఏ216ఎఫ్ ప్రత్తి విత్తనాలు పంచబడ్డాయి. వెంకటాచలం సమితిలో సర్వేపల్లి రిజర్వాయరు క్రింద 100 ఎకరాలు కల్టివేట్ చేయబడిందటకూడా. అట్లనే వరిపొలాల్లో దాదాపు 25 వేల ఎకరాలదాక వేరుశనగ వేస్తున్నారట. పెన్నా డెల్టా ప్రాంతంలో మూడుపైర్లు పండించే రైతులుకూడా విశేషంగా వున్నారు.

తైచుంగునేటివ్, హైబ్రిడ్‌సజ్జ, జొన్న ప్రవేశ పెట్టబడి రైతులను విశేషంగా ఆకర్షించడం మొదలు పెట్టిందికూడా యిటీవలనే.

రెండు కొత్త స్కీములు: పండ్ల అభివృద్ధి పథకం, ముంతమామిడిచెట్ల అభివృద్ధి:- పండ్లతోటలు పెంచే వ్యక్తికి 3 వేల రూపాయలు; ముంతమామిడిచెట్లు పెంచే వ్యక్తికి 2 వేల రూపాయల చొప్పున మొత్తం 46 వేల రూపాయలు ప్రభుత్వం పంచింది కూడ గతసంవత్సరమే. అయితే యీ మొత్తం సరిగా వినియోగమై ముంతమామిడి - పండ్లతోటలు జిల్లాలో పెంపకం జరిగిందాలేదా అనేది వేచిచూడాల్సిందే.

ఇక కంపోస్టుపిట్ల విషయం చెప్పాలంటే చాలవుంది. గ్రామసీమల్లో కంపోస్టు పిట్‌లు వుండాలని ఈ పదేళ్ళనుంచి ప్రభుత్వం చెప్తూనేవస్తున్నది. ప్రచారం బాగా సాగిందనికూడా చెప్తున్నది. ఒట్టి మాటలేగాకుండా వొక కంపోస్టుపిట్‌కు 5 రూపాయల చొప్పున సంవత్సరానికి పది వేలు పంచాయతీలకు యిస్తూనే వస్తున్నది- శుద్ధదండుగ గదా!

## నీటిపథకాలు

ఇక మైనరుయిర్రిగేషన్ ప్రాజెక్టుల సంగతికూడా చాలెడుంది. ఈ నాలుగైదు పేళ్ళలోనే చెరువులరిపేర్లు వగైరాలకోసం 32 లక్షల రూపాయలు ప్రభుత్వం ఖర్చుపెట్టింది. వరదనివారణ పథకాలక్రింద ఈ రెండు-మూడేళ్ళలోనే 5 లక్షలదాక ఖర్చుపెట్టింది ఇక స్పెషల్ మెయిన్ టెనెన్సు పథకాలకోసం ఈ నాలుగేళ్లలో రూ. 16 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది.

పి. డబ్ల్యు. డి. ఉత్తర డివిజన్ క్రింద 1 కోటి 44 లక్షల ఖరీదు చేసే ఐదు మీడియం స్కీములు పూర్తయింది యీ పదేళ్లలోనే. రాళ్లపాడు, పాలేరు బిట్రగుంట, నక్కలగండి, పందువగండి, ఉప్పుటేరు ప్రాజెక్టుల క్రింద 21 వేల ఎకరాల సాగు అభివృద్ధి అయింది. ఇదిగాక 42 లక్షలు ఖరీదుచేసే 42 మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయినాయి. ఇదిగాక 82 లక్షల ఖరీదుచేసే 48 మైనర్‌స్కీములలో పని జరుగుతున్నది. ఇవన్నీ పూర్తిఅయితే 10-12 వేల ఎకరాల్లో సాగు అభివృద్ధి అవుతుంది.

ఇక దక్షిణాది సబ్ డివిజన్‌క్రింద యీ పదేళ్లలో 4 వేల 6 వందల ఎకరాలు సాగు అయ్యే 14 లక్షల రూపాయల స్కీములు పూర్తయినాయి. ఇదిగాక 58 లక్షలు ఖర్చయ్యే 48 స్కీములు చాలవరకు పూర్తవబోతూ వున్నాయి. వీటివల్ల అదనంగా 13 వేల ఎకరాలు సాగులోకి రావచ్చు.

ఇక రెండుకోట్లకుపైగా ఖర్చయ్యే కనుపూరుకాల్వపని ప్రారంభమై 6 సంవత్సరాలు కావస్తున్నా అతీగతీలేదు. ఇప్పటికి 65 లక్షలు ఖర్చుఅయినా వొక కొలిక్కి రాలేదు. ఇవన్నీ చెప్పుకొంటూ పోవాలంటే చాలాగ్రంథమవుతుంది.

ఇదంతా లెక్కవేస్తే యీ వివిధ ప్రాజెక్టులక్రింద దాదాపుగా యీపదేళ్లలో 7 కోట్ల రూపాయలు ఖర్చుచేసిందన్నమాట! ఇందుకుగాను ఎంతభూమి సాగులోకి వచ్చింది, ఎందరు రైతులు బాగుపడ్డారు అనేదానికన్నా; ఎంతమంది కంట్రాక్టర్లు, ఎంతమంది యింజనీర్లు బాగుపడ్డది లెక్కవేయడం సులభంగా వుంటుందేమో!

## జిల్లా ఆదాయం

ఇక ఆఖరుగా జిల్లాఆదాయం: పదేళ్ల క్రితం జిల్లాలో భూమిశిస్తుక్రింద 35 లక్షలు వస్తుంటే ఇప్పుడు 1కోటి 34 లక్షలకు పెరిగింది. పెనాల్టీలు-అవీ, యివీ లెక్కవేసుకొంటే యింకా యెక్కువేఅవుతుంది. పదేళ్లక్రితం 16 లక్షల ఆదాయం పన్ను వస్తుంటే యిప్పుడు 80 లక్షలు. ఇక సినిమాహాళ్ల వగైరాలమీద వినోదపు పన్ను అప్పుడు 2 లక్షలా 70 వేలు వస్తుంటే యిప్పుడు 10 లక్షల 20 వేలు వస్తున్నది. ఇక మోటారువాహనాలువగైరాలు కూడా విరివిగానే పెరిగాయి.

పారిశ్రామిక రంగంగూర్చి కలెక్టరు ప్రస్తావించనేలేదు. కొందరు విలేఖరులు వేసిన ప్రశ్నలకుకూడ సంతృప్తికరమైన సమాధానమూ రాలేదు. ఈ పదేళ్లనుంచి ఇండస్ట్రియల్ ఎస్టేటు అట్లనే పడివుంది, ఎదుగూబొదుగూలేకుండా. పరిశ్రమలపట్ల నెల్లూరు అధికారుల అనధికారుల నిరాసక్తతకు బహుశా ఇది సూచనేమో!

# ఇద్దరు మంత్రులు

(3 వ పేజీ కొరవ)

తారాసింగ్ బ్రిటిష్‌వాళ్లకు సలాం పెట్టగా, గురుముఖ్ సింగ్ తారాసింగుకు నమస్కారంపెట్టి దూరమైనాడు. శిక్కుగా మహోన్నత గౌరవస్థానాన్ని అలంకరించాడు. కాంగ్రెస్‌లో గురుముఖ్ సింగ్ శ్రీ నెహ్రూ అనుయాయుడు. పదకొండేళ్లపాటు పంజాబు ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా వుండినాడు; కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడుగా చాలాకాలం వుండినాడు. రాజ్యాంగసభ సభ్యుడుగా శ్రీ ముసాఫిర్ పాత్ర ఎప్పుడూ జ్ఞాపకం వుండేది. దేశభాషగా హిందీవుండాలనే తీర్మానం ఒక్క ఓటుతో నెగ్గింది;-ఆఓటువోటు శ్రీ ముసాఫిర్‌ది. మూడుసార్లు పార్లమెంటు సభ్యుడుగాకూడా ఎన్నికైనాడు.

ముసాఫిర్ రాజకీయవాదేకాదు; కవి, కథారచయిత. పంజాబీభాషలో చిన్నచిన్న కథలు చక్కగా వ్రాస్తారట.

## భగవత్ దయాళ్

హరియానా ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారంచేసిన వ్యక్తి శ్రీ భగవత్‌దయాళ్ శర్మ. 49 ఏండ్లవయస్సు; చురుకుదనం-కరకుదనంగల గట్టిమనిషి, వ్యష్టిసత్యాగ్రహంలో రాజకీయాలలోకి దూకాడు. క్విట్ ఇండియా వుద్యమంలో కూడా నాలుగైదేళ్లు జైలుశిక్ష అనుభవించాడు.

1946లో జైలునుండి వచ్చినతర్వాత పిలాని కాలేజీలో లెక్చరరుగా చేరాడుకాని ఎంతోకాలం వుండలేకపోయాడు. కార్మిక నాయకుడుగా తిరుగా రాజకీయరంగంలో ప్రవేశించాడు. ఎన్నో అంతర్జాతీయ కార్మిక మహాసభలకు హాజరయ్యాడు. పాశ్చాత్య దేశాల కార్మికోద్యమాలను స్వయంగా తెలుసుకొన్నాడు. భగవత్ దయాళ్ మొట్టమొదటగా కాంగ్రెస్ శాసనసభ్యుడుగా ఎన్నికైంది 1962లోనే. భగవత్ దయాళ్ పౌరుష-చురుకుదనాలు ఆకర్షించాయేమో, కైరాన్ వారిని మంత్రిగా తీసుకున్నారు. మంత్రిత్వానికి రాజీనామాయిచ్చి ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షతను స్వీకరించారు. లేతవయస్సు, ప్రతిభ, రాజకీయ దాక్ష్యం, కార్మిక సంబంధంగల భగవత్ దయాళ్ హరియానాను అభివృద్ధి పథంలో వుండగలడని ఆశిస్తున్నారు.

# రెండు రాష్ట్రాలు

(3 వ పేజీ కొరవ)

బడిన కాలువలు హరియానా అంతటా వ్యాపించివున్నాయి. అందువల్ల వ్యావసాయికంగా రెండు రాష్ట్రాలు ఎంతైనా అభివృద్ధి చెందవచ్చు. నీటిపారుదల, విద్యుచ్ఛక్తి అభివృద్ధి విషయంలో పంజాబ్ ఒకేఒక 'యూనిట్' గా పరిగణింపబడి పథకాలు అమలుజరుపబడ్డాయి. నీటి పారుదల విషయంలో ఎంత సమగ్రమైన కృషి జరిగిందో ఇది చదివితే మీకే తెలుస్తుంది. రావినది నీళ్లు కాల్వద్వారా బియాస్‌నది జలాలతో కలుపబడినవి. అట్లనే బియాస్ నీళ్లు సట్లెజ్ జలాలతో కలుపబడుతున్నవి. భాక్రాజలాలు యమునకుపంపే పథకం కూడావుంది. ఈవిధంగా నదులు, కాల్వలు పంజాబంతా అల్లుకొని, 1963-64 నాటికే దాదాపు 84 లక్షల ఎకరాలు పంట పొలాలుగా కళకళలాడు తుండినాయి.

అయినా వ్యవసాయంలో పంజాబు కంటే హరియానా వెనుకబడివుంది. ఇర్రిగేషన్ సౌకర్యాలుకూడా ఎంతో అభివృద్ధి చెందవలసివుంది. నీటి సౌకర్యంవుంటే గుర్గావ్, మొహిందర్‌ఘర్ జిల్లాలలోని ఇసుకనేలలో బంగారు పంటలు పండుతాయి. హరియానాకు కాల్వలద్వారా నీటిపారుదల జరుగవలసిందేకాని, భూగర్భజలాన్ని బయటకు తీయడం కష్టసాధ్యమే కాకుండ, వుప్పగావుండేసరికి పైర్లకు నిరుపయోగంకూడా! పంజాబులోని మూడు నదులకాల్వలగుండా హరియానాకు పారుదల వసతివున్నా; యమున, దాని ఉపనదులమీద డ్యాముల నిర్మాణం జరగడం అవసరం. యమునకు ఉపనదియైన టన్సుకు కసేవద్ద 770 అడుగుల ఎత్తున ఆర్కిడ్యాం నిర్మించే పథకం ఒకటి పరిశీలన పూర్తియై నిర్మాణానికి సిద్ధంగావుంది. ఇక్కడ 750 మెగావాట్ల విద్యుచ్ఛక్తి వుత్పత్తిచేసే పవర్‌స్టేషన్ నిర్మాణంకూడా జరుగుతుందట.

నీరు పుష్కలంగావుండే పంజాబుకు ముంపునమస్య వొకటివుంది. దీనికి డ్రెయినేజిసౌకర్యాలు అవసరం. పంజాబులో గొట్టపుబావులు, పంపుసెట్లు, పర్షియన్ చక్రాలబావులద్వారా ఇంకా ఎంతోభూమి సాగయ్యే అవకాశముంది.

ప్రస్తుత పంజాబులో 303 లక్షల ఎకరాలుంటే, అందులో 188 లక్షల ఎకరాలు సాగులోవుంది. పైర్లుపెట్టబడే విస్తీర్ణం, రెండుకార్లభూముల్తోచేర్చి, 240 లక్షల ఎకరాలు. ఇందులో 90 లక్షల 5 వేల ఎకరాలు పంజాబులో, 85 లక్షల 65 వేల ఎకరాలు హరియానాలోవుంది. పైర్లు సాగుచేయబడుతున్న ప్రదేశం పంజాబులో 113 లక్షల 20 వేల ఎకరాలు, హరియానాలో 109 లక్షల 38 వేల ఎకరాలువుంది పంజాబులో 17.6 శాతం, హరియానాలో 26.8 శాతం,ప్రజలు వ్యవసాయం మీదఆధారపడి వున్నారు. దీనిని బట్టి చాలకాలం వరకు పంజాబు- హరి

—కొరవ 7 వ పేజీలో

Edited, Printed and Published by N. Sree Ramamurthy at The Zamin Ryot Press, 170, Thipparajuvari Street, Nellore, (A. P.)